


సంక్షేమ
# మనసర్కార్
Follow: manasarkar

సంపుటి: 01 ::: సంచిక:170 | హైదరాబాద్ 21 జనవరి 2026, బుధవారం | పేజీలు: 8, వెల: రూ. 5/-
Vol-01 ::: Issue-170 | Hyderabad 21 January 2026, Wednesday | Pages: 8, Rs. 5/-




## బీజేపీ బాస్ నితిన్ నబిన్‌కు
# 'జెడ్' కేటగిరీ



**న్యూఢిల్లీ (ఏడీఎన్ఎన్) :**

భారతీయ జనతా పార్టీ నూతన జాతీయ అధ్యక్షుడిగా మంగళవారం బాధ్యతలు స్వీకరించిన నితిన్ నబిన్‌కు కేంద్ర ప్రభుత్వం భారీ భద్రతను కల్పించింది. ఆయనకు ముప్పు పొంచి ఉందని ఇంటెలిజెన్స్ బ్యూరో ఇచ్చిన నివేదిక ఆధారంగా కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఆయనకు అత్యంత ఉన్నతమైన 'జెడ్' కేటగిరీ భద్రతను మంజూరు చేస్తూ నిర్ణయం తీసుకుంది. దీంతో ఇకపై సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ వీఐపి విభాగానికి చెందిన కమాండోలు నితిన్ నబిన్‌కు నిరంతర రక్షణ కవచంగా వ్యవహరించనున్నారు. నితిన్ నబిన్ దేశవ్యాప్తంగా పర్యటించేటప్పుడు, బహిరంగ సభల్లో పాల్గొనే సమయంలో సీఆర్పీఎఫ్ కమాండోలు ఆయన వెన్నంటే ఉంటారు. ఆయన నివాసం వద్ద కూడా ఈ దళాలు 24 గంటలూ నిఘా ఉంచి పహారా కాస్తాయి.

...::: తరువాయి 2వ పేజీలో..



## అసెంబ్లీ నుంచి
# గవర్నర్ వాకౌట్!

**చెన్నై (ఏడీఎన్ఎన్) :**

తమిళనాడు రాజకీయాల్లో గవర్నర్ ఆర్.ఎన్. రవి , అధికార డీఎంకే ప్రభుత్వం మధ్య ఉన్న విభేదాలు మరోసారి అసెంబ్లీ వేదికగా రచ్చకెక్కాయి. జాతీయ గీతం ఆలాపన విషయంలో తలెత్తిన వివాదంతో గవర్నర్ తన సంప్రదాయ ప్రసంగాన్ని చదవకుండానే సభను వదిలి వెళ్లారు. 2024, 2025 తర్వాత వరుసగా మూడో ఏడాది కూడా అదే కారణంతో గవర్నర్ వాకౌట్ చేయడం ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది.రాజ్యాంగబద్ధ పదవుల మధ్య ముదురుతున్న ఈ విభేదాలు రాష్ట్ర రాజకీయాల్లో వేడిని పెంచుతున్నాయి.

...::: తరువాయి 2వ పేజీలో..



# బీహార్‌లో 'నిర్భయ'

**పాట్నా (ఏడీఎన్ఎన్) :**

బీహార్ రాజధాని పాట్నాలో మనస్సు కలచివేసే దారుణ ఉదంతం వెలుగుచూసింది. ఒక ప్రైవేట్ హాస్టల్‌లో ఉంటున్న యువతిపై సామూహిక అత్యాచారం చేసి, దారుణంగా హత్య చేసిన ఘటన రాష్ట్రవ్యాప్తంగా నిరసనలకు దారితీసింది. బాధితురాలికి న్యాయం చేయాలని, నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ ప్రజలు, ప్రతిపక్షాలు రోడ్లపైకి వచ్చారు. పోస్ట్‌మార్టం నివేదికలో దిగ్భ్రాంతికర విషయాలు బయటపడ్డాయి. జనవరి 14న పాట్నా మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్ వైద్యులు ఇచ్చిన నివేదిక ప్రకారం, యువతిపై లైంగిక దాడి జరిగిన ఆనవాళ్లు ఉన్నట్లు నిర్ధారించారు. శరీరం లోపల అంతర్గత గాయాలు ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. అయితే, మరింత స్పష్టత కోసం , సెకండ్ ఒపీనియన్ కోసం ఆ రిపోర్టును ఢిల్లీలోని ఎయిమ్స్ కు

...::: తరువాయి 2వ పేజీలో..

## ఏఐ సాయంతో ఫిర్యాదు
# వాట్సాప్‌లో ఎఫ్ఐఆర్



**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

సైబర్ నేరాల బాధితులకు ఊరటనిస్తూ తెలంగాణ పోలీస్ శాఖ ఒక సంచలన నిర్ణయం తీసుకుంది. ఇకపై సైబర్ మోసాలకు గురైన వారు ఫిర్యాదు చేయడం కోసం పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా, ఇంటి వద్ద నుంచే ఫిర్యాదు చేసే వెసులుబాటును కల్పించింది. దీనికోసం హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు 'సీమిత్ర' పేరుతో ఒక ప్రత్యేక వర్చువల్ హెల్ప్ డెస్క్ ను అందుబాటులోకి తెచ్చారు. సాధారణంగా సైబర్ మోసానికి గురైనప్పుడు బాధితులు 1930 నంబర్‌కు కాల్ చేస్తారు లేదా ఆన్‌లైన్ పోర్టల్‌లో రిజిస్టర్ చేస్తారు. అయితే, అక్కడితో పని పూర్తికాదు. ఎఫ్ఐఆర్ నమోదు కావాలంటే బాధితుడు స్వయంగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు పత్రం..

...::: తరువాయి 2వ పేజీలో..

'సీఎం బావమరిది కుంభకోణం బయటపెట్టినందుకే విచారణ' | జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో మాజీ మంత్రిని ప్రశ్నించిన సిట్ | చట్టంపై గౌరవంతోనే వచ్చానని హరీశ్ వెల్లడి

## 'సిట్'ను నేనే
# ఎదురు ప్రశ్నలడిగా!




**ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంతో తనకు ఎలాంటి సంబంధం లేదని, ముఖ్యమంత్రి బావమరిదికి సంబంధించిన బొగ్గు కుంభకోణాన్ని బయటపెట్టినందుకే ప్రభుత్వం కక్ష కట్టి తనపై విచారణకు దిగిందని మాజీ మంత్రి హరీశ్ రావు ఆరోపించారు. అసలు సిట్ అధికారులు తనను ఒక్క ప్రశ్న కూడా అడగలేదని వెల్లడించారు. తానే స్వయంగా సిట్ అధికారులను వంద ప్రశ్నలు అడిగానని ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో సిట్ విచారణకు మంగళవారం హాజరైన తర్వాత తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హరీశ్ రావు మాట్లాడారు.**

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

ఫోన్ ట్యాపింగ్ కేసులో తనను విచారణకు పిలవడంపై హరీశ్ రావు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రభుత్వ తీరును , అధికారుల విచారణా సరళిని ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. కేవలం రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే తనను పిలిచారని, అంతే తప్పించి ఈ కేసులో వాస్తవాలు వెలికితీసే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని ఆయన చెప్పారు. గత ప్రభుత్వంలో తాను ఆర్థిక మంత్రిగా పనిచేశానని పేర్కొన్న ఆయన ఈ వ్యవహారంతో తనకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. ఫోన్ ట్యాపింగ్ గురించి అడగాలనుకుంటే అప్పట్లో హోం శాఖ బాధ్యతలు చూసిన వారిని, లేదా సంబంధిత అధికారులను ప్రశ్నించాలని సూచించారు. అప్పటి ఇంటెలిజెన్స్ చీఫ్‌గా పనిచేసిన ప్రస్తుత డీజీపీ శివధర్ రెడ్డిని ఎందుకు విచారించడం లేదని ఆయన ప్రశ్నించారు. అలాగే మాజీ డీజీపీ మహేందర్ రెడ్డిని ఎందుకు అడగడం లేదని నిలదీశారు. క్షేత్రస్థాయిలో బాధ్యత వహించాల్సిన ఉన్నతాధికారులను వదిలేసి కేవలం రాజకీయ కక్షతోనే తనను పిలిచారని ఆయన మండిపడ్డారు. తన ప్రశ్నలకు సమాధానం చెప్పలేక సిట్ అధికారులు నీళ్లు నమిలారని హరీశ్ రావు ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతోందని, దాని నుంచి దృష్టి మరల్చేందుకే తనను టార్గెట్ చేశారని హరీశ్ రావు ఆరోపించారు. ముఖ్యంగా రేవంత్ రెడ్డి బావమరిదికి సంబంధించిన బొగ్గు కుంభకోణం నుంచి ప్రజలను డైవర్ట్ ...

...::: తరువాయి 2వ పేజీలో..

## సీఎం 'డైవర్షన్' డ్రామాలకు
# భయపడేదే లేదు



**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

రాజకీయ వేధింపులే ధ్యేయంగా సాగుతున్న రేవంత్ రెడ్డి సర్కార్ 'డైవర్షన్' డ్రామాలకు తాము భయపడే ప్రసక్తే లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. తెలంగాణ భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎలాంటి పస లేదని సాక్షాత్తూ సుప్రీంకోర్టే చెప్పినా, కేవలం రాజకీయ కక్ష సాధింపు కోసమే హరీశ్ రావుకు నోటీసులు ఇచ్చారని మండిపడ్డారు. 'ఓటుకు నోటు' కేసులో డబ్బుల కట్టలతో రెడ్ హ్యాండెడ్‌గా దొరికిన నేరచరిత్ర రేవంత్ రెడ్డిదని, ఇప్పుడు ఆ బురదనే అందరికీ అంటించాలని ముఖ్యమంత్రి చూస్తున్నారని ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బావమరిది సృజన్ రెడ్డి కేంద్రంగా సింగరేణిలో భారీ టెండర్ల రిగ్గింగ్ జరుగుతోందని కేటీఆర్ సంచలన ఆరోపణలు చేశారు...

...::: తరువాయి 2వ పేజీలో..



## 'భారత్ ఫ్యూచర్ సిటీ' లో
# యూఏఈ పెట్టుబడులు

- తొలిరోజే కీలక ఒప్పందాలు
- టెక్ దిగ్గజం గూగుల్‌తో వ్యూహాత్మక భాగస్వామ్యం
- ఇజ్రాయెల్ ఇన్నోవేషన్ అథారిటీతో స్టార్టప్‌ల బలోపేతానికి అంగీకారం

...::: ;పూర్తి కథనం 5వ పేజీలో..



## ప్రపంచ కుబేరుడి..
# సరికొత్త ప్లాన్

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

టెస్లా అధినేత, ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ మరోసారి సోషల్ మీడియా వేదికగా సంచలనం సృష్టించారు. యూరప్‌కు చెందిన భారీ బడ్జెట్ ఎయిర్‌లైన్ 'ర్యాన్‌ఎయిర్'ను కొనుగోలు చేయాలా..? వద్దా..? అంటూ తన ఎక్స్ ఖాతాలో పోల్ నిర్వహించారు. ర్యాన్‌ఎయిర్ సీఈఓ మైఖేల్ ఓ'లియరీతో జరిగిన మాటల యుద్ధం తర్వాత మస్క్ ఈ పోల్ పెట్టడం ప్రాధాన్యం సంతరించుకుంది. ర్యాన్‌ఎయిర్ విమానాల్లో స్టార్‌లింక్ ఇన్‌ఫ్లైట్ వైఫై సేవలను ప్రవేశపెట్టే అంశంపై రెండు పక్షాల మధ్య వివాదం మొదలైంది. స్టార్‌లింక్ ఖర్చులు తమ వ్యాపారానికి

...::: తరువాయి 2వ పేజీలో..

## సీఎం చంద్రబాబు
# దావోస్ విజన్



**అమరావతి (ఏడీఎన్ఎన్) :**

ప్రపంచ ఆర్థిక సదస్సు వేదికగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పెట్టుబడుల వేటను ముమ్మరం చేశారు. రాష్ట్రానికి అత్యాధునిక సాంకేతికతను, దిగ్గజ సంస్థలను రప్పించడమే లక్ష్యంగా ఆయన వరుస భేటీలు జరుపుతున్నారు. ఐబీఎం, గూగుల్ వంటి అగ్రగామి సంస్థల అధినేతలతో సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ మంగళవారం జరిపిన చర్చలు రాష్ట్ర ఐటీ రంగంలో కొత్త ఆశలు రేకెత్తిస్తున్నాయి. రాష్ట్రంలో గ్రీన్ ఎనర్జీ, ఐటీ, తయారీ రంగాల్లో ఉన్న అవకాశాలను వివరించి, పెట్టుబడులను ఆకర్షించడమే ఈ పర్యటన ప్రధాన ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు. ఐబీఎం ఛైర్మన్ , సీఈవో అర్వింద్ కృష్ణతో జరిగిన భేటీలో ఏపీకి సంబంధించి ముఖ్యమైన ప్రతిపాదనలు చర్చకు వచ్చాయి. రాజధాని అమరావతిలో ..

...::: తరువాయి 2వ పేజీలో..

# ఆ మూడు దేశాలూ నావే




**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి అంతర్జాతీయ రాజకీయాల్లో పెను దుమారం రేపారు. తన ట్రూత్ సోషల్ వేదికగా ఆయన షేర్ చేసిన ఒక మ్యాప్ ప్రపంచవ్యాప్తంగా చర్చకు దారితీసింది. ఆ మ్యాప్‌లో గ్రీన్‌లాండ్‌ను అమెరికా భూభాగంగా, కెనడాను అమెరికా 51వ రాష్ట్రంగా చూపించారు. దక్షిణ అమెరికాలోని వెనిజులాను కూడా అమెరికా ఆధీన ప్రాంతంలా చిత్రీకరించడం గమనార్హం. ఏఐ సాంకేతికతతో రూపొందించినట్లు కనిపిస్తున్న ఈ మ్యాప్‌తో పాటు, ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, విదేశాంగ మంత్రి మార్కో రూబియోతో కలిసి గ్రీన్‌లాండ్‌లో అమెరికా జెండా పాతినట్లు ఉన్న మరో ఫోటోను కూడా ట్రంప్ పోస్ట్ చేశారు. "గ్రీన్‌లాండ్ - యూఎస్ టెరిటరీ, 2026లో స్థాపన" అనే క్యాప్షన్ దీనికి జోడించడంతో సంచలనానికి దారి తీసింది. యూరప్ దేశాలతో గ్రీన్‌లాండ్

...::: తరువాయి 2వ పేజీలో..

## మేనకాగాంధీ పై
# సుప్రీం సీరియస్!



...::: సమగ్ర కథనం 2వ పేజీలో..

## ఏ ఆధారాలతో ఆయనపై కేసులు
# ఉపసంహరించారు?



వివరణ ఇవ్వాల్సిందిగా ప్రభుత్వానికి ఆదేశాలు

**అమరావతి (ఏడీఎన్ఎన్) :**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుపై గత ప్రభుత్వ హయాంలో నమోదైన పలు ఏసీబీ కేసుల ఉపసంహరణ వ్యవహారంపై, రాష్ట్ర హైకోర్టు మంగళవారం అసహనం వ్యక్తం చేసింది. స్కిల్ డెవలప్‌మెంట్, ఫైబర్‌నెట్ వంటి కుంభకోణాలకు సంబంధించిన కేసులను ఏ ప్రాతిపదికన మూసివేస్తున్నారో వివరించాలంటూ రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగానికి న్యాయస్థానం నోటీసులు జారీ చేసింది. గతంలో దర్యాప్తు సంస్థలు 'తప్పుగా కేసులు నమోదు చేశాం'అని నివేదికలు సమర్పించడంతో విజయవాడ ఏసీబీ కోర్టు ఈ కేసులను కొట్టేసిన సంగతి తెలిసిందే. అయితే, ఈ కేసులను కొట్టివేసే సమయంలో తమ అభ్యంతరాలను ...

...::: తరువాయి 2వ పేజీలో..

## జరిమానా కట్టకపోతే
# రుబాబు చేస్తారా..?



ట్రాఫిక్ పోలీసులకు హైకోర్టు సూటి ప్రశ్న

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

ట్రాఫిక్ చలాన్ల వేటలో వాహనదారులను ఇబ్బంది పెడుతున్న పోలీసులకు హైకోర్టు గట్టి షాక్ ఇచ్చింది. పెండింగ్ చలాన్లు ఉన్నాయనే నెపంతో వాహనదారులను బలవంతపెట్టవద్దని, వారి వాహనాలను ఆపడం లేదా బైక్ తాళాలు లాక్కోవడం వంటి పనులు చేయరాదని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. పెండింగ్ చలాన్ల వసూలు కోసం పోలీసులు సామాన్యులను వేధిస్తున్నారంటూ న్యాయవాది విజయ్ గోపాల్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ చేపట్టిన కోర్టు ఈ మేరకు తీర్పునిచ్చింది.విచారణ సందర్భంగా న్యాయస్థానం స్పష్టమైన మార్గదర్శకాలను పేర్కొంది. ఒకవేళ వాహనాన్ని ఆపినప్పుడు వాహనదారులు స్వచ్ఛందంగా చలాన్లు చెల్లిస్తే మాత్రమే పోలీసులు ఆ సొమ్మును వసూలు చేసుకోవచ్చని తెలిపింది. వాహనదారులు చెల్లించడానికి నిరాకరించిన పక్షంలో, పోలీసులు చట్టప్రకారం కోర్టు నోటీసులు జారీ చేయాలే తప్ప, అక్కడికక్కడే చెల్లించాలని ఒత్తిడి చేయకూడదని స్పష్టం చేసింది. పోలీసుల వేధింపుల వల్ల వాహనదారులు మానసిక ఇబ్బందులకు గురవుతున్నారని పిటిషనర్ తరపు న్యాయవాది వాదించగా, దీనిని పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు,నిబంధనలు అతిక్రమించవద్దని ట్రాఫిక్ విభాగానికి సూచించింది. ఈ తీర్పుతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న లక్షలాది మంది వాహనదారులకు పెద్ద ఎత్తున ఊరట లభించినట్లయింది.



## బస్సు రేపిస్టు అంటూ ట్రోలింగ్...
# అట్ట పెట్టెలతో నిరసన

**కోజికోడ్ (ఏడీఎన్ఎన్) :**

సోషల్ మీడియాలో వచ్చే పోస్టులు ఎంత ప్రమాదకరంగా మారుతున్నాయో చెప్పడానికి కేరళలో జరిగిన ఈ విషాద ఘటనే నిదర్శనం. తప్పుడు లైంగిక ఆరోపణలు, నెటిజన్ల దారుణమైన ట్రోలింగ్ భరించలేక దీపక్ అనే యువకుడు ఆత్మహత్య చేసుకోవడం ఇప్పుడు దేశవ్యాప్తంగా పెను సంచలనంగా మారింది. బాధితుడికి న్యాయం చేయాలని, మగాళ్లకూ ఆత్మగౌరవం ఉంటుందని కేరళ యువత 'అట్టపెట్టెల'తో వినూత్న నిరసనకు దిగింది. కోజికోడ్‌కు చెందిన దీపక్ ఒక ప్రైవేట్ కంపెనీలో సేల్స్ మేనేజర్‌గా పనిచేసేవాడు. ఈ నెల 16న పయ్యన్నూర్ వెళ్తున్న బస్సులో దీపక్ తనను అసభ్యంగా

...::: తరువాయి 2వ పేజీలో..

## మున్సిపల్ సమరానికి
# బీజేపీ సన్నద్ధం

- తెలంగాణకు ఎన్నికల ఇన్‌చార్జ్‌లు

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

తెలంగాణలో త్వరలో జరగబోయే మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల నిర్వహణ , పర్యవేక్షణ బాధ్యతలను నిర్వర్తించేందుకు ఎన్నికల ఇన్‌చార్జ్, కో-ఇన్‌చార్జ్ లను నియమిస్తూ బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్ సింగ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ ఆదేశాల మేరకు, మహారాష్ట్ర మంత్రి ఆశిష్ షేలార్‌ను ఎన్నికల ఇన్‌చార్జ్ గా నియమించగా, రాజస్థాన్ బీజేపీ మాజీ అధ్యక్షుడు అశోక్ పర్నామి , రాజ్యసభ సభ్యురాలు రేఖ శర్మలను కో-ఇన్‌చార్జ్ లుగా నియమించారు. ఈ నియామకాలు తక్షణమే అమలులోకి వస్తాయని పార్టీ పేర్కొంది. మున్సిపల్ ఎన్నికల వేళ జాతీయ స్థాయి నేతలను రంగంలోకి దింపడం ద్వారా తెలంగాణలో బలమైన పట్టు సాధించాలని బీజేపీ వ్యూహరచన చేస్తోంది.

## తగ్గుముఖం పట్టిన వాయు కాలుష్యం..

**ఢిల్లీ (ఏడీఎన్ఎన్) :**

దేశ రాజధానిలో గత కొద్దిరోజులుగా కలవరపెడుతున్న వాయు కాలుష్య తీవ్రత ఎట్టకేలకు కొంతమేర తగ్గుముఖం పట్టింది. గాలి నాణ్యతలో మెరుగుదల కనిపిస్తుండటంతో, ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ ఢిల్లీ వాసులకు శుభవార్త తెలిపింది. గతంలో అత్యంత ప్రమాదకర స్థాయిలో ఉన్న కాలుష్యం దృష్ట్యా విధించిన కఠినమైన 'గ్రేడ్4' ఆంక్షలను తాత్కాలికంగా సడలిస్తున్నట్లు అధికారులు మంగళవారం ప్రకటించారు. గత ఆదివారం ఢిల్లీలో గాలి నాణ్యత సూచీ ఏకంగా 440కి చేరుకొని అత్యంత ప్రమాదకర స్థాయిని తాకింది. ఈ నేపథ్యంలో కాలుష్య నియంత్రణ కోసం నిర్మాణ రంగ కార్యకలాపాలను నిలిపివేయడం, భారీ వాహనాల రాకపోకలపై నిషేధం వంటి కఠిన ఆంక్షలను ప్రభుత్వం అమలు చేసింది. అయితే, మంగళవారం ఉదయం నాటికి గాలి నాణ్యత 378గా నమోదు కావడంతో పరిస్థితులు కాస్త మెరుగుపడ్డాయని భావించిన అధికారులు, నిబంధనలను కొంతమేర సడలించాలని నిర్ణయించారు. సాధారణంగా గ్రేడ్4 ఆంక్షలు అమల్లో ఉన్నప్పుడు రాజధానిలో అత్యవసర సర్వీసులు మినహా డీజిల్ ట్రక్కుల ప్రవేశంపై నిషేధం ఉంటుంది. అలాగే జనరేటర్లతో నడిచే పరిశ్రమలను తాత్కాలికంగా నిలిపివేయడంతో పాటు, ప్రభుత్వ , ప్రైవేట్ కార్యాలయాల్లో 50 శాతం సిబ్బందికి 'వర్క్ ఫ్రమ్ హోమ్' సిఫారసు చేస్తారు. ఇప్పుడు ఈ నిబంధనలకు సడలింపు లభించడంతో రవాణా మరియు ఇతర రంగాలు కొంత ఊపిరి పీల్చుకున్నాయి. ఢిల్లీలో వాయు కాలుష్యం ఎప్పుడూ అధికంగానే ఉన్నప్పటికీ, శీతాకాలంలో దీని ప్రభావం మరింత తీవ్రంగా ఉంటుంది. పొగమంచు మరియు గాలి వేగం తగ్గడం వంటి వాతావరణ మార్పుల వల్ల కాలుష్య కారకాలు భూమికి దగ్గరగా పేరుకుపోయి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతాయి. ప్రస్తుతానికి ఆంక్షలు సడలించినప్పటికీ, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మరియు కాలుష్య నియంత్రణకు సహకరించాలని అధికారులు కోరుతున్నారు.

## సీఎం చంద్రబాబు దావోస్ విజన్

**మొదటి పేజీ తరువాయి...**

'క్వాంటం కంప్యూటింగ్ ఇన్నోవేషన్ సెంటర్'ను నెలకొల్పాలని చంద్రబాబు ఐబీఎంను కోరారు. దీనికి తోడు, భారత్‌లో 50 లక్షల మందికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ లో శిక్షణ ఇవ్వాలన్న ఐబీఎం నిర్ణయంలో భాగంగా.. ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే 10 లక్షల మంది యువతకు ఏఐ నైపుణ్యాలను నేర్పించాలని మంత్రి లోకేశ్ విజ్ఞప్తి చేశారు. భవిష్యత్ సాంకేతికతగా భావిస్తున్న క్వాంటం కంప్యూటింగ్, ఏఐ రంగాల్లో ఏపీ యువతను ప్రపంచస్థాయి నిపుణులుగా తీర్చిదిద్దేందుకు ఐబీఎం సానుకూలంగా స్పందించింది. తర్వాత గూగుల్ క్లౌడ్ సీఈవో థామస్ కురియన్‌తో సీఎం భేటీ అయ్యారు. విశాఖపట్నంలో గూగుల్ ఏర్పాటు చేయనున్న సుమారు రూ. 87,520 కోట్ల భారీ పెట్టుబడితో కూడిన 'ఏఐ డేటా సెంటర్' నిర్మాణంపై ఇద్దరి మధ్య కీలక చర్చ జరిగింది. ఈ ప్రాజెక్టు పనుల్లో ఎటువంటి జాప్యం లేకుండా, డేటా సెంటర్ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని థామస్ కురియన్‌ను సీఎం కోరారు. ఈ డేటా సెంటర్ ద్వారా విశాఖ నగరం గ్లోబల్ కనెక్టివిటీ హబ్‌గా మారుతుందని, వేలాది మందికి ఉపాధి లభిస్తుందని ప్రభుత్వం ఆశిస్తోంది. నాలెడ్జ్ ఎకానమీ ద్వారానే నిజమైన సంపద సృష్టి జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. నాలెడ్జ్ ఎకానమీ మన దేశ ఆర్థిక వ్యవస్థ గమనాన్నే మారుస్తుందని, తెలుగు ప్రజలు కొత్త టెక్నాలజీని అందిపుచ్చుకోవటంలో ఎప్పుడూ ముందుంటారని చంద్రబాబు నాయుడు విశ్లేషించారు. సాంకేతికతను సమర్థంగా వినియోగించుకుంటే అద్భుత ఫలితాలు సాధించవచ్చని, అందుకే రాష్ట్రంలో అత్యాధునిక మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యమిస్తున్నామని పారిశ్రామికవేత్తలకు వివరించారు.

## బీహార్‌లో 'నిర్భయ'

**మొదటి పేజీ తరువాయి...**

పంపారు. ప్రస్తుతం అక్కడి నుంచి తుది నివేదిక రావాల్సి ఉంది. పోలీసుల తీరుపై బాధితురాలి కుటుంబం అసంతృప్తి వ్యక్తం చేయడంతో పాటు ప్రజల నుంచి ఆగ్రహం వ్యక్తమవడంతో బీహార్ డీజీపీ వినయ్ కుమార్ ఈ కేసును సిట్ కు అప్పగించారు. ఏడుగురు సభ్యుల ఈ బృందం ఇప్పటికే బాధితురాలి గ్రామాన్ని సందర్శించి తల్లిదండ్రులను, ఇరుగుపొరుగు వారిని విచారించింది. ఎఫ్ఎస్ఎల్ బృందం శంభు హాస్టల్ నుంచి కీలక ఆధారాలు, నమూనాలను సేకరించింది. తొలుత చికిత్స అందించిన ప్రభాత్ మెమోరియల్ ఆసుపత్రి రిపోర్టులను కూడా సిట్ అధికారులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు, హాస్టల్ యజమాని మనీష్ రంజన్‌ను పోలీసులు అరెస్టు చేసి జ్యుడీషియల్ కస్టడీకి తరలించారు. ఒకప్పుడు సాధారణ నాలుగో తరగతి ఉద్యోగిగా ఉన్న మనీష్.. అతి తక్కువ కాలంలోనే కోటీశ్వరుడిగా ఎలా ఎదిగాడనే కోణంలో పోలీసులు ఆరా తీస్తున్నారు. రాత్రి పూట అతని హాస్టల్‌కు అనేకమంది వచ్చి వెళ్లేవారని, దీని వెనుక పెద్ద నెట్‌వర్క్ ఉందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బీహార్ మహిళా కమిషన్ కూడా ఈ కేసును సుమోటోగా స్వీకరించి, విచారణకు ప్రత్యేక బృందాన్ని పంపింది. ఈ ఘటన బీహార్ రాజకీయాల్లో పెను తుపాను సృష్టించింది. కాంగ్రెస్ కార్యకర్తలు చేతులకు గాజులు వేసుకుని వినూత్నంగా నిరసన తెలిపారు. ఆర్జేడీ ఎంపీ సురేంద్ర యాదవ్ బాధితురాలికి న్యాయం జరగకపోతే రాజకీయాలను వదిలేస్తానని ప్రకటించగా, రోహిణి ఆచార్య ప్రభుత్వం మహిళల భద్రతపై దృష్టి పెట్టాలని విమర్శించారు. ఫిర్యాదు వెనక్కి తీసుకోవాలని బాధితురాలి కుటుంబంపై ఒత్తిడి తెస్తున్నారని ప్రశాంత్ కిషోర్ ఆరోపించారు. ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్ డిమాండ్ మేరకు ఈ కేసును సీబీఐ కి అప్పగిస్తారా లేదా అనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

## అసెంబ్లీ నుంచి గవర్నర్ వాకౌట్!

**మొదటి పేజీ తరువాయి...**

చెన్నైలోని అసెంబ్లీ తొలి సమావేశం సందర్భంగా గవర్నర్ ఆర్.ఎన్. రవి మంగళవారం సభకు విచ్చేశారు. సభా సంప్రదాయం ప్రకారం రాష్ట్ర గీతం (తమిళ తాయ్ వజ్తు) ముగిసిన వెంటనే జాతీయ గీతం కూడా వినిపించాలని ఆయన కోరారు. అయితే, స్పీకర్ ఎం. అప్పావు అందుకు నిరాకరించారు. అసెంబ్లీ నిబంధనల ప్రకారం సమావేశం ప్రారంభంలో రాష్ట్ర గీతం, ముగింపులో మాత్రమే జాతీయ గీతం ఆలాపన ఉంటుందని స్పీకర్ వివరించారు. దీంతో తీవ్ర అసంతృప్తికి లోనైన గవర్నర్, ప్రసంగం ప్రారంభించకుండానే మధ్యలోనే సభ నుంచి బయటకు వెళ్లారు. సభ వెలుపల మీడియాతో మాట్లాడిన గవర్నర్ ఆర్.ఎన్. రవి ప్రభుత్వంపై సంచలన ఆరోపణలు చేశారు. "జాతీయ గీతానికి తగిన గౌరవం ఇవ్వడం లేదు. ప్రభుత్వం సిద్ధం చేసిన ప్రసంగంలో అనేక తప్పులు ఉన్నాయి. నా మైక్ ఆఫ్ చేసి మాట్లాడే అవకాశం ఇవ్వలేదు. ఇది రాజ్యాంగబద్ధమైన పదవిని అవమానించడమే," అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. గవర్నర్ వెళ్ళిపోయిన తర్వాత స్పీకర్ స్వయంగా ఆ ప్రసంగ ప్రతిని సభలో చదివి వినిపించాల్సి వచ్చింది. ఈ ఘటనపై రాజకీయ వర్గాలు రెండుగా చీలిపోయాయి. గవర్నర్ కావాలనే సభా సంప్రదాయాలను ఉల్లంఘిస్తున్నారని, సమాఖ్య స్ఫూర్తిని దెబ్బతీస్తున్నారని డీఎంకే నేతలు మండిపడ్డారు. మరోవైపు, జాతీయ గీతానికి ప్రాధాన్యత ఇవ్వాలన్న గవర్నర్ కోరికలో తప్పేముందని బీజేపీ వర్గాలు ప్రశ్నించాయి. రాష్ట్ర ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే జాతీయ గీతాన్ని విస్మరిస్తోందని విమర్శించాయి. రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న గవర్నర్ ,ప్రజలచే ఎన్నికైన ప్రభుత్వానికి మధ్య నెలకొన్న ఈ ఇగో పోరు తమిళనాడు రాజకీయ వాతావరణాన్ని మరింత ఉద్రిక్తం చేస్తోంది. జాతీయ గీతం , రాష్ట్ర సంప్రదాయాల మధ్య సమతుల్యత సాధించడంలో విఫలమవ్వడం రాష్ట్ర అభివృద్ధికి ఆటంకంగా మారుతోందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## మేనకాగాంధీ పై సుప్రీం సీరియస్!



**న్యూఢిల్లీ (ఏడీఎన్ఎన్) :**

వీధికుక్కల నియంత్రణకు సంబంధించిన కేసు విచారణ సందర్భంగా మాజీ కేంద్రమంత్రి, జంతు హక్కుల కార్యకర్త మేనకాగాంధీపై సుప్రీం కోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. దేశ అత్యున్నత న్యాయస్థానంపై ఇష్టారీతిన వ్యాఖ్యలు చేయడం సరికాదని త్రిసభ్య ధర్మాసనం మంగళవారం స్పష్టం చేసింది. ఇటీవల ఆమె ఒక పాడ్‌కాస్ట్‌లో మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీరును విమర్శించడంపై జస్టిస్‌లు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. విచారణ సందర్భంగా మేనకాగాంధీ తరపు న్యాయవాది రాజు రామచంద్రన్‌ను కోర్టు నిలదీసింది. "ఒకవైపు మీరు కోర్టులు ఉదాసీనంగా వ్యవహరించాలని కోరుతుంటారు.. మరోవైపు మీ క్లయింట్ పాడ్‌కాస్ట్‌లలో కోర్టులపై ఇష్టారీతిన వ్యాఖ్యలు చేస్తున్నారు. ఆమె బాడీ లాంగ్వేజ్, మాట్లాడిన మాటలు మీరు గమనించారా? ఆమె తప్పు చేసినప్పటికీ మేము ఎలాంటి చర్యలు తీసుకోలేదు, అది మా గొప్పతనం కాదా?," అంటూ ధర్మాసనం ఘాటుగా ప్రశ్నించింది. రాజ్యాంగబద్ధమైన పదవుల్లో ఉన్న వారు, సామాజిక కార్యకర్తలు న్యాయ వ్యవస్థ పట్ల గౌరవంతో వ్యవహరించాలని హితవు పలికింది. జంతు ప్రేమికురాలిగా మేనకాగాంధీ చేస్తున్న పోరాటంపైనా కోర్టు కొన్ని సూటి ప్రశ్నలు సంధించింది. "ఆమె గతంలో కేంద్రమంత్రిగా పనిచేశారు. జంతువుల రక్షణ కోసం ఇప్పటి వరకు ఆమె చేసిన పనులు ఏంటి? మూగజీవాల సంరక్షణ కోసం బడ్జెట్‌లో ప్రత్యేక నిధులు కేటాయించేలా ప్రభుత్వాన్ని ఒప్పించారా? లేదా వాటి కోసం ఏవైనా కొత్త పథకాలు తీసుకొచ్చారా?," అని ధర్మాసనం ప్రశ్నించింది. కేవలం వ్యాఖ్యలు చేయడం కంటే క్షేత్రస్థాయిలో మార్పులు తీసుకురావడం ముఖ్యమని పేర్కొంది. కుక్కకాటు బాధితుల విషయంలో కోర్టు గతంలో చేసిన వ్యాఖ్యలను ధర్మాసనం ఈ సందర్భంగా పునరుద్ఘాటించింది. "వీధికుక్కలు కరిస్తే, వాటికి ఆహారం వేసే వారినే బాధ్యులు చేయాలని మేము గతంలో అన్న మాటలు సరదాకు అన్నవి కావు, అవి అత్యంత సీరియస్ వ్యాఖ్యలు," అని కోర్టు స్పష్టం చేసింది. వీధి కుక్కల సమస్యను ప్రభుత్వం నియంత్రించలేకపోతే, బాధితులకు భారీ మొత్తంలో పరిహారం చెల్లించేలా ఆదేశాలు జారీ చేస్తామని ధర్మాసనం మరోసారి హెచ్చరించింది.

## ప్రపంచ కుబేరుడి.. సరికొత్త ప్లాన్

**మొదటి పేజీ తరువాయి...**

సరిపడవని ర్యాన్‌ఎయిర్ యాజమాన్యం ప్రతిపాదనను తిరస్కరించింది. ఈ నేపథ్యంలో ఒక ఇంటర్వ్యూలో 'లియరీ మస్క్‌ను "ఒక ఇడియట్" అంటూ తీవ్రంగా విమర్శించారు. దీనికి ప్రతిగా మస్క్ కూడా ఘాటుగా స్పందిస్తూ 'లియరీని "అట్టర్ ఇడియట్" అని వ్యాఖ్యానించారు. "అతడిని ఉద్యోగం నుంచి తీసేయండి" అంటూ పోస్ట్ ద్వారా ఆదేశిచ్చారు. ఈ మాటల తూటాల తర్వాతే మస్క్ ర్యాన్‌ఎయిర్ కొనుగోలుపై పోల్ పెట్టారు. కొద్ది గంటల్లోనే ఈ పోల్‌కు 7.5 లక్షలకు పైగా ఓట్లు నమోదయ్యాయి. అందులో 76.8 శాతం మంది కొనుగోలుకు మద్దతు తెలపడం గమనార్హం. దీనిపై స్పందించిన మస్క్ తనదైన శైలిలో, "ర్యాన్‌ఎయిర్‌ను 'ర్యాన్' అనే వ్యక్తే నడపాలి. అతడిని అసలైన పాలకుడిగా చేయడం మీ విధి" అంటూ చమత్కరించారు. ఇది సరదాగా పెట్టిన పోలా..? లేక నిజంగానే టేకోవర్ యోచన ఉందా..? అనే దానిపై మస్క్ స్పష్టత ఇవ్వలేదు. ఈ వ్యవహారం ప్రస్తుతం సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది.

## కర్ణాటక డీజీపీ 'ఆడియో రొమాన్స్' లీక్

### అధికారిపై సస్పెన్షన్ వేటు

**బెంగళూరు (ఏడీఎన్ఎన్) :**

కర్ణాటకకు చెందిన సీనియర్ ఐపీఎస్ అధికారి కె. రామచంద్రరావు రాసలీలల వ్యవహారం ఆడియో రొమాన్స్ లీక్‌తో సరికొత్త మలుపు తిరిగింది. ఇప్పటికే తన కార్యాలయాన్నే బెడ్‌రూమ్‌గా మార్చి పోలీసు యూనిఫాంలోనే మహిళలతో అసభ్యంగా ప్రవర్తించిన వీడియోలు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించగా, తాజాగా ఒక మహిళతో ఆయన జరిపిన ఫోన్ సంభాషణ వెలుగులోకి రావడంతో ఈ వివాదం మరింత ముదిరింది. సదరు ఆడియోలో ఆ మహిళ "ఎన్నిసార్లు కాల్ చేసినా ఫోన్ ఎందుకు లిఫ్ట్ చేయడం లేదు?" అని ప్రశ్నించగా, తాను జిమ్‌లో ఉన్నానని, రాత్రంతా ఆమె గుర్తు వస్తోందని, అర్ధరాత్రి ఒంటి గంట వరకు నిద్ర కూడా రాలేదని ఆ అధికారి సరసాలాడుతూ మాట్లాడటం వినిపించింది. "మరి ఇంటికి రానా ఇప్పుడు?" అని ఆయన కోరగా, ఇంటి చుట్టూ కెమెరాలు ఉన్నాయని ఆ మహిళ హెచ్చరించడం వంటి సంచలన విషయాలు ఆ సంభాషణలో బయటపడ్డాయి. ఈ అశ్లీల వీడియోలు మరియు ఆడియో సంభాషణలపై కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తీవ్రంగా స్పందించి సమగ్ర విచారణకు ఆదేశించారు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించి, శాఖ ప్రతిష్టకు మచ్చ తెచ్చేలా ప్రవర్తించినందుకు గాను ప్రభుత్వం రామచంద్రరావును సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు మంగళవారం జారీ చేసింది. సస్పెన్షన్ సమయంలో ఆయన అనుమతి లేకుండా హెడ్‌క్వార్టర్స్‌ను విడిచి



వెళ్లకూడదని ప్రభుత్వం స్పష్టం చేసింది. అయితే, ఈ ఆరోపణలను రామచంద్రరావు తోసిపుచ్చుతూ, ఎవరో కుట్రపన్ని ఏఐ సాయంతో ఈ వీడియోలను మరియు ఆడియోలను సృష్టించారని వాదిస్తున్నారు.

## భారతీయ భాషలే దేశ భవిష్యత్తుకు పునాదులు

### ఇండోర్ సమ్మేళనంలో బండి సంజయ్

**ఇండోర్ (ఏడీఎన్ఎన్) :**

దేశంలో ఉన్నత విద్య, పరిశోధనలు, స్టార్టప్‌లతో పాటు డిజిటల్ ప్లాట్‌ఫారాలు సొంత భాషల్లో అందుబాటులోకి వచ్చినప్పుడే జ్ఞానానికి నిజమైన ప్రజాస్వామీకరణ సాధ్యమవుతుందని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ అభిప్రాయపడ్డారు. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ దేవి అహిల్య విశ్వవిద్యాలయంలో మంగళవారం నిర్వహించిన అధికారిక భాషా సమ్మేళనంలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. సాంకేతికత , కృత్రిమ మేధస్సు ఈ దిశలో కొత్త అవకాశాలను కల్పిస్తున్నాయని, భారతీయ భాషలను కేంద్రంగా ఉంచడం ద్వారా గ్రామీణ , పట్టణ భారత్



మధ్య ఉన్న డిజిటల్ అంతరాన్ని తగ్గించవచ్చని ఆయన పేర్కొన్నారు. హిందీతో పాటు భారతీయ భాషలు కేవలం మన వారసత్వం మాత్రమే కాదని, అవి దేశ భవిష్యత్తుకు పునాదులుగా నిలుస్తాయని మంత్రి స్పష్టం చేశారు. హోంమంత్రి అమిత్ షా మార్గదర్శకత్వంలో హిందీని ప్రపంచ స్థాయి సంభాషణలతో అనుసంధానించేందుకు కేంద్రం కృషి చేస్తోందని, రాజభాషా విభాగం రూపొందించిన ఆధునిక అనువాద సాధనాలు పాలనను పారదర్శకంగా ప్రజలకు చేరువ చేస్తున్నాయని వివరించారు. ఈ సందర్భంగా తన వ్యక్తిగత అనుభవాన్ని పంచుకుంటూ, తెలుగు రాష్ట్రం నుండి వచ్చిన తనకు ఒకప్పుడు హిందీ రాదని, అయితే అమిత్ షా ప్రోత్సాహంతో ఇప్పుడు తన పనులన్నీ హిందీలోనే నిర్వహిస్తున్నానని వెల్లడించారు. భవిష్యత్తులో విద్య, వైద్యం, న్యాయం , వ్యాపార రంగాల్లో భారతీయ భాషలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని ఆయన పిలుపునిచ్చారు.

## బస్సు రేపిస్టు అంటూ ట్రోలింగ్... అట్ట పెట్టెలతో నిరసన

**మొదటి పేజీ తరువాయి...**

తాకాడని ఆరోపిస్తూ ఒక మహిళ 18 సెకన్ల వీడియో తీసి సోషల్ మీడియాలో పెట్టింది. ఆ వీడియో క్షణాల్లో వైరల్ కావడంతో, నెటిజన్లు వాస్తవాలు తెలుసుకోకుండానే దీపక్‌ను 'కామాంధుడు', 'బస్సు రేపిస్ట్' అంటూ దారుణంగా దూషించారు. పోలీసులకు ఫిర్యాదు అందకముందే సోషల్ మీడియాలో జరిగిన ఈ 'డిజిటల్ విచారణ'తో దీపక్ తీవ్ర మనస్తాపానికి గురై తన ఇంట్లోనే బలవన్మరణానికి పాల్పడ్డాడు. దీపక్ మరణం తర్వాత విచారణలో దిగ్భ్రాంతికర విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఆ వీడియోలో దీపక్ తప్పు చేసినట్లు ఎక్కడా ఆధారాలు లేవని, కేవలం తనను చూశాడనో లేదా పొరపాటున చేయి తగిలిందనో ఆ మహిళ తప్పుడు ప్రచారం చేసిందని ప్రాథమికంగా తేలింది. దీపక్ ఆత్మహత్యకు కారణమైన మహిళపై కేరళ పోలీసులు 'ఆత్మహత్య ప్రేరణ' కింద కేసు నమోదు చేశారు. అయితే, పోలీసులు ఆమెను అరెస్టు చేసేందుకు వెళ్లగా ఆమె అప్పటికే ఇల్లు వదిలి పరారైంది. ఆమె ఫోన్‌ను స్వాధీనం చేసుకుని, వీడియోను ఎడిట్ చేసిందా అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటన కేరళలో పురుషుల హక్కుల గురించిన చర్చను మళ్ళీ తెరపైకి తెచ్చింది. సాక్ష్యాధారాలు లేకుండా కేవలం సోషల్ మీడియా పోస్టుల ఆధారంగా వ్యక్తుల వ్యక్తిత్వాన్ని హననం చేయడం ఎంత ప్రమాదకరమో ఈ ఉదంతం నిరూపిస్తోంది. దీనికి నిరసనగా మలయాళీ సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్లు, సామాన్య ప్రజలు ఏకమయ్యారు. అట్టపెట్టెలను తలకు తగిలించుకుని లేదా చేతుల్లో పట్టుకుని "పురుషుల ప్రాణాలకు విలువ లేదా?" అంటూ నిరసన తెలుపుతున్నారు. ఈ 'అట్టపెట్టెల ట్రెండ్' ఇప్పుడు ఇంటర్నెట్‌లో వైరల్‌గా మారింది. ఒక చిన్న వీడియో క్లిప్పింగ్ ఒక నిండు ప్రాణాన్ని బలితీసుకుంది. చట్టాన్ని తన చేతుల్లోకి తీసుకుని, విచారణ చేయకుండానే దోషిగా నిర్ధారించే సోషల్ మీడియా సంస్కృతికి అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఉందని ఈ ఘటన హెచ్చరిస్తోంది. దీపక్ మరణం వెనుక ఉన్న అసలు నిందితురాలికి కఠిన శిక్ష పడాలని యావత్ దేశం డిమాండ్ చేస్తోంది.

## ఏ ఆధారాలతో ఆయనపై కేసులు ఉపసంహరించారు?

**మొదటి పేజీ తరువాయి...**

పరిగణనలోకి తీసుకోలేదని పేర్కొంటూ కొందరు పిటిషనర్లు హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ జరిపిన ధర్మాసనం, అసలు కేసుల ఉపసంహరణ వెనుక ఉన్న బలమైన కారణాలు ఏమిటో స్పష్టం చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఏ ఆధారాలతో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ ప్రక్రియలో చట్టపరమైన నిబంధనలను ఏ విధంగా పాటించారు అనే విషయాలపై సమగ్ర వివరణ ఇవ్వాలని ధర్మాసనం సూచించింది. ఈ పరిణామాలు ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో పెను దుమారం రేపుతున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన అధికారాన్ని అడ్డుపెట్టుకుని, వ్యవస్థలపై ఒత్తిడి తెచ్చి తనపై ఉన్న కేసుల నుంచి తప్పుకుంటున్నారని వైసీపీ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తింది. ఇది ప్రజాస్వామ్య వ్యవస్థలపై జరిగిన దాడిగా పేర్కొంటూ, దీనిపై తాము న్యాయపోరాటం కొనసాగిస్తామని వైసీపీ నేతలు స్పష్టం చేశారు. మరోవైపు, ఇవన్నీ గత ప్రభుత్వం రాజకీయ కక్షతో పెట్టిన అక్రమ కేసులు కాబట్టే న్యాయస్థానాల్లో నిలబడటం లేదని అధికార పార్టీ వర్గాలు వాదిస్తున్నాయి. హైకోర్టు ఈ వ్యవహారంపై తదుపరి విచారణను ఫిబ్రవరి 3వ తేదీకి వాయిదా వేసింది. ప్రభుత్వం సమర్పించే వివరణ, ఆధారాల బట్టి ఈ కేసుల్లో తదుపరి న్యాయ ప్రక్రియ ఎలా ఉండబోతుందనేది తేలనుంది.

## 'సిట్'ను నేనే ఎదురు ప్రశ్నలడిగా!

**మొదటి పేజీ తరువాయి...**

చేయడానికే ఈ డ్రామాలు ఆడుతున్నారని ఆయన మండిపడ్డారు. ముఖ్యమంత్రికి నిజంగా దమ్ముంటే ఆ బొగ్గు కుంభకోణంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి తన నిజాయితీని నిరూపించుకోవాలని సవాల్ విసిరారు. తాను చట్టాన్ని గౌరవించే వ్యక్తిని కాబట్టే పోలీసులు పిలవగానే వచ్చానని నోటీసులకు భయపడి పారిపోయే వ్యక్తిని కాదని స్పష్టం చేశారు. తాను నిఖార్సైన ఉద్యమకారుడినని ఎన్నో కేసులు చూశానని రేవంత్ రెడ్డి ఇలాంటి చిల్లర రాజకీయాలు మానుకుని పాలనపై దృష్టి పెట్టాలని హితవు పలికారు. ఇలాంటి చర్యల ద్వారా ముఖ్యమంత్రి తన పతనాన్ని తనే కొనితెచ్చుకుంటున్నారని హెచ్చరించారు. హరీశ్ రావు కు నోటీసులు ఇవ్వడంపై రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ శ్రేణులు భగ్గుమన్నాయి. జూబ్లీ హిల్స్ పోలీస్ స్టేషన్ వద్ద పోలీసులకు కార్యకర్తలకు మధ్య తోపులాట జరిగి ఉద్రిక్తత చోటుచేసుకుంది. అటు నల్గొండ జిల్లా గుర్రంపోడులో మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలు భారీ రాస్తారోకో నిర్వహించారు. ప్రభుత్వం రాజకీయ కక్ష సాధింపు చర్యలను ఆపాలని డిమాండ్ చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేశారు.

## సీఎం 'డైవర్షన్' డ్రామాలకు భయపడేదే లేదు

**మొదటి పేజీ తరువాయి...**

సుమారు తొమ్మిది టెండర్లను ముఖ్యమంత్రి కుటుంబమే నియంత్రిస్తోందని, 'సైట్ విజిట్ సర్టిఫికెట్' పేరుతో కంపెనీలను బెదిరిస్తూ అక్రమ దందా సాగిస్తున్నారని ఆరోపించారు. ఈ భారీ కుంభకోణాన్ని తాము సాక్ష్యాధారాలతో బయటపెట్టినందుకే, ప్రజల దృష్టిని మళ్లించేందుకు హరీశ్ రావును టార్గెట్ చేశారని విమర్శించారు. ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ దోపిడీపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మౌనం వెనుక మర్మమేంటని, ఇందులో బీజేపీకి కూడా వాటాలు ఉన్నాయా అని ప్రశ్నించారు. అమృత్ టెండర్లు, రేషన్ బియ్యం స్కాం మరియు మూసీ ప్రాజెక్టు వైఫల్యాల నుండి ప్రజల దృష్టిని మళ్లించేందుకే ప్రభుత్వం నోటీసుల రాజకీయం చేస్తోందని కేటీఆర్ ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డి రాజకీయ క్రీడలో పోలీసులు బలి కావద్దని, అక్రమ కేసులు పెడుతున్న అధికారులను భవిష్యత్తులో వదిలిపెట్టబోమని హెచ్చరించారు. మరో రెండేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం వస్తుందని , అప్పుడు ప్రతి ఒక్కరి లెక్క తేలుస్తామని స్పష్టం చేశారు. అసెంబ్లీలో ఎనిమిది మంది మంత్రులను ధైర్యంగా ఎదుర్కొన్న హరీశ్ రావుకు, ఈ పోలీస్ విచారణలు ఒక లెక్క కాదని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఎన్ని తప్పుడు కేసులు పెట్టినా ప్రజల పక్షాన పోరాటం ఆపేది లేదని కేటీఆర్ తేల్చిచెప్పారు.



## భర్త ఆశయాలకు అండగా నిలిచిన భార్య

### చిన్నప్పుడే పెళ్లి.. 20 ఏళ్లకే తండ్రి..

### ఐదు ప్రయత్నాల తర్వాత 'నీట్' కొట్టిన వీరుడు!

**జైపూర్ (ఏడీఎన్ఎన్) :**

సంకల్ప బలం ఉంటే పేదరికం, సామాజిక అడ్డంకులు ఏవీ కూడా మనిషిని ఆపలేవని రాజస్థాన్‌కు చెందిన రామ్‌లాల్ నిరూపించాడు. 11 ఏళ్లకే బాల్య వివాహం, 20 ఏళ్లకే తండ్రిగా బాధ్యతలు చేపట్టినప్పటికీ, డాక్టర్ కావాలనే తన కలను మాత్రం వదులుకోలేదు. ఐదు సార్లు విఫలమైనా వెనకడుగు వేయకుండా పోరాడి, చివరికి 'నీట్' పరీక్షలో ఘనవిజయం సాధించి అందరితో శభాష్ అనిపించుకున్నాడు. ఒక మారుమూల గ్రామానికి చెందిన రైతు బిడ్డగా రామ్‌లాల్ సాగించిన ఈ ప్రయాణం ఇప్పుడు లక్షలాది మంది విద్యార్థులకు ఆశాకిరణంగా మారింది. రామ్‌లాల్ జీవిత ప్రయాణం ఎన్నో సవాళ్లతో కూడుకున్నది. ఆరో తరగతి చదువుతున్న వయసులోనే పెద్దల నిర్ణయంతో వివాహం కావడంతో, అసలు పెళ్లి అంటే ఏమిటో తెలియని స్థితిలోనే ఒక ఇంటివాడయ్యాడు. సాధారణంగా ఇటువంటి పరిస్థితుల్లో చదువు ఆగిపోయి సంసార బాధ్యతల్లో మునిగిపోవడం సహజం. కానీ, రామ్‌లాల్ మాత్రం పాత విషయాలను పక్కనపెట్టి తన చదువును కొనసాగించాడు. పదో తరగతిలో 74 శాతం మార్కులతో ఉత్తీర్ణుడై సైన్స్ విభాగాన్ని ఎంచుకున్నాడు. తాను పైచదువులు చదువుతానంటే తండ్రి నిరాకరించినప్పటికీ, చదువు విలువ తెలిసిన తన భార్య అండగా నిలవడంతో రామ్‌లాల్ తన లక్ష్యం వైపు అడుగులు వేశాడు. వైద్య విద్య కోసం రామ్‌లాల్ ఐదు సంవత్సరాల పాటు అవిశ్రాంతంగా శ్రమించాడు. 2019లో తొలిసారి నీట్ రాసినప్పుడు కేవలం 350 మార్కులు మాత్రమే వచ్చాయి. ఆ తర్వాత 2022లో చేసిన ప్రయత్నంలో 490 మార్కులు సాధించినా లక్ష్యం నెరవేరలేదు. వరుస వైఫల్యాలు ఎదురైనప్పటికీ, మొక్కవోని ధైర్యంతో కోచింగ్ తీసుకుంటూ నిరంతరం చదివాడు. చివరికి 2023లో జరిగిన నీట్ పరీక్షలో ఐదో ప్రయత్నంలో అత్యుత్తమ ర్యాంకు సాధించి తన కలను నెరవేర్చుకున్నాడు. ఇదే ఏడాది ఆయనకు ఒక పాప జన్మించడంతో, తండ్రిగా తన బాధ్యతను నెరవేరుస్తూనే విద్యార్థిగా విజేతగా నిలిచాడు. రామ్‌లాల్ విజయం కేవలం ఒక పరీక్షలో ఉత్తీర్ణత సాధించడం మాత్రమే కాదు, ఇది పట్టుదలకు , అంకితభావానికి నిదర్శనం. చుట్టుపక్కల వారు ఏమనుకున్నా, పరిస్థితులు ప్రతికూలంగా ఉన్నా వెనకడుగు వేయకుండా పోరాడితే విజయం వరిస్తుందని ఆయన నిరూపించాడు. ప్రస్తుతం "బాల్య వివాహ బాధితుడు కాబోయే డాక్టర్"గా రామ్‌లాల్ సక్సెస్ జర్నీ సోషల్ మీడియాలో వైరల్ అవుతూ, పట్టుదల కలిగిన యువతకు గొప్ప స్ఫూర్తినిస్తోంది.

## ఆ మూడు దేశాలూ నావే

**మొదటి పేజీ తరువాయి..**

అంశంపై వివాదం నడుస్తున్న వేళ ఈ మ్యాప్ బయటకు రావడం ఉద్రిక్తతలను మరింత పెంచేలా ఉందని అంతర్జాతీయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. గతేడాది అధికారంలోకి వచ్చిన వెంటనే ట్రంప్ కెనడాను 51వ రాష్ట్రంగా విలీనం చేయాలంటూ ప్రతిపాదించారు. కెనడా ప్రభుత్వం దీనిని ఖండించడంతో రెండు దేశాల మధ్య వాణిజ్య యుద్ధం ముదిరింది. వెనిజులాపై కూడా ట్రంప్ వెనకడుగు వేయకుండా పట్టు బిగిస్తున్నారు. ఇటీవల అమెరికా ప్రత్యేక బలగాలు వెనిజులాలో మెరుపు దాడి చేసి అధ్యక్షుడు నికోలస్ మదురో, ఆయన భార్యను డ్రగ్స్ కేసుల్లో విచారణ కోసం న్యూయార్క్‌కు తరలించిన ఘటన కూడా తీవ్ర వివాదాస్పదంగా మారింది. ఈ పరిణామాలన్నీ ట్రంప్ దూకుడు, విదేశాంగ విధానానికి నిదర్శనంగా మారుతున్నాయి.

## ఏఐ సాయంతో ఫిర్యాదు వాట్సాప్‌లో ఎఫ్ఐఆర్

**మొదటి పేజీ తరువాయి...**

అందజేయాల్సి ఉంటుంది. స్టేషన్‌కు వెళ్లాలంటే భయం లేదా ఇబ్బంది కారణంగా దాదాపు 82 శాతం మంది ఫిర్యాదు చేయడానికే వెనుకంజ వేస్తున్నారు. ప్రస్తుతం అందుతున్న ఫిర్యాదుల్లో కేవలం 18 శాతం మాత్రమే ఎఫ్ఐఆర్‌లుగా మారుతున్నాయి. ఈ అంతరాన్ని తగ్గించడమే 'సీమిత్ర' ప్రధాన లక్ష్యం. సీమిత్ర విధానంలో సైబర్ బాధితులు పోలీస్ స్టేషన్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండానే ఫిర్యాదు ప్రక్రియను పూర్తి చేయవచ్చు. ఎవరైనా సైబర్ మోసానికి గురైనప్పుడు మొదట 1930 నంబర్‌కు కాల్ చేయాలి. ఆ సమాచారం ఆధారంగా సీమిత్ర సిబ్బందే స్వయంగా బాధితులకు ఫోన్ చేసి వివరాలు సేకరిస్తారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (సాంకేతికతను ఉపయోగించి బాధితుడి వివరాలతో పక్కాగా ఫిర్యాదు పత్రాన్ని సిద్ధం చేసి వారి వాట్సాప్‌కు పంపిస్తారు. బాధితులు ఆ పత్రాన్ని ప్రింట్ తీసుకుని సంతకం చేసిన తర్వాత పోస్ట్ లేదా కొరియర్ ద్వారా బషీర్‌బాగ్‌లోని సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌కు పంపితే సరిపోతుంది. ఆ ఫిర్యాదు అందగానే పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసి ఆ కాపీని బాధితుడి ఫోన్‌కే చేరవేస్తారు. దేశంలోనే తొలిసారిగా ప్రారంభమైన ఈ వినూత్న ప్రయోగం పది రోజుల్లోనే వెయ్యి మంది బాధితులకు సేవలు అందించి అద్భుత ఫలితాలను ఇస్తోంది. కేవలం పది రోజుల్లోనే 200 మందికి ఫిర్యాదు డ్రాఫ్ట్‌లు సిద్ధం చేసినట్లు వెల్లడించిన పోలీసులు ప్రస్తుతం హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో ఉన్న ఈ సేవలను త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా విస్తరిస్తామని ప్రకటించారు.

## బీజేపీ బాస్ నితిన్ నబిన్‌కు 'జెడ్' కేటగిరీ

**మొదటి పేజీ తరువాయి...**

సాధారణంగా కీలక రాజకీయ నేతలు, కేంద్ర మంత్రులకు మాత్రమే కల్పించే ఈ తరహా భద్రతను, గతంలో బీజేపీ అధ్యక్షుడిగా పనిచేసిన జేపీ నడ్డాకు కూడా కొనసాగించారు. ఇప్పుడు అదే ప్రోటోకాల్‌ను నితిన్ నబిన్‌కు కూడా వర్తింపజేస్తున్నారు.నిజానికి, నితిన్ నబిన్ 2025 డిసెంబర్‌లో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులైనప్పటి నుంచే ఆయనకు భద్రతా ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. పూర్తిస్థాయి అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టడంతో, పెరిగిన హోదా దృష్ట్యా ఆయనకు 'జెడ్' కేటగిరీ భద్రత కల్పించారు. బీహార్‌లోని బంకీపూర్ నుంచి ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన ఆయనకు రాజకీయంగా అపారమైన అనుభవం ఉంది. రానున్న రోజుల్లో పశ్చిమ బెంగాల్, అస్సాం, తమిళనాడు, కేరళ వంటి రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో పార్టీ అధినేతగా ఆయన దేశవ్యాప్తంగా విస్తృతంగా పర్యటించాల్సి ఉంటుంది. అందువల్ల ఆయనకు 'జెడ్' కేటగిరీ భద్రత అనివార్యమైంది.



# భారత్ - ఈయూ 'మదర్ ఆఫ్ ఆల్ డీల్స్'

**ఇంటర్నేషనల్ (ఏడీఎన్ఎన్):**

భారత్-యూరోపియన్ యూనియన్ (ఈయూ) మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) ఖరారు దిశగా కీలక అడుగులు పడుతున్నాయి. ఈ ఒప్పందానికి సంబంధించిన చర్చలు తుది దశకు చేరాయని యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డెర్ లీయెన్ తెలిపారు. ఈ ఒప్పందాన్ని చారిత్రకమైనదిగా పేర్కొన్న ఉర్సులా, కొంతమంది దీన్ని 'మదర్ ఆఫ్ ఆల్ డీల్స్'గా అభివర్ణిస్తున్నారని చెప్పారు. స్విట్జర్లాండ్‌లోని దావోస్ వేదికగా జరుగుతున్న ప్రపంచ ఆర్థిక ఫోరమ్ (డబ్ల్యూఈఎఫ్) సదస్సులో ఆమె ఈ విషయాన్ని ప్రకటించారు. భారత్-ఈయూ ఎఫ్‌టీఏకు సంబంధించిన కొన్ని అంశాలు ఇంకా పెండింగ్‌లో ఉన్నప్పటికీ, డీల్ ఖరారుకు మార్గం సుగమమవుతోందని ఆమె పేర్కొన్నారు. భారత్-ఈయూ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం అమలులోకి వస్తే, దాదాపు 200 కోట్ల మంది జనాభాతో కూడిన విశాలమైన స్వేచ్ఛాయుత మార్కెట్ ఏర్పడుతుందన్నారు. ఈ మార్కెట్ ప్రపంచ స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో దాదాపు పావు భాగం, అంటే 25 శాతం అవసరాలను తీరుస్తుందని వివరించారు. వాణిజ్య భాగస్వామ్యాలను విస్తరించడంలో వైవిధ్యాన్ని పెంచడమే లక్ష్యంగా ఈయూ ముందుకెళ్తోందని ఆమె వ్యాఖ్యానించారు. డబ్ల్యూఈఎఫ్ సదస్సు ముగిసిన వెంటనే తాను నేరుగా భారత పర్యటనకు వెళ్తున్నట్లు ఉర్సులా వాన్ డెర్ లీయెన్ ప్రకటించారు. భారత్-ఈయూ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం చర్చలను వేగవంతం చేయడంలో ఈ పర్యటన కీలకంగా ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రెండు పక్షాల మధ్య ఆర్థిక సంబంధాలను మరింత బలోపేతం చేయాల్సిన బాధ్యత తనపై ఉందన్నారు. ఐరోపా, భారత్ మధ్య సహకార భావనను మరింత పటిష్ఠం చేయడమే లక్ష్యంగా పని చేస్తానని చెప్పారు. ప్రపంచ దేశాలతో కలిసి నడిచేందుకు ఈయూ సిద్ధంగా ఉందని, అంతర్జాతీయ వాణిజ్యం, సహకారాన్ని పెంచడమే తమ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. పెట్టుబడులకు అనుకూలమైన సుస్థిర వాతావరణం, వాణిజ్య వికాసం, దీర్ఘకాలిక ఆర్థిక పురోగతే ఐరోపా దేశాల ఉమ్మడి వ్యూహమని ఉర్సులా చెప్పారు. ఈ విధానంతోనే ఈయూ ప్రపంచ దేశాలతో వాణిజ్య మార్గాల్లో అనుసంధానమవుతోందన్నారు. ఇంధన రంగంపై ఈయూ ప్రధానంగా దృష్టి సారించిందని అన్నారు. ఐరోపా దేశాల అభివృద్ధికి ఇంధనం అత్యంత కీలకమని, అందుకే ప్రత్యేక ఇంధన యూనియన్‌ను నిర్మించే ప్రణాళికలో ఉన్నామని వెల్లడించారు. దీని ద్వారా ఐరోపా ఖండంలోనే పెద్దమొత్తంలో, తక్కువ ఖర్చుతో ఇంధన వనరులను ఉత్పత్తి చేసే యూనిట్లను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఈ ప్రణాళిక అమలైతే ఈయూ ఆర్థిక వికాసానికి ఆటంకాలు ఉండవని వ్యాఖ్యానించారు. రక్షణ రంగంలోనూ ఈయూ గణనీయమైన పురోగతి సాధించిందని ఉర్సులా వాన్ డెర్ లీయెన్ తెలిపారు. గత కొన్ని దశాబ్దాల్లో సాధించలేనిదాన్ని గత ఏడాదే ఈయూ సాధించిందన్నారు. 2025 సంవత్సరానికి రక్షణ రంగానికి కేటాయించిన బడ్జెట్ రికార్డు స్థాయిలో పెరిగిందని వెల్లడించారు. ఐరోపా ఖండానికి చెందిన మూడు ప్రముఖ రక్షణ రంగ టెక్ స్టార్టప్‌లు యూనికార్న్ స్థాయికి ఎదగడం ఈ రంగంలోని ఆవిష్కరణలకు నిదర్శనమని స్పష్టం చేశారు. భారత రాజధాని దిల్లీలో జనవరి 26న జరగనున్న 77వ రిపబ్లిక్ డే వేడుకలకు ముఖ్య అతిథులుగా ఉర్సులా వాన్ డెర్ లీయెన్, యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో లూయిస్ శాంటోస్ డా కోస్టా హాజరుకానున్నారు. ప్రధాని మోదీ ఆహ్వానం మేరకు వీరిద్దరూ జనవరి 25 నుంచి మూడు రోజుల పాటు భారత్‌లో పర్యటించనున్నారు. జనవరి 27న జరగనున్న భారత్-ఈయూ 16వ సదస్సులో పాల్గొననున్నారు. భారత్, ఈయూ 2004 నుంచే వ్యూహాత్మక భాగస్వాములుగా ఉన్నాయని భారత విదేశాంగ శాఖ గుర్తుచేసింది. గత కొన్నేళ్లలో ద్వైపాక్షిక సంబంధాలు మరింత బలపడ్డాయని తెలిపింది. వాణిజ్యం, ఇంధనం, రక్షణ సహా అనేక రంగాల్లో రెండు పక్షాలు కలిసి పనిచేస్తున్నాయని వివరించింది. భారత్-ఈయూ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం ఖరారైతే, ఈ భాగస్వామ్యం కొత్త శిఖరాలకు చేరుతుందనే అంచనాలు వ్యక్తమవుతున్నాయి.



# లండన్ లో 8 ఏళ్ల విద్యార్థిపై మత వివక్ష

**ఇంటర్నేషనల్ (ఏడీఎన్ఎన్):**

యూకే రాజధాని లండన్‌లో చోటుచేసుకున్న ఒక ఘటన తీవ్ర చర్చనీయాంశంగా మారింది. తిలకం పెట్టుకున్న కారణంగా ఎనిమిదేళ్ల హిందూ విద్యార్థికి పాఠశాలలో వివక్ష ఎదురైన ఘటన స్థానికంగా తీవ్ర విమర్శలకు గురవుతోంది. స్కూల్ యాజమాన్యం అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఆ చిన్నారి చివరకు పాఠశాల మారాల్సిన పరిస్థితి ఏర్పడింది. బ్రిటన్‌లోని హిందూ, భారతీయ సమాజాలకు ప్రాతినిధ్యం వహించే ఇన్‌సైట్ యూకే సంస్థ వెల్లడించిన వివరాల ప్రకారం , లండన్‌లోని ఒక పాఠశాలలో చదువుతున్న ఎనిమిదేళ్ల బాలుడు తన మత సంప్రదాయానికి అనుగుణంగా తిలకం ధరించి స్కూల్‌కు వెళ్లేవాడు. దీనిపై పాఠశాల యాజమాన్యం అభ్యంతరం వ్యక్తం చేసింది. బాలుడి మతపరమైన ఆచారాల గురించి సిబ్బంది తరచూ ప్రశ్నలు వేయడం మొదలుపెట్టారు. పిల్లలు ఆడుకునే సమయంలో కూడా హెడ్‌టీచర్ ప్రత్యేకంగా ఆ బాలుడిపై దృష్టి సారించడంతో అతడు భయపడిపోయాడని ఇన్‌సైట్ యూకే తెలిపింది. దాంతో ఇతర విద్యార్థులతో కలిసి ఆడుకోవడానికీ, కలిసిమెలిసి ఉండడానికీ అతడికి ఇబ్బందులు ఎదురయ్యాయని పేర్కొంది. తన మత విశ్వాసాల కారణంగా ఏ విద్యార్థి ఒంటరితనాన్ని అనుభవించాల్సి రావడం తగదని సంస్థ స్పష్టం చేసింది. ఇలాంటి ఘటనలు చిన్నారుల మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతాయని, భద్రతాపరంగా కూడా ప్రశ్నలు లేవనెత్తుతాయని విమర్శించింది. విద్యార్థి తల్లిదండ్రులు తమ మత విశ్వాసాల గురించి పాఠశాల యాజమాన్యానికి వివరించే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయిందని తెలిపింది. చివరకు ఆ చిన్నారి స్కూల్ మార్చుకోవాల్సి వచ్చిందని ఆరోపించింది. ఈ ఘటన నిజమైతే యూకే చట్టాల ప్రకారం ఇది మత వివక్ష కిందకు వస్తుందని నిపుణులు చెబుతున్నారు. ఇప్పటికే ఇలాంటి వివక్షాత్మక చర్యల కారణంగా ఈ పాఠశాల నుంచి నలుగురు విద్యార్థులు వెళ్లిపోయినట్లు ఇన్‌సైట్ యూకే ఆగ్రహం వ్యక్తం చేసింది.

# 'బోర్డు ఆఫ్ పీస్' రూల్స్ తెలిస్తే షాకే..

**ఇంటర్నేషనల్ (ఏడీఎన్ఎన్):**

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఏర్పాటు చేసిన 'బోర్డు ఆఫ్ పీస్' ప్రస్తుతం అంతర్జాతీయ రాజకీయాల్లో హాట్‌టాపిక్‌గా మారింది. రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ట్రంప్ వరుసగా సంచలన నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఇజ్రాయెల్-గాజా యుద్ధంలో గాజా తీవ్రంగా ధ్వంసమవడంతో ఆ ప్రాంతాన్ని పునర్నిర్మించేందుకు ట్రంప్ ఇటీవల 'బోర్డు ఆఫ్ పీస్'ను ఏర్పాటు చేశారు. ఇది కేవలం గాజా పునర్నిర్మాణానికే పరిమితం కాకుండా, ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న అంతర్జాతీయ ఉద్రిక్తతలను పరిష్కరించే దిశగా విస్తరించబోతున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో ఓ తిరకాసు పెట్టారు. బోర్డు ఆఫ్ పీస్‌లో శాశ్వత సభ్యత్వం కావాలంటే 1 బిలియన్ అమెరికన్ డాలర్లు చెల్లించాల్సిందేనని ఆయన తాజాగా ఒక ప్రకటన చేశారు. ఈ నిర్ణయం విశ్వవేదికపై మిశ్రమస్పందన లభిస్తోంది. అంతర్జాతీయ సంస్థగా పనిచేయనున్న బోర్డు ఆఫ్ పీస్‌కు ఛైర్మన్‌గా అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ వ్యవహరిస్తారు. ప్రపంచవ్యాప్తంగా యుద్ధాలు, ఘర్షణలు, రాజకీయ సంక్షోభాలు ఉన్న ప్రాంతాల్లో స్థిరత్వాన్ని తీసుకురావడం, చట్టబద్ధమైన పాలనను పునరుద్ధరించడం దీని ప్రధాన లక్ష్యం. ఈ బోర్డులో చేరేందుకు ట్రంప్ యంత్రాంగం దాదాపు 60 దేశాలకు ఆహ్వానం



పంపినట్లు సమాచారం.ట్రంప్ ఛైర్మన్‌గా మాత్రమే కాకుండా అమెరికా తరఫున ప్రత్యేక ప్రతినిధిగా కూడా సేవలందిస్తారు. బోర్డు లక్ష్యాలను అమలు చేయడానికి అనుబంధ సంస్థలను ఏర్పాటు చేయడం, మార్పులు చేయడం లేదా రద్దు చేయడం వంటి పూర్తి అధికారాలు ఛైర్మన్‌కే ఉంటాయి. సభ్య దేశాలకు మూడేళ్ల పాటు పదవీకాలం ఉన్నప్పటికీ, వారిని ఎప్పుడైనా తొలగించే అధికారం బోర్డు ఛైర్మన్ కు ఉటుంది . ఛైర్మన్‌ను మార్చడం దాదాపు అసాధ్యం. ఆయన స్వచ్ఛందంగా రాజీనామా చేసినా, లేదా అనారోగ్యం వంటి కారణాలతో బాధ్యతలు నిర్వర్తించలేని పరిస్థితి వచ్చినా మాత్రమే మార్పు ఉంటుంది. బోర్డు తరఫున ట్రంప్ స్వయంగా తీర్మానాలు చేయడం, ఆదేశాలు జారీ చేయడం కూడా చేయవచ్చు. బోర్డు ఏర్పాటైన తొలి ఏడాదిలోనే 1 బిలియన్ డాలర్లు (సుమారు రూ.8,300 కోట్లు) విరాళంగా ఇచ్చే దేశానికి శాశ్వత సభ్యత్వం లభిస్తుంది. అటువంటి దేశాలకు మూడేళ్ల కాల పరిమితి వర్తించదు. కీలక నిర్ణయాలు తీసుకునే ఎగ్జిక్యూటివ్ బోర్డ్ సభ్యుల పదవీకాలం మాత్రం రెండేళ్లు మాత్రమే. ప్రతి సంవత్సరం ఓటింగ్ సమావేశాలు నిర్వహిస్తారు. ప్రతి సభ్య దేశానికి ఒక ఓటు ఉంటుంది. సమావేశానికి హాజరైన దేశాల్లో మెజారిటీ మద్దతు లభిస్తే నిర్ణయం ఆమోదం పొందుతుంది. ఓట్లు సమానంగా వచ్చినప్పుడు ఛైర్మన్‌కు అదనపు నిర్ణయాత్మక ఓటు ఉంటుంది. మెజారిటీ మద్దతు ఉన్నా కూడా ఛైర్మన్ ఆమోదం తప్పనిసరి. ఆయనకు నచ్చకపోతే నిర్ణయాన్ని తిరస్కరించే అధికారం ఉంది. ఈ బోర్డులో ట్రంప్‌తో పాటు అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో, ప్రత్యేక సంధానకర్త స్టీవ్ విట్‌కాఫ్, ట్రంప్ అల్లుడు జారెడ్ కుష్నర్, మాజీ బ్రిటిష్ ప్రధాని టోనీ బ్లెయిర్, బిలియనీర్ మార్క్ రోవాన్, ప్రపంచ బ్యాంకు అధ్యక్షుడు అజయ్ బంగా, జాతీయ భద్రతా మండలి సభ్యుడు రాబర్ట్ గాబ్రియేల్ వంటి ప్రముఖులు ఉన్నారు. రష్యా, భారత్, ఈజిప్ట్, కెనడా, పాకిస్తాన్ , జర్మనీ, ఫ్రాన్స్, ఇటలీ వంటి దేశాలకు ఆహ్వానాలు అందాయి. కనీసం మూడు దేశాలు నిబంధనలకు అంగీకరిస్తూ సంతకం చేసిన తర్వాత ఈ బోర్డు అధికారికంగా అమల్లోకి రానుంది.

# ఇరాన్ లో 16 మందికి ఎందుకు నిర్బంధం

**ఇంటర్నేషనల్ (ఏడీఎన్ఎన్):**

ఇరాన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఇటీవల ప్రజలు పెద్దఎత్తున వీధుల్లోకి వచ్చారు. అంతర్గతంగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న వేళ, ఇరాన్‌పై చర్యలు తీసుకుంటామని అమెరికా సంకేతాలిస్తోంది. ఇలాంటి సున్నిత సమయంలో భారత్‌కు చెందిన 16 మంది నౌకా సిబ్బందిని ఇరాన్ అధికారులు అదుపులోకి తీసుకోవడం సంచలనంగా మారింది. వీరిలో 10 మందిని జైలుకు తరలించారు. మిగిలిన వారిని కఠిన నిఘాలో ఓడలోనే ఉంచారు. దీంతో వారి కుటుంబాల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. ఇరాన్‌లో ఇటీవల నెలకొన్న రాజకీయ అశాంతి, ప్రభుత్వ వ్యతిరేక నిరసనలు, అమెరికా నుంచి వస్తున్న హెచ్చరికల మధ్య ఈ పరిణామం చోటుచేసుకోవడం మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. అసలేం జరిగింది? నలుగురు తెలుగువాళ్లు సహా 16 మంది భారతీయులు ఇరాన్‌లో నిర్బంధానికి గురికావడం దేశవ్యాప్తంగా ఆందోళన కలిగిస్తోంది. భారతీయ నౌకా సిబ్బందిని ఇరాన్ ఎందుకు అదుపులోకి తీసుకుంది? ప్రస్తుతం వారి పరిస్థితి ఏంటి? అన్న ప్రశ్నలకు సమాధానాలివే. నిబంధనలకు విరుద్ధంగా డీజిల్ తరలిస్తున్నారనే ఆరోపణలపై దిబ్బా ఓడరేవు సమీపంలోని అంతర్జాతీయ జలాల్లో ఇరాన్ అధికారులు 'ఎమ్‌టీ వాలియంట్ రోర్' అనే నౌకను స్వాధీనం చేసుకున్నారు. ఆ నౌకలో మొత్తం 18 మంది సిబ్బంది ఉన్నారు. ఈ నౌక ప్రైమ్ ట్యాంకర్స్ ఎల్ఎల్‌సీ యాజమాన్యంలో ఉంది. ఇందులో 16 మంది భారతీయులు, ఒక బంగ్లాదేశీ, ఒక శ్రీలంక పౌరుడు ఉన్నారు. డిసెంబరు 8న ఓడను స్వాధీనం చేసుకున్న ఇరాన్ అధికారులు, జనవరి 6న ఓడలోని భారతీయ సిబ్బందిలో 10 మందిని జైలుకు తరలించారు. మిగిలిన వారిని ఓడలోనే ఉంచి కఠిన నిఘా కొనసాగిస్తున్నారు. ఈ విషయాన్ని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖలో పాకిస్తాన్, అఫ్గానిస్తాన్, ఇరాన్ విభాగంలో పనిచేస్తున్న భారత ఫారిన్ సర్వీస్ అధికారి ఎం. ఆనంద్ ప్రకాశ్ ఒక వార్త సంస్థకు ధ్రువీకరించారు. "ఈ కేసు ఇరాన్ కోర్టులో పెండింగ్‌లో ఉంది. తుది నిర్ణయం అక్కడి న్యాయస్థానమే తీసుకుంటుంది. అయితే తెహ్రాన్‌లోని భారత రాయబార కార్యాలయం సిబ్బంది కాన్సులర్ యాక్సెస్ పొందేందుకు ప్రయత్నిస్తున్నారు" అని ఆయన తెలిపారు. జనవరి 10న కాన్సులర్ యాక్సెస్ లభిస్తుందని భావించినా, ఇరాన్‌లో నెలకొన్న గందరగోళ పరిస్థితుల వల్ల అది సాధ్యం కాలేదని చెప్పారు. అయినప్పటికీ ప్రయత్నాలు కొనసాగుతున్నాయని స్పష్టం చేశారు. తెహ్రాన్‌లోని భారత రాయబార కార్యాలయం కూడా ఒక ప్రెస్‌నోట్ విడుదల చేసి ఈ పరిణామాలను ధ్రువీకరించింది. డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ షిప్పింగ్‌తో పాటు నౌక యాజమాన్య సంస్థ ప్రైమ్ ట్యాంకర్స్ ఎల్ఎల్‌సీతో రాయబార కార్యాలయం నిరంతరం సంప్రదింపులు జరుపుతోందని తెలిపింది. మరోవైపు ఇరాన్ ప్రభుత్వ అధికారిక ప్రతిస్పందన కోసం ఎదురుచూస్తున్నట్లు పేర్కొంది. డీజిల్ అక్రమ రవాణా ఆరోపణలను నౌక యజమాని జోగిందర్ బరాడ్ ఖండించారు. "ఈ నౌక డీజిల్‌ను తీసుకెళ్లదు. ఇందులో 'వెరీ లో సల్ఫర్ ఫ్యూయల్ ఆయిల్' ఉంటుంది. ఇది అంతర్జాతీయ జలాల్లో ఇతర నౌకలకు ఇంధనం నింపడానికి ఉపయోగిస్తాం. ఇది



సాధారణ ప్రక్రియలో భాగమే" అని ఆయన బీబీసీకి వివరించారు. "ఇంధనాన్ని డీజిల్ అనుకుని ఇరాన్ అధికారులు మా సిబ్బందితో దురుసుగా ప్రవర్తించారు. ఇది పూర్తిగా తప్పు. మా మొదటి ప్రాధాన్యత సిబ్బందిని సురక్షితంగా భారత్‌కు తీసుకురావడమే" అని చెప్పారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఓడ కెప్టెన్ విజయ్ కుమార్, ఆయిలర్ ఆకాశ్ గుప్తా, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సెకండ్ ఆఫీసర్ దుంగా రాజశేఖర్, డెక్ ఫిట్టర్ నందకీ వెంకటేశ్, కుక్ దివాకర్ పుత్తి, పంజాబ్‌కు చెందిన సీమాన్-1 విశాల్ కుమార్‌లను గత 45 రోజులుగా ఇరాన్ భద్రతా దళాలు ఓడలోనే కఠిన నిఘాలో ఉంచాయి. వీరితో పాటు బంగ్లాదేశ్ చీఫ్ ఇంజనీర్ మొహమ్మద్ లుక్మాన్, శ్రీలంక ఎలక్ట్రికల్-టెక్నికల్ ఆఫీసర్ ప్రియా మనాథుంగ కూడా ఓడలోనే నిర్బంధంలో ఉన్నారు. ఓడలోని పరిస్థితులు దయనీయంగా ఉన్నాయని సిబ్బంది బంధువులు చెబుతున్నారు. ఎనిమిది మంది సిబ్బందిని 14 అడుగుల పొడవు, 10 అడుగుల వెడల్పు ఉన్న మెస్‌లో ఉంచారు. అదే గదిలో రాత్రిపూట నిద్రపోవాల్సి వస్తోంది. విడుదలపై స్పష్టత లేకుండా రోజులు గడుస్తుండటంతో మానసికంగా తీవ్ర ఒత్తిడిలో ఉన్నారు. డిసెంబరు మూడో వారంలో ఓడలోని సరుకులన్నీ అయిపోవడంతో డిసెంబరు 25న యజమాని సరుకులు పంపించారు. కానీ వారం రోజుల్లోనే బియ్యం మాత్రమే మిగిలాయి. కుక్ దివాకర్ రోజుకు రెండుసార్లు అన్నం వండుతున్నాడు. ఎనిమిది మంది ఆ అన్నాన్ని ఉప్పుతో మాత్రమే తింటున్నారు. అదే వారి రోజువారీ ఆహారం. దాదాపు పది రోజులుగా తాగునీరు కూడా అందడం లేదని సిబ్బంది చెబుతున్నారు. పారిశ్రామిక అవసరాల కోసం ఉంచిన నీటిని మరిగించుకుని తాగుతున్నారు. ఆ నీటిపై 'తాగడానికి కాదు' అని స్పష్టంగా రాసి ఉంది. అయినప్పటికీ అదే నీటిని తాగాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇంధనం కూడా తక్కువగా ఉండటంతో రాత్రిపూట మాత్రమే జనరేటర్‌ను ఉపయోగిస్తున్నారు. అది ఎంతకాలం పనిచేస్తుందో తెలియని పరిస్థితి. ఓడలోని ఇంధనం పూర్తిగా అయిపోయే దశకు చేరిందని కెప్టెన్ విజయ్ కుమార్ సోదరుడు వినోద్ పన్వర్ ఆవేదన వ్యక్తం చేశారు. డిసెంబరు 8న ఇరాన్ భద్రతా దళాలు సిబ్బంది మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, దుస్తుల బ్యాగులను స్వాధీనం చేసుకున్నాయి. అనేక విజ్ఞప్తుల తర్వాత ఒక మొబైల్ ఫోన్ మాత్రమే ఇచ్చారు. దాని ద్వారానే వారు రోజుకు లేదా రెండురోజులకు ఒకసారి కుటుంబ సభ్యులతో వాట్సాప్ కాల్స్‌లో మాట్లాడుతున్నారు. జనవరి 31 వరకు కేవలం 5 జీబీ డేటా మాత్రమే అందుబాటులో ఉందని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. జనవరి 6న ఆంధ్రప్రదేశ్‌కు చెందిన థర్డ్ ఆఫీసర్ వెంకట్, ఉత్తరప్రదేశ్‌కు చెందిన చీఫ్ ఆఫీసర్ అనిల్ కుమార్ సింగ్, సీమాన్ ఆకాష్ కుమార్ సింగ్, గోపాల్ చౌహాన్, షోయబ్ అక్తర్, హరియాణాకు చెందిన సెకండ్ ఇంజనీర్ సతీశ్ కుమార్, ఢిల్లీకి చెందిన థర్డ్ ఇంజనీర్ కేతన్ మెహతా, తమిళనాడుకు చెందిన డెక్ క్యాడెట్ ఏరో దరీష్, బిహార్‌కు చెందిన ఆయిలర్ మసూద్ ఆలమ్, ముంబైకి చెందిన ఆయిలర్ అన్సారీ మంజూర్ అహ్మద్‌లను జైలుకు తరలించారు. ఈ 16 మందిలో చాలామంది జనవరిలోనే తమ విధులను ముగించుకుని భారత్‌కు తిరిగివెళ్లాల్సి ఉంది. విశాల్ కుమార్, నందకీ వెంకటేశ్, మసూద్ ఆలమ్‌ల తొమ్మిది నెలల ఒప్పందం కూడా ఈ జనవరిలోనే ముగియాల్సి ఉంది. "జనవరి 5న నా అబ్బాయి చివరిసారి ఫోన్ చేశాడు. చాలా తక్కువగా మాట్లాడాడు. అప్పటి నుంచి ఎలాంటి సమాచారం లేదు" అని మసూద్ ఆలమ్ తండ్రి ఇబ్రార్ అన్సారీ కన్నీటితో చెప్పారు. డిసెంబరు 8న అదుపులోకి తీసుకునే సమయానికి మసూద్ జ్వరంతో బాధపడుతున్నాడని, ఇప్పుడు అతడి ఆరోగ్యం ఎలా ఉందో తెలియదని ఆందోళన వ్యక్తం చేశారు. ఈద్ తర్వాత అతడి వివాహం జరగాల్సి ఉండగా, ఈ ఘటన కుటుంబాన్ని తీవ్రంగా దెబ్బతీసింది.ఆంధ్రప్రదేశ్‌కు చెందిన దుంగా రాజశేఖర్ సోదరి వివాహం మార్చిలో ఉంది. "ఇలాంటి పరిస్థితుల్లో పెళ్లి గురించి ఆలోచించలేకపోతున్నాం" అని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. "కేతన్ జైలుకు వెళ్లాడని తెలిసిన తర్వాత నా భార్య ఆరోగ్యం క్షీణిస్తోంది" అని కేతన్ తండ్రి ముకేశ్ మెహతా వాపోయారు. కంపెనీ తీరుపై కుటుంబ సభ్యులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. "డిసెంబరు 8న ఈ ఘటన జరిగినప్పుడు కంపెనీ సీరియస్‌గా స్పందించి ఉంటే, ఈ రోజు 10 మంది జైలులో ఉండేవారు కాదు" అని ముకేశ్ మెహతా అన్నారు. భారత నావికుల సంఘం ప్రధాన కార్యదర్శి ప్రదీప్ సింగ్ స్పందిస్తూ, "ఓడను నడిపేది కంపెనీ. సిబ్బంది కాదు. ఇరాన్ ప్రభుత్వం ఉద్యోగులను జైలుకు పంపడం అమానవీయం" అని మండిపడ్డారు. ప్రైమ్ ట్యాంకర్స్ ఎల్ఎల్‌సీకి సంబంధించిన సమస్యలను ఇప్పటికే డైరెక్టర్ జనరల్ ఆఫ్ షిప్పింగ్ దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. "ఈ 42 రోజులు మాకు నరకప్రాయంగా గడిచాయి. చివరకు హైకోర్టును ఆశ్రయించాల్సి వచ్చింది" అని కెప్టెన్ విజయ్ కుమార్ భార్య సోనియా తెలిపారు. ఇరాన్‌లో బందీలుగా ఉన్న భారతీయులను ఎప్పుడు, ఎలా విడుదల చేస్తారన్నది ఇప్పటికీ ప్రశ్నార్థకంగానే ఉంది.

# ఫ్రాన్స్ పై 200 శాతం టారిఫ్ వార్నింగ్

**ఇంటర్నేషనల్ (ఏడీఎన్ఎన్):**

గ్రీన్‌లాండ్ వివాదం రోజురోజుకు ముదురుతోంది. గ్రీన్‌లాండ్‌ను ఎలాగైనా అమెరికా ఆధీనంలోకి తీసుకుంటామని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పష్టం చేస్తుండగా, మిత్రదేశాలైన యూరోపియన్ దేశాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. దీంతో మిత్రదేశాల మధ్యే ఘర్షణ వాతావరణం నెలకొన్నట్టుగా కనిపిస్తోంది. ఈ వ్యవహారంలో ఫ్రాన్స్ బహిరంగంగా ఎదురు నిలవడంతో ట్రంప్ హెచ్చరికలు జారీ చేశారు. ఫ్రాన్స్ పై 200 శాతం సుంకం విధిస్తామని ట్రూత్ సోషల్ వేదికగా ట్రంప్ వార్నింగ్ ఇచ్చారు. అమెరికా భద్రతా ప్రయోజనాల కోసమే గ్రీన్‌లాండ్‌ను స్వాధీనం చేసుకోవాల్సిన అవసరం ఉందని ట్రంప్ వాదిస్తున్నారు. రష్యా, చైనా నుంచి ఎదురవుతున్న ముప్పుల నుంచి గ్రీన్‌లాండ్‌ను రక్షించడంలో డెన్మార్క్ విఫలమైందని, అందుకే అమెరికా ముందుకొస్తోందని అమెరికా ట్రెజరీ కార్యదర్శి స్కాట్ బెసెంట్ వ్యాఖ్యలను సమర్థించారు. ఈ వ్యాఖ్యలను ఫ్రాన్స్ తీవ్రంగా తప్పుపట్టింది. ఈ నేపథ్యంలో ఫ్రెంచ్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ ట్రంప్‌ను ఉద్దేశించి ఒక ప్రైవేట్ సందేశాన్ని సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. "గ్రీన్‌లాండ్ విషయంలో ట్రంప్ ఏమి



చేస్తున్నారో తనకు అర్థం కావడం లేదు" అంటూ వ్యాఖ్యానించారు. ఇక గాజా అంశంపై ట్రంప్ ప్రతిపాదించిన 'బోర్డ్ ఆఫ్ పీస్'కూ ఫ్రాన్స్ వ్యతిరేకత వ్యక్తం చేసింది. దీంతో ట్రంప్ ఆగ్రహం మరింత పెరిగింది. గ్రీన్‌లాండ్ వ్యవహారం, శాంతి మండలి ప్రతిపాదనలపై ఫ్రాన్స్ వైఖరికి ప్రతిగా ఫ్రెంచ్ వైన్, షాంపైన్‌లపై 200 శాతం సుంకాలు విధిస్తామని బెదిరించారు. గ్రీన్‌లాండ్‌ను అమెరికా సొంతం చేసుకున్నట్టుగా ఏఐతో రూపొందించిన చిత్రాన్ని కూడా షేర్ చేశారు. దావోస్‌లో ప్రపంచ ఆర్థిక సదస్సు కొనసాగుతోంది. ఈ సందర్భంగా ట్రంప్, జీ7 దేశాల నేతలు పాల్గొననున్నారు. ఈ సమావేశాల వేళ ట్రంప్‌ను మాక్రాన్ కలవనున్నట్లు సమాచారం. దావోస్ వేదికగానే గ్రీన్‌లాండ్ వివాదం మరోసారి అంతర్జాతీయ చర్చకు వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. పరిస్థితి ఎటు దారితీస్తుందో చూడాల్సిందే.



# ఇజ్రాయెల్‌లో ఐరాస అనుబంధ సంస్థ కూల్చివేత

**ఇంటర్నేషనల్ (ఏడీఎన్ఎన్):**

పాలస్తీనా శరణార్థుల కోసం పనిచేస్తున్న ఐక్యరాజ్యసమితి అనుబంధ సంస్థ యునైటెడ్ నేషన్స్ రిలీఫ్ అండ్ వర్క్స్ ఏజెన్సీ ప్రధాన కార్యాలయాన్ని ఇజ్రాయెల్ దళాలు కూల్చివేశాయి. తూర్పు జెరూసలెంలోని షేక్ జర్రా ప్రాంతంలో ఉన్న ఈ కార్యాలయాన్ని నేలమట్టం చేశారు. ఇజ్రాయెల్ బలగాలు తమ ప్రాంగణంలోకి చొరబడి సిబ్బందిని బలవంతంగా బయటకు తరలించాయని యూఎన్ఆర్‌డబ్ల్యూఏ 'ఎక్స్' వేదికగా వెల్లడించింది. ఈ చర్య అంతర్జాతీయ చట్టాలు, ఐక్యరాజ్యసమితి హక్కుల ఉల్లంఘన అని తీవ్రంగా ఖండించింది. హమాస్ గ్రూప్‌తో యూఎన్ఆర్‌డబ్ల్యూఏకు సంబంధాలున్నాయని ఇజ్రాయెల్ ఆరోపిస్తోంది. తమ దేశంలో నిషేధించిన ఈ సంస్థపై తీసుకొచ్చిన కొత్త చట్టం ప్రకారమే కూల్చివేతలు చేపట్టామని ఆ దేశ విదేశాంగ మంత్రి తెలిపారు. 1950 నుంచి పనిచేస్తున్న యూఎన్ఆర్‌డబ్ల్యూఏ, ఇజ్రాయెల్ దాడుల్లో నిరాశ్రయులైన పాలస్తీనియన్లకు ఆశ్రయం, విద్య, వైద్య సేవలు అందిస్తోంది. ఈ సంస్థ కార్యకలాపాలపై ఇజ్రాయెల్ గతంలోనే ఆంక్షలు విధించింది.



# నోబెల్ పై నార్వేకు ట్రంప్ లేఖ

**ఇంటర్నేషనల్ (ఏడీఎన్ఎన్):**

"నాకు నోబెల్ శాంతి బహుమతి ఇవ్వలేదు. నేను ఇంకా శాంతి గురించి మాత్రమే ఆలోచించాల్సిన అవసరం ఉందా?" అంటూ అమెరికా అధ్యక్షుడు డోనల్డ్ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. గతేడాది తనకు నోబెల్ శాంతి పురస్కారంపై దక్కకపోవడంపై ఆవేదనకు గురై నార్వే ప్రధాని జోనాస్ గార్ స్టోర్‌కు ట్రంప్ లేఖాస్త్రాన్ని సంధించారు. ఎనిమిదికిపైగా యుద్ధాలను ఆపినప్పటికీ తనకు నోబెల్ శాంతి పురస్కారం ఇవ్వలేదని ట్రంప్ తెలిపారు. అమెరికాకు ఏది మంచిదో, అదే నేను ఆలోచిస్తాను" అని ట్రంప్ పేర్కొన్నారు. ట్రంప్ లేఖకు నార్వే ప్రధాని జోనాస్ స్టోర్ తిరిగి సమాధానం పంపారు. నోబెల్ బహుమతుల అంశాన్ని పూర్తిగా స్వతంత్ర కమిటీ పర్యవేక్షిస్తుందని, ఇది నార్వే ప్రభుత్వ పరిధిలోకి రాదని ఆయన ట్రంప్‌కు వివరించారు. గతేడాది అక్టోబరులో వెనుజువెలా ప్రతిపక్ష నేత మరియా కొరీనా మచాదోకు నోబెల్ శాంతి పురస్కారం లభించిన సంగతి తెలిసిందే. ఇదిలా ఉండగా, గ్రీన్‌లాండ్‌పై ట్రంప్ చేసిన వ్యాఖ్యలు మరోసారి ఉద్రిక్తతలకు దారితీశాయి. "గ్రీన్‌లాండ్‌పై పూర్తి, సంపూర్ణ నియంత్రణ అమెరికాకు అవసరం" అని స్టోర్‌కు పంపిన సందేశంలో ట్రంప్ పేర్కొన్నారు. గ్రీన్‌లాండ్‌ను స్వాధీనం చేసుకునేందుకు బలగాల వినియోగం ఉంటుందా? అని మీడియా ప్రశ్నించగా, "నో కామెంట్" అంటూ తప్పించుకున్నారు. గ్రీన్‌లాండ్ డెన్మార్క్ పరిధిలో ఉండగా, డెన్మార్క్ నాటోలో కీలక సభ్యదేశం. నాటో నిబంధనల ప్రకారం ఒక సభ్య దేశంపై దాడి జరిగితే మిగతా సభ్యదేశాలన్నీ కలిసి స్పందించాల్సి ఉంటుంది. 1949లో నాటో ఏర్పాటైనప్పటి నుంచి సభ్య దేశాల మధ్య యుద్ధం జరగలేదు. గ్రీన్‌లాండ్‌లో అమెరికా సైనిక చర్యలు చేపడితే అది నాటోకు ముగింపు పలికినట్లేనని డెన్మార్క్ హెచ్చరించింది. ఈ విషయంలో యూరోపియన్ సభ్యదేశాలు డెన్మార్క్ కు మద్దతు తెలుపుతున్నాయి. ఉద్రిక్తతలు పెరుగుతున్న వేళ, నార్వే ప్రధాని స్టోర్ మరియు ఫిన్‌లాండ్ అధ్యక్షుడు అలెగ్జాండర్ స్టబ్ కలిసి ట్రంప్‌కు సందేశం పంపారు. "ప్రపంచంలో పెరుగుతున్న ఉద్రిక్తతలను తగ్గించేందుకు మనమంతా కలిసి పని చేయాలి" అని వారు కోరారు. దీనికి ప్రతిస్పందనగా ట్రంప్, "నాటో కోసం నేను ఎవరు చేయలేనంత చేశాను. ఇప్పుడు నాటో కూడా అమెరికా కోసం కొంత చేయాలి" అని వ్యాఖ్యానించారు. తక్కువ జనాభా, అధిక వనరులతో కూడిన గ్రీన్‌లాండ్ ఆర్కిటిక్ ప్రాంతంలో వ్యూహాత్మకంగా కీలకమైన ద్వీపం. క్షిపణి దాడుల ముందస్తు హెచ్చరిక వ్యవస్థలకు, నౌకల పర్యవేక్షణకు ఇది అనువైన ప్రాంతంగా భావిస్తారు. ఈ నేపథ్యంలో ట్రంప్ వ్యాఖ్యలు భవిష్యత్తులో మరిన్ని అంతర్జాతీయ పరిణామాలకు దారితీయనున్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.



# పాక్ పుట్టిన ఉద్దేశం పై అసిమ్ మునీర్ కీలక వ్యాఖ్యలు

**ఇంటర్నేషనల్ (ఏడీఎన్ఎన్):**

పాకిస్తాన్ ఆవిర్భావం వెనుక ఒక దైవిక లక్ష్యం ఉందని, ఆ లక్ష్యాన్ని నెరవేర్చే చారిత్రాత్మక అవకాశం ఇప్పుడు తమ ముందుందని ఆదేశ ఆర్మీ చీఫ్ జనరల్ అసిమ్ మునీర్ ఘాటుగా స్పందించారు. ముస్లిం ప్రపంచంలో పాక్ కు ప్రత్యేక స్థానం ఉందని, అల్లాహ్ ఆశీర్వాదాల వల్లే దేశం ముందుకు సాగుతోందని ఆయన చెప్పుకొచ్చారు. గతంలోనూ మతపరమైన వ్యాఖ్యలతో సంచలనం రేపిన మునీర్, ఈసారి వ్యాఖ్యలు మరింత రహస్యంగా, రెచ్చగొట్టేలా ఉండటంతో అసలు ఉద్దేశం ఏంటన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. "పాక్ ఏ గొప్ప లక్ష్యం కోసమైతే ఏర్పడిందో, ఆ గమ్యాన్ని చేరుకునేందుకు ఇప్పుడు దైవం మాకు అరుదైన అవకాశాన్ని ఇచ్చింది. మేము ఆ దిశగా వేగంగా అడుగులు వేస్తున్నాం" అని మునీర్ పేర్కొన్నారు. అయితే ఆ లక్ష్యం ఏమిటో, ఆ గమ్యం ఏంటో స్పష్టంగా చెప్పకపోవడం గమనార్హం. ఈ అస్పష్టతే అనుమానాలకు తావిస్తోంది. నవాజ్ షరీఫ్ మనవడు జునైద్ సఫ్దర్ వివాహ రిసెప్షన్ సందర్భంగా మీడియాతో మాట్లాడిన అసిమ్ మునీర్, పాకిస్తాన్ కేవలం ఒక దేశం మాత్రమే కాదని, ఇస్లాం పేరుతో ఏర్పడిన ప్రత్యేక అస్తిత్వమని ఆయన వ్యాఖ్యానించారు. ఒకవైపు దేశం తీవ్ర అప్పుల భారంతో కుంగిపోతోంది. తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న పాకిస్తాన్ పరిస్థితుల మధ్య మునీర్ ఈ వ్యాఖ్యలు రావడం విశేషం. ఇప్పటివరకు 24 సార్లు ఐఎంఎఫ్‌ను ఆశ్రయించిన పాకిస్తాన్ , ప్రస్తుతం కూడా 7 బిలియన్ డాలర్ల సహాయ ప్యాకేజీపై ఆధారపడి ఉంది. సౌదీ అరేబియా, గల్ఫ్ దేశాల ఆర్థిక సాయమే దేశాన్ని నిలబెట్టిందన్న వాస్తవాన్ని పక్కనపెట్టి, అంతర్జాతీయ ప్రతిష్ట పెరుగుతోందని మునీర్ చెప్పడం ఆశ్చర్యం కలిగిస్తోంది.



# ఖాకీ నిబద్ధతకు సలాం

**అమరావతి (ఏడీఎన్ఎన్) :**

విధుల్లో ఉన్నా లేకపోయినా, ప్రజా సేవయే పరమావధిగా భావించే పోలీసుల నిబద్ధతకు కాకినాడ మహిళా కానిస్టేబుల్ జయశాంతి నిలువెత్తు నిదర్శనంగా నిలిచారు. చేతిలో చంటిబిడ్డ ఉన్నా, అత్యవసర స్థితిలో ఉన్న అంబులెన్స్‌కు దారి కల్పించేందుకు ఆమె చేసిన కృషి రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఈ ఘటనపై ఆంధ్రప్రదేశ్ హోంమంత్రి వంగలపూడి అనిత స్పందిస్తూ,జయశాంతికి ఫోన్ చేసి మంగళవారం ప్రత్యేకంగా అభినందించారు. గత శనివారం సాయంత్రం కాకినాడ కెనాల్ రోడ్డులో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఆ సమయంలో తన చిన్నబిడ్డతో కలిసి అటుగా వెళ్తున్న జయశాంతి, ట్రాఫిక్‌లో ఓ అంబులెన్స్ చిక్కుకుపోవడాన్ని గమనించారు. తాను సెలవులో ఉన్నప్పటికీ, అంబులెన్స్‌లోని రోగి ప్రాణాలను కాపాడటమే లక్ష్యంగా ఆమె తక్షణమే రంగంలోకి దిగారు. ఒక చేత్తో చంటిబిడ్డను ఎత్తుకుని, మరో చేత్తో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తూ అంబులెన్స్ వెళ్లేందుకు మార్గం సుగమం చేశారు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో నెటిజన్లు ఆమెపై ప్రశంసల వర్షం కురిపించారు. హోంమంత్రి మంగళవారం జయశాంతితో ఫోన్‌లో మాట్లాడిన హోంమంత్రి అనిత, ఆమె యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. "విధుల్లో లేకపోయినా సమాజ హితాన్ని దృష్టిలో పెట్టుకుని మీరు వ్యవహరించిన తీరు అద్భుతం. ఒక తల్లిగా, ఒక కానిస్టేబుల్‌గా మీరు చూపిన అంకితభావం పోలీస్ శాఖ గౌరవాన్ని పెంచింది," అని హోంమంత్రి కొనియాడారు. జయశాంతి చర్య ప్రజల్లో పోలీసులపై నమ్మకాన్ని మరింత పెంచిందని ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా హోంమంత్రిని నేరుగా కలవాలని ఉందని జయశాంతి తన కోరికను వ్యక్తపరచగా, మంత్రి సానుకూలంగా స్పందించారు. త్వరలోనే పిలిపించి పరామర్శిస్తానని హామీ ఇచ్చారు. జయశాంతిని సోషల్ మీడియా వేదికగా అభినందించిన ప్రతి ఒక్కరికీ పోలీస్ శాఖ తరపున మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఘటన కేవలం ఖాకీలకే కాకుండా, బాధ్యతాయుతమైన పౌర సమాజానికి ఒక గొప్ప స్ఫూర్తిగా నిలుస్తోంది.

# టెన్త్ పరీక్షల షెడ్యూల్ విడుదల..

## రంజాన్ నేపథ్యంలో ఇంగ్లీష్ పేపర్ తేదీలో మార్పు!

**మంగళగిరి (ఏడీఎన్ఎన్):**



ఆంధ్రప్రదేశ్ పదో తరగతి విద్యార్థులకు పాఠశాల విద్యాశాఖ కీలక అప్‌డేట్ ఇచ్చింది. 202526 విద్యా సంవత్సరానికి గాను పదో తరగతి వార్షిక పరీక్షల షెడ్యూల్‌ను మంగళవారం సాయంత్రం విడుదల చేసింది. మంగళగిరిలోని ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం.. మార్చి 16 నుంచి ఏప్రిల్ 1 వరకు ఈ పరీక్షలు నిర్వహించనున్నారు. అయితే, పండుగ సెలవుల కారణంగా ప్రాథమిక షెడ్యూల్‌లో ఒక చిన్న మార్పు చోటుచేసుకోనుంది. తొలుత ప్రకటించిన వివరాల ప్రకారం, మార్చి 20వ తేదీన ఇంగ్లీష్ పరీక్ష జరగాల్సి ఉంది. అయితే, అదే రోజున రంజాన్ పండుగ రావడంతో ప్రభుత్వం ఇప్పటికే ఆ రోజును సాధారణ సెలవు దినంగా ప్రకటించింది. పండుగ రోజున పరీక్ష నిర్వహించడం విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఇబ్బందికరంగా మారుతుందన్న ఉద్దేశంతో విద్యాశాఖ పునరాలోచనలో పడింది. దీనిని పరిగణనలోకి తీసుకుని, మార్చి 20న జరగాల్సిన ఇంగ్లీష్‌పరీక్షను మరుసటి రోజున, అంటే మార్చి 21న నిర్వహించే అవకాశం ఉంది. ఈ మార్పును క్రోడీకరిస్తూ సవరించిన పూర్తిస్థాయి షెడ్యూల్‌ను బోర్డు త్వరలోనే అధికారికంగా ప్రకటించనుంది. దీనిపై బోర్డు డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. రంజాన్ సెలవు దృష్ట్యా విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరుకానున్న నేపథ్యంలో, కేంద్రాల కేటాయింపు , ఇతర మౌలిక వసతులపై ఇప్పటికే కసరత్తు ప్రారంభించినట్లు వెల్లడించారు. త్వరలోనే పూర్తిస్థాయి సవరించిన టైమ్ టేబుల్ వెబ్‌సైట్‌లో అందుబాటులోకి రానుంది. విద్యార్థులు తమ ప్రిపరేషన్‌ను మార్చి 16 ప్రారంభ తేదీకి అనుగుణంగా కొనసాగించాలని అధికారులు సూచించారు. పరీక్షా కేంద్రాల్లో సిసి కెమెరాల నిఘా, కట్టుదిట్టమైన భద్రత మధ్య ఈ ఏడాది పరీక్షలను నిర్వహించనున్నట్లు విద్యాశాఖ స్పష్టం చేసింది.




# నగరి పోలీసులకు 'డ్రోన్' పవర్

**చిత్తూరు (ఏడీఎన్ఎన్) :**

జిల్లాలో నేర నియంత్రణకు సాంకేతికతను జోడించి, నిఘా వ్యవస్థను మరింత పటిష్టం చేసే దిశగా జిల్లా పోలీసు శాఖ మరో కీలక అడుగు వేసింది. కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధుల ద్వారా సమకూరిన 7 కొత్త అత్యాధునిక డ్రోన్లను జిల్లా ఎస్పీ తుషార్ డూడి , నగరి సబ్‌డివిజన్ పోలీసులకు మంగళవారం అధికారికంగా అప్పగించారు. ఈ సందర్భంగా పోలీసు అతిథి గృహంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, టెక్నాలజీ ఆధారిత పోలీసింగ్‌తో ప్రజల భద్రతను మెరుగుపరుస్తామని స్పష్టం చేశారు. నగరి సబ్‌డివిజన్ పరిధిలోని అంతరాష్ట్ర సరిహద్దులు, దట్టమైన అటవీ ప్రాంతాలు ,రద్దీగా ఉండే పట్టణ ప్రదేశాలపై నింగి నుండి నిరంతరం నిఘా ఉంచేందుకు ఈ డ్రోన్లు కీలకంగా మారనున్నాయి. ముఖ్యంగా భారీ సభలు, ఉత్సవాలు జాతరల సమయంలో జనసమూహాన్ని పర్యవేక్షించడంతో పాటు, ట్రాఫిక్ జామ్‌లను తక్షణమే గుర్తించి క్లియర్ చేయడానికి ఈ సాంకేతికత ఎంతగానో దోహదపడుతుందని ఎస్పీ వివరించారు. నేరస్తుల కదలికలను ఎప్పటికప్పుడు పసిగట్టేందుకు ఇవి పోలీసులకు 'మూడవ కన్ను'లా పనిచేయనున్నాయి. అసాంఘిక కార్యకలాపాలపై ఎస్పీ తుషార్ డూడి ఈ సందర్భంగా తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. అక్రమ మద్యం తయారీ, గంజాయి సాగు, ఇసుక అక్రమ రవాణా వంటి కార్యకలాపాలను డ్రోన్ల సాయంతో వేగంగా గుర్తించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. గతంలో పోలీసులకు చేరువకాని అటవీ ప్రాంతాల్లోని రహస్య స్థావరాలను కూడా ఇకపై ఈ డ్రోన్ల ద్వారా క్షుణ్ణంగా తనిఖీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు మరియు నగరి సబ్‌డివిజన్ పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# ఉగాది నుంచే 'గ్రీన్ కవర్' యాక్షన్ ప్లాన్..

**అమరావతి (ఏడీఎన్ఎన్) :**



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని పర్యావరణ హితంగా మార్చేందుకు కూటమి ప్రభుత్వం భారీ ప్రణాళికను సిద్ధం చేసింది. రాష్ట్ర భూభాగంలో 50 శాతం పచ్చదనాన్ని నింపే 'గ్రీన్ కవర్ ప్రాజెక్టు'లో అన్ని శాఖలు త్రికరణ శుద్ధిగా భాగస్వామ్యం కావాలని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. వెలగపూడి సచివాలయంలో అటవీ శాఖ , వివిధ శాఖల ఉన్నతాధికారులతో మంగళవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన కీలక ఆదేశాలు జారీ చేశారు. వచ్చే ఉగాది నుంచే 'గ్రీన్ కవర్ యాక్షన్ ప్లాన్' అమలు కావాలని, ఆలోపు అన్ని శాఖలు పూర్తిస్థాయి ప్రణాళికలతో సిద్ధం కావాలని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని ప్రభుత్వం పచ్చదనానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. 2047 నాటికి రాష్ట్రంలో 50 శాతం గ్రీన్ కవర్ ఉండాలనేది ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. ఇందుకోసం మొత్తం 32.60 లక్షల ఎకరాల్లో మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో భాగంగా 2030 నాటికి 37 శాతం పచ్చదనం సాధించాలని, ప్రస్తుతం ఉన్న 30 శాతం గ్రీనరీకి తోడుగా వచ్చే నాలుగేళ్లలో మరో 7 శాతం పెంచేలా 9 లక్షల హెక్టార్లలో చెట్లను నాటాలని అధికారులకు నిర్దేశించారు. ఈ బృహత్తర యజ్ఞంలో వివిధ శాఖలకు పవన్ కల్యాణ్ ప్రత్యేక బాధ్యతలను కేటాయించారు. మొత్తం లక్ష్యంలో ఉద్యానవన శాఖ 12 శాతం మొక్కలు నాటే బాధ్యతను తీసుకోవాలని సూచించారు. పరిశ్రమల శాఖ కాలుష్యాన్ని నియంత్రించే మొక్కలపై దృష్టి పెట్టాలని, తీర ప్రాంతాల్లో పెనుగాలులు మరియు ఉప్పు నీటిని తట్టుకునే మొక్కలను పెంచాలని ఆదేశించారు. ముఖ్యంగా 'గ్రేట్ గ్రీన్ వాల్' ప్రాజెక్టులో భాగంగా మన నేలలకు అలవాటైన స్వజాతి వృక్షాలనే నాటాలని అధికారులకు స్పష్టమైన సూచనలు చేశారు. ప్రాజెక్టు అమలుకు అవసరమైన నిధుల కేటాయింపు ,పర్యవేక్షణపై అధికారులతో కూలంకషంగా చర్చించిన ఉపముఖ్యమంత్రి, పర్యావరణ సమతుల్యత దెబ్బతినకుండా భవిష్యత్ తరాలకు పచ్చని ఆంధ్రప్రదేశ్‌ను అందించడమే ఈ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశమని వెల్లడించారు. ప్రతి అధికారి దీన్ని ఒక బాధ్యతగా తీసుకుని పని చేయాలని కోరారు. ఉగాది నుంచి ప్రారంభం కానున్న ఈ కార్యాచరణ ద్వారా రాష్ట్రంలో గణనీయమైన పర్యావరణ మార్పులు వస్తాయని ప్రభుత్వం ఆశిస్తోంది.

# లక్ష కోట్లతో ఆర్ఎంజెడ్ సంస్థ ప్రాజెక్టులు

**అమరావతి (ఏడీఎన్ఎన్) :**

ఆంధ్రప్రదేశ్‌ను పారిశ్రామికంగా అగ్రపథంలో నిలిపేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు అంతర్జాతీయ వేదికపై సత్ఫలితాలను ఇస్తున్నాయి. స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరుగుతున్న వరల్డ్ ఎకనామిక్ ఫోరం 2026 సదస్సులో భాగంగా ఏపీకి మరో భారీ పెట్టుబడి ఖరారైంది. ప్రముఖ మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ ఆర్ఎంజెడ్ గ్రూప్ రాష్ట్రంలో సుమారు రూ.లక్ష కోట్లు ($10 బిలియన్లు) పెట్టుబడిగా పెట్టేందుకు ముందుకు వచ్చింది. రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ మరియు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌తో దావోస్‌లో జరిగిన భేటీలో ఆర్ఎంజెడ్ సంస్థ ప్రతినిధులు తమ భారీ పెట్టుబడి ప్రణాళికలను అధికారికంగా ప్రకటించారు. ఈ ఒప్పందంలో భాగంగా రాష్ట్రంలోని రెండు ప్రధాన ప్రాంతాల్లో మెగా ప్రాజెక్టులు రానున్నాయి. విశాఖపట్నం కాపులుప్పాడ ఐటీ పార్క్‌లో సుమారు 50 ఎకరాల్లో 10 మిలియన్ చదరపు అడుగుల విస్తీర్ణంలో భారీ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ పార్క్‌ను ఆర్ఎంజెడ్ అభివృద్ధి చేయనుంది. దీనితో పాటు విశాఖ ప్రాంతంలోనే 1 గిగావాట్ సామర్థ్యంతో హైపర్‌స్కేల్ డేటా సెంటర్ క్లస్టర్‌ను కూడా నిర్మించనున్నారు. మరోవైపు రాయలసీమలోని అనంతపురం జిల్లా టేకులోడు వద్ద సుమారు 1,000 ఎకరాల్లో భారీ పారిశ్రామిక మరియు లాజిస్టిక్స్ పార్క్‌ను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. ఇది వెనుకబడిన ప్రాంతాల్లో పారిశ్రామిక తయారీ మరియు గిడ్డంగుల రంగానికి కొత్త ఊపిరి పోయనుంది. ఈ మెగా పెట్టుబడి ద్వారా రాష్ట్రంలో సుమారు లక్ష మంది యువతకు ప్రత్యక్షంగా , పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ముఖ్యంగా ఐటీ, డేటా సెంటర్లు, మౌలిక సదుపాయాల రంగంలో నైపుణ్యం కలిగిన నిపుణులకు భారీగా అవకాశాలు లభిస్తాయి. ఐదేళ్ల కాలపరిమితిలో ఈ పెట్టుబడులను దశలవారీగా పట్టాలెక్కించనున్నట్లు సంస్థ ప్రతినిధులు వెల్లడించారు. రాష్ట్రంలో పారిశ్రామికంగా ఎదిగేందుకు ఉన్న సానుకూల వాతావరణం, ప్రభుత్వ ప్రోత్సాహకాలు మరియు మంత్రి లోకేష్ చూపిన చొరవపై ఆర్ఎంజెడ్ గ్రూప్ ఛైర్మన్ మనోజ్ మెండా హర్షం వ్యక్తం చేశారు. ఏపీలో ఉన్న 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్', సింగిల్ విండో అనుమతులు మరియు పారదర్శక విధానాలు తమకు నమ్మకాన్ని కలిగించాయని ఆర్ఎంజెడ్ ప్రతినిధులు పేర్కొన్నారు. త్వరలోనే ఈ ప్రాజెక్టులకు సంబంధించిన విధివిధానాలను ఖరారు చేసి పనులు ప్రారంభించనున్నట్లు తెలుస్తోంది. కేవలం ఐటీ రంగాన్నే కాకుండా, రాయలసీమ వంటి ప్రాంతాల్లో లాజిస్టిక్స్‌ను అభివృద్ధి చేయడంపై ప్రభుత్వం చూపిస్తున్న శ్రద్ధను అంతర్జాతీయ ఇన్వెస్టర్లు కొనియాడుతున్నారు.




# జోగి సోదరులకు బెయిల్ మంజూరు!

**విజయవాడ (ఏడీఎన్ఎన్) :**



గత కొంతకాలంగా రిమాండ్ ఖైదీలుగా ఉన్న మాజీ మంత్రి జోగి రమేశ్ , ఆయన సోదరుడు జోగి రాముకు న్యాయస్థానంలో కొంత మేర ఊరట లభించింది. భవానీపురం ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన కల్తీ మద్యం కేసులో విజయవాడ కోర్టు వీరికి మంగళవారం బెయిల్ మంజూరు చేసింది. మంగళవారం ఉదయం జోగి సోదరులను అధికారులు కోర్టులో హాజరుపరచగా, వారి బెయిల్ పిటిషన్‌పై సుదీర్ఘ విచారణ చేపట్టిన ధర్మాసనం సానుకూల నిర్ణయం తీసుకుంది. గతంలో పలుమార్లు బెయిల్ కోసం ప్రయత్నించినప్పటికీ చుక్కెదురైన జోగి సోదరులకు, ప్రస్తుత ఉత్తర్వులు కొంత ఉపశమనాన్ని కలిగించాయి. భవానీపురం కేసులో బెయిల్ వచ్చినప్పటికీ, జోగి రమేశ్ వెంటనే జైలు నుండి విడుదలయ్యే అవకాశం కనిపించడం లేదు. ఎందుకంటే ఆయన చిత్తూరు జిల్లా మొలకలచెరువుకు సంబంధించిన మరో కేసులో ఇంకా రిమాండ్ ఖైదీగానే కొనసాగుతున్నారు. ఈ కేసుకు సంబంధించిన బెయిల్ పిటిషన్ ప్రస్తుతం తంబళ్లపల్లి కోర్టులో విచారణ దశలో ఉంది. అక్కడ కూడా బెయిల్ మంజూరైతేనే ఆయన విజయవాడ జైలు నుండి బయటకు వచ్చే వీలుంటుంది. ప్రస్తుతం ఆయన సోదరుడు జోగి రాముకు మాత్రం ఈ కేసులో విముక్తి లభించినట్లయింది. జోగి రమేశ్ అరెస్ట్ , వరుస కేసులు ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో పెద్ద చర్చకు దారితీశాయి. ప్రభుత్వం కక్షపూరితంగానే తమపై అక్రమ కేసులు బనాయించిందని జోగి వర్గీయులు ఆరోపిస్తుండగా, చట్టం తన పని తాను చేసుకుపోతుందని కూటమి ప్రభుత్వం పేర్కొంటోంది. భవానీపురం కేసులో బెయిల్ లభించడంతో జోగి అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నప్పటికీ, తంబళ్లపల్లి కోర్టు తీర్పుపై ఇప్పుడు అందరి దృష్టి నెలకొంది. అక్కడి ఫలితాన్ని బట్టే ఆయన విడుదలపై స్పష్టత రానుంది.

# టీడీపీ అంటే 'తెలుగుదేశం డర్టీ పాలన'!

**విశాఖపట్నం (ఏడీఎన్ఎన్) :**

నడిరోడ్డుపై బట్టలు విప్పి అశ్లీల నృత్యాలు చేయించిన వారిపై కూటమి ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోలేదని వైసీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి నిలదీశారు. విశాఖలో మంగళవారం మీడియాతో మాట్లాడిన ఆమె,అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన వారిని నడిరోడ్డుపై ఎందుకు నడిపించలేదని అధికారులను ప్రశ్నించారు. రాష్ట్రంలో మహిళల రక్షణ కరువైందని, అరాచక శక్తులకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని ఆమె ధ్వజమెత్తారు. జగన్ పాలనలో మహిళల సంక్షేమమే ధ్యేయంగా సున్నా వడ్డీ రుణాలు సకాలంలో అందేవని, కానీ నేడు ఆ పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళా లోకంపై జరుగుతున్న ఈ దాడులు, మోసాలపై వైసీపీ రాజీలేని పోరాటం చేస్తుందని ఆమె స్పష్టం చేశారు.రాష్ట్రంలో అధికార టీడీపీజనసేనబీజేపీ కూటమి ప్రభుత్వం మహిళల గౌరవాన్ని నడిరోడ్డుపై వేలాడదీస్తోందని నిప్పులు చెరిగారు.టీడీపీ అంటే 'తెలుగుదేశం' కాదు.. అది 'తెలుగుదేశం డర్టీ పాలన' అని రాష్ట్ర ప్రజలకు అర్థమైపోయిందని ఎద్దేవా చేశారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన వెంటనే డ్వాక్రా మహిళలకు 'టోకరా' వేశారని వరుదు కళ్యాణి మండిపడ్డారు. పొదుపు సంఘాలను నిర్వీర్యం చేయడమే లక్ష్యంగా సుమారు రూ. 16,600 కోట్ల మేర బ్యాంకుల ద్వారా అందే రుణాలను తగ్గించేశారని ఆరోపించారు."మహిళలకు రూ. 10 లక్షల వరకు సున్నా వడ్డీ రుణాలు ఇస్తామని ఎన్నికల ముందు ఆకాశమే హద్దుగా హామీలు గుప్పించి, ఇప్పుడు మోసం చేశారు. సున్నా వడ్డీ కింద ఇవ్వాల్సిన రూ. 7,000 కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలి," అని డిమాండ్ చేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకున్నారని, కానీ నేడు నాబార్డ్ నివేదికలే బాబు మోసాన్ని బట్టబయలు చేస్తున్నాయని దుయ్యబట్టారు. తెలుగు వారి పండుగ సంక్రాంతి సంస్కృతిని కూటమి నేతలు మంటగలిపారని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలు సిగ్గుతో తలదించుకునేలా రాష్ట్రవ్యాప్తంగా అశ్లీల నృత్యాలు, అర్ధనగ్న ప్రదర్శనలు నిర్వహించారని ఆరోపించారు. "మహిళా హోం మంత్రి ఉన్న రాష్ట్రంలోనే విచ్చలవిడిగా రికార్డింగ్ డ్యాన్సులు, క్యాసినోలు, పేకాట శిబిరాలు ఏర్పాటు చేశారు. వీటికి సాక్షాత్తు పోలీసులే కాపలాగా ఉండటం సిగ్గుచేటు," అని నిప్పులు చెరిగారు.



# అనకాపల్లిలో కూటమి పార్టీల మధ్య రచ్చ

## రణరంగంగా మారిన గ్రామసభ..

**అనకాపల్లి (ఏడీఎన్ఎన్) :**



అనకాపల్లి జిల్లా బుచ్చయ్యపేట మండలంలో అధికార కూటమి పార్టీలైన తెలుగుదేశం మరియు జనసేన వర్గాల మధ్య తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. ప్రభుత్వ స్థలంలో చెట్ల నరికివేతపై మొదలైన వివాదం కాస్తా, పరస్పర దాడులకు దారితీసింది. ఎమ్మార్వో సమక్షంలోనే ఇరు వర్గాలు కర్రలు, రాళ్లతో దాడులు చేసుకోవడంతో పెదమదిన గ్రామం రణరంగంగా మారింది. పెదమదిన గ్రామంలోని ప్రభుత్వ స్థలంలో ఉన్న చెట్లను టీడీపీ వర్గీయులు నరికివేయడంతో గొడవ మొదలైంది. ప్రభుత్వ ఆస్తిని ఎలా ధ్వంసం చేస్తారని జనసేన కార్యకర్తలు దీనిని అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఇరు వర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. ఈ సమస్యను పరిష్కరించేందుకు బుచ్చయ్యపేట ఎమ్మార్వో నేతృత్వంలో అధికారులు మంగళవారం గ్రామసభను ఏర్పాటు చేశారు. గ్రామసభ జరుగుతుండగానే ఇరు వర్గాల మధ్య మాటామాటా పెరిగింది. ఆగ్రహంతో ఊగిపోయిన కార్యకర్తలు ఒక్కసారిగా కర్రలు,రాళ్లతో పరస్పరం దాడులకు దిగారు. అధికారుల ముందే ఒకరిపై ఒకరు భౌతిక దాడులు చేసుకోవడంతో సభలో గందరగోళం నెలకొంది.ఈ దాడిలో ఇరు పార్టీలకు చెందిన పలువురు కార్యకర్తల తలలు పగిలాయి.గాయపడిన వారిని వెంటనే చికిత్స నిమిత్తం స్థానిక ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి అదుపు తప్పుతుండటంతో పోలీసులు భారీగా రంగంలోకి దిగారు. లాఠీచార్జ్ చేసి రెండు వర్గాలను అక్కడి నుంచి చెల్లాచెదురు చేశారు. ప్రస్తుతం గ్రామంలో అదనపు బలగాలను మోహరించి పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. కూటమి అధికారంలో ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయిలో ఆధిపత్యం కోసం రెండు పార్టీల నేతలు ఇలా వీధికెక్కి కొట్టుకోవడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.



# విద్యుత్ ఎంప్లాయిస్ డైరీని ఆవిష్కరించిన వైఎస్ జగన్

**తాడేపల్లి (ఏడీఎన్ఎన్) :**

వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో వైఎస్సార్ విద్యుత్ ఎంప్లాయిస్ యూనియన్‌కు సంబంధించిన 2026 నూతన సంవత్సర క్యాలెండర్ , డైరీలను మంగళవారం అధికారికంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు వైఎస్ జగన్‌కు ఘనస్వాగతం పలికి, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. క్యాలెండర్ ఆవిష్కరణ తర్వాత విద్యుత్ ఉద్యోగుల సమస్యలు, వారి సంక్షేమంపై యూనియన్ ప్రతినిధులతో మాజీ సీఎం కొద్దిసేపు ముచ్చటించారు. విద్యుత్ రంగ బలోపేతంలో ఉద్యోగుల పాత్ర కీలకమని ఆయన కొనియాడారు. ఉద్యోగుల పక్షాన తమ పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని, వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని ఈ సందర్భంగా ఆయన భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కారుమూరి నాగేశ్వరరావు, రాష్ట్ర అధ్యక్షుడు జి.మహేశ్వర్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లికార్జున, చీఫ్ వర్కింగ్ ప్రెసిడెంట్ డిపి.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు. వీరితో పాటు ఏపీఎస్పీడీసీఎల్ అధ్యక్షుడు ఎన్వి. సుధాకర్ రెడ్డి, కార్యదర్శులు చంద్రశేఖర్, సోమశేఖర్ రెడ్డి కూడా హాజరయ్యారు. అంతేకాకుండా ఏపీఈపీడీసీఎల్ అధ్యక్ష, కార్యదర్శులు ఏవి.సత్యనారాయణ, లక్ష్మీరావుతో పాటు ఇతర యూనియన్ ప్రతినిధులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని జగన్‌తో ఫోటోలు దిగారు. పార్టీ కార్యాలయం వద్ద జగన్‌ను చూసేందుకు కార్యకర్తలు, యూనియన్ సభ్యులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో సందడి నెలకొంది.

# ఆర్టీసీ రికార్డుల 'జాతర'

**విజయవాడ (ఏడీఎన్ఎన్) :**



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ సరికొత్త చరిత్రను లిఖించింది. సంక్రాంతి పండుగ రద్దీని అదుపు చేస్తూనే, సంస్థ చరిత్రలోనే కనివినీ ఎరుగని రీతిలో రికార్డు స్థాయి ఆదాయాన్ని ఆర్జించింది. సోమవారం తిరుగు ప్రయాణ ప్రయాణికుల రద్దీ కారణంగా ఆర్టీసీకి ఒక్కరోజే ఏకంగా రూ. 27.68 కోట్ల ఆదాయం లభించినట్లు అధికారులు వెల్లడించారు. ఒకే రోజు ఇంతటి భారీ ఆదాయం రావడం ఆర్టీసీ ప్రస్థానంలో ఇదే మొదటిసారి కావడం గమనార్హం. సంక్రాంతి పండుగ ముగించుకుని తమ కార్యస్థానాలకు వెళ్లే ప్రయాణికుల కోసం ఆర్టీసీ పక్కా ప్రణాళికతో వ్యవహరించింది. సోమవరం ఒక్కరోజే సుమారు 50.6 లక్షల మంది ప్రయాణికులను సురక్షితంగా వారి గమ్యస్థానాలకు చేర్చారు. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వేలాది ప్రత్యేక బస్సులను నడపడం ద్వారా ఈ ఘనత సాధ్యమైంది. బస్సులన్నీ దాదాపు 100 శాతం ఆక్యుపెన్సీతో నడవడంతో ఆదాయం సంస్థ అంచనాలను మించిపోయింది. ఈ రికార్డు స్థాయి విజయంపై ఏపీఎస్ఆర్టీసీ ఎండీ తిరుమలరావు హర్షం వ్యక్తం చేస్తూ సంస్థ గమనాన్ని మార్చిన ఈ విజయం వెనుక క్షేత్రస్థాయి సిబ్బంది కష్టం ఉందని కొనియాడారు. డ్రైవర్లు, కండక్టర్లు, గ్యారేజీ సిబ్బంది మరియు సూపర్ వైజర్లు అద్భుతమైన సమన్వయంతో పని చేయడం వల్లే ప్రయాణికులను సురక్షితంగా చేర్చగలిగామని ఆయన పేర్కొన్నారు. రికార్డు స్థాయి ఆదాయాన్ని అందించిన ప్రతి ఒక్కరికీ ఎండీ తన ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. సాధారణంగా పండుగ సమయాల్లో ప్రైవేటు వాహనాలు ఛార్జీలను పెంచి దోచుకుంటున్న తరుణంలో, ఆర్టీసీ భరోసాగా నిలవడమే ఈ భారీ ఆదాయానికి కారణమని విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రయాణికుల నమ్మకాన్ని పెట్టుబడిగా మలచుకున్న ఆర్టీసీ, ఈ ఏడాది సంక్రాంతి సీజన్‌లో కేవలం కాసుల పంట పండించడమే కాకుండా ప్రజలకు సంస్థపై ఉన్న గౌరవాన్ని మరింత పెంచుకుంది.




# విశాఖ ఉత్సవ్ సంబరాలకు వేళాయె..!

**విశాఖపట్నం (ఏడీఎన్ఎన్) :**

ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగానికి మకుటాయమానంగా నిలిచే 'విశాఖ ఉత్సవ్'ను ఈ ఏడాది అత్యంత వైభవంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. 'సాగరం నుంచి శిఖరం వరకు' అనే ఆకర్షణీయమైన థీమ్‌తో ఈ నెల 24 నుంచి ఫిబ్రవరి 1 వరకు ఉత్సవాలను నిర్వహించనున్నారు. విశాఖపట్నం కేంద్రంగా సాగే ఈ వేడుకలు కేవలం నగరానికే పరిమితం కాకుండా అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల వ్యాప్తంగా విస్తరించనున్నాయి. విశాఖలో జరిగిన ఉత్సవ్ కర్టెన్ రైజర్ కార్యక్రమంలో మంత్రులు కందుల దుర్గేష్, వంగలపూడి అనిత, సంధ్యారాణి, డోలా బాలవీరాంజనేయ స్వామి కొల్లు రవీంద్ర పాల్గొని ఉత్సవాల పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. ఈ ఉత్సవాల కోసం మూడు జిల్లాల్లో మొత్తం 20 వేదికలను సిద్ధం చేశారు. వీటిలో సుమారు 500కు పైగా సాంస్కృతిక ప్రదర్శనలు పర్యాటకులను అలరించనున్నాయి. శాస్త్రీయ నృత్యాలు, అరకు థింసా, అనకాపల్లి జానపద కళలు ఈసారి ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. విశాఖ నగరంలోని ఆర్కే బీచ్‌తో పాటు సాగర్‌నగర్, రుషికొండ, మంగమారిపేట, భీమిలీ బీచ్‌లలో జనవరి 24 నుంచి 27 వరకు ప్రతిరోజూ సాయంత్రం 6 నుంచి రాత్రి 10 గంటల వరకు వివిధ కార్యక్రమాలు కొనసాగుతాయి. అనకాపల్లి జిల్లాలో ఈ నెల 25, 26 తేదీల్లో వేడుకలు జరగనుండగా, అరకులో జనవరి 30 నుంచి ఫిబ్రవరి 1 వరకు గిరిజన సంస్కృతి ప్రతిబింబించేలా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. పర్యాటకులను ఆకట్టుకునేలా ఈసారి వినూత్న కార్యక్రమాలను జోడించారు. డ్రోన్ షో, బీచ్ గేమ్స్, అడ్వెంచర్ స్పోర్ట్స్, బోటు రేసింగ్, కయాకింగ్, పారామోటరింగ్ వంటి సాహస క్రీడలు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. వీటితో పాటు ఫ్లవర్ షో, మిస్ అండ్ మిస్టర్ వైజాగ్ పోటీలు, టెంపుల్ రెప్లికా, వంటల పోటీలు ,టాలీవుడ్ నటుల ప్రదర్శనలు సందడి చేయనున్నాయి. అరకు, అనంతగిరి ప్రాంతాల్లో ట్రెకింగ్, హాట్ ఎయిర్ బెలూన్ రైడ్స్ వంటివి పర్యాటకులకు సరికొత్త అనుభూతిని అందించనున్నాయి. ఫుడ్ కోర్టులు, షాపింగ్ స్టాళ్లు , ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ బజార్లు స్థానిక ఉత్పత్తులకు వేదికగా మారనున్నాయి. విశాఖ ఉత్సవ్‌ను కేవలం వినోదానికే కాకుండా ఆర్థికాభివృద్ధికి చిహ్నంగా ప్రభుత్వం భావిస్తోంది. ఈ ఉత్సవాల ద్వారా సుమారు రూ. 500 కోట్ల ఆర్థికాభివృద్ధిని సాధించడంతో పాటు, దాదాపు 3,000 మందికి ఉపాధి కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు మంత్రులు వెల్లడించారు. విశాఖలో ఘనంగా ప్రారంభమయ్యే ఈ సంబరాలు అనకాపల్లిలో జరిగే ముగింపు వేడుకలతో ముగియనున్నాయి. ఉత్తరాంధ్ర పర్యాటక వైభవాన్ని ప్రపంచానికి చాటిచెప్పేలా ఈ ఉత్సవాలను విజయవంతం చేయాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది.

# 'భారత్ ఫ్యూచర్ సిటీ' లో యూఏఈ పెట్టుబడులు

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్):**

ప్రపంచ ఆర్థిక వేదిక 2026 వార్షిక సదస్సులో పాల్గొంటున్న తెలంగాణ ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం తొలిరోజే పారిశ్రామిక, సాంకేతిక రంగాలలో కీలక అడుగులు వేసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని బృందం వివిధ దేశాల ప్రతినిధులు, గ్లోబల్ టెక్ దిగ్గజాలతో వరుస సమావేశాలు నిర్వహించింది. రాష్ట్రాన్ని అంతర్జాతీయ పెట్టుబడుల గమ్యస్థానంగా మార్చే లక్ష్యంతో ప్రభుత్వం రూపొందించిన 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్‌ను ఈ సందర్భంగా ప్రపంచ వేదికపై ఆవిష్కరించింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న 'భారత్ ఫ్యూచర్ సిటీ' ప్రాజెక్టులో భాగస్వామ్యం పంచుకోవడానికి యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ సంసిద్ధత వ్యక్తం చేసింది. యూఏఈ ఆర్థిక మంత్రి అబ్దుల్లా బిన్ తౌక్ అల్ మర్రితో సీఎం రేవంత్ రెడ్డి భేటీ అయ్యారు. ఈ ప్రాజెక్టు అమలును పర్యవేక్షించేందుకు, మౌలిక సదుపాయాల కల్పనలో సమన్వయం కోసం ఇరు ప్రభుత్వాల ఉన్నతాధికారులతో కూడిన 'సంయుక్త టాస్క్ ఫోర్స్' ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ప్రపంచ టెక్ దిగ్గజం గూగుల్ సంస్థ తెలంగాణలో వివిధ సామాజిక, సాంకేతిక సమస్యల పరిష్కారానికి సహకరించేందుకు ముందుకొచ్చింది. గూగుల్ ఆసియా పసిఫిక్ ప్రెసిడెంట్ సంజయ్ గుప్తాతో మంగళవారం జరిగిన సమావేశంలో ట్రాఫిక్ నియంత్రణ, సైబర్ సెక్యూరిటీ, అగ్రిటెక్, స్టార్టప్ ఇన్నోవేషన్ , వాతావరణ మార్పుల అంశాలపై చర్చించారు. కోర్ హైదరాబాద్ సిటీని కాలుష్య రహితంగా తీర్చిదిద్దేందుకు గూగుల్ సాంకేతికతను ఉపయోగించుకోవాలని ఈ సందర్భంగా ప్రాథమిక అవగాహనకు వచ్చారు. తెలంగాణకు చెందిన స్టార్టప్‌లను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లేందుకు ఇజ్రాయెల్ ఇన్నోవేషన్ అథారిటీ సహకారం అందించనుంది. ఆ సంస్థ ఛైర్మన్ అలోన్ స్టోపెల్‌తో సీఎం బృందం భేటీ అయింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ , డీప్‌టెక్, హెల్త్ టెక్ మ,ఏరో స్పేస్ రంగాల్లో పనిచేస్తున్న తెలంగాణ స్టార్టప్‌లకు సాంకేతిక మద్దతు, భాగస్వామ్యాన్ని అందించేందుకు ఇజ్రాయెల్ ప్రతినిధులు అంగీకరించారు. ఈ సమావేశాల్లో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి కూడా పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న క్యూర్, ప్యూర్, రేర్ అభివృద్ధి నమూనాను, అలాగే యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ద్వారా చేపడుతున్న నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను అంతర్జాతీయ ప్రతినిధులకు వివరించారు. ఈ పర్యటన ద్వారా రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు తరలివస్తాయని ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేస్తోంది.



# ప్రాణ రక్షణకు హెల్మెట్ తప్పనిసరి

**కామారెడ్డి (ఏడీఎన్ఎన్):**

రోడ్డు భద్రత అనేది కేవలం పోలీసుల బాధ్యత మాత్రమే కాదని, అది ప్రతి పౌరుడి కనీస బాధ్యత అని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. కామారెడ్డిలో 'అరీవ్, అలీవ్' కార్యక్రమంలో భాగంగా ఆమె హెల్మెట్ నమూనాను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ద్విచక్ర వాహనదారులు ప్రయాణించేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, అది కేవలం నియమం మాత్రమే కాదు, ప్రాణ రక్షణ కవచమని స్పష్టం చేశారు. రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం ఈ వినూత్న కార్యక్రమాన్ని చేపట్టిందని మంత్రి వెల్లడించారు. ముఖ్యంగా యువత నిర్లక్ష్యం వల్ల ప్రాణాలు కోల్పోవడం బాధాకరమని, ప్రతి ఒక్కరూ హెల్మెట్‌ను నిత్యం వినియోగించేలా అవగాహన పెంచడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని ఆమె పేర్కొన్నారు. ప్రమాదాల వల్ల కుటుంబాలు వీధిన పడకుండా ఉండాలంటే భద్రతా నియమాలు పాటించాలని కోరారు. ప్రభుత్వం ఇప్పటికే రవాణా , పోలీసు శాఖల ద్వారా అనేక భద్రతా చర్యలు చేపడుతోందని, ప్రజల భాగస్వామ్యం ఉంటేనే ఇవి విజయవంతం అవుతాయని సీతక్క తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్ గౌడ్, జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర , రవాణా శాఖ అధికారులు పాల్గొన్నారు. అధికారులతో కలిసి మంత్రి రోడ్డు భద్రతా ప్రతిజ్ఞను చేయించారు.



- కామారెడ్డిలో 'అరీవ్, అలీవ్' కార్యక్రమంలో హెల్మెట్ నమూనా ఆవిష్కరణ
- యువత మేల్కోవాలని మంత్రి సీతక్క పిలుపు

# దివ్యాంగులకు మంత్రి ఉత్తమ్ భరోసా

- 109 మంది దివ్యాంగులకు రూ.1.09 కోట్ల విలువైన పరికరాల పంపిణీ
- హుజూర్ నగర్ అభివృద్ధికి పెద్దపీట
- రూ.1.36 కోట్ల వడ్డీ లేని రుణాల చెక్కులు అందజేత
- ముఖ్యమంత్రి సహాయ నిధి కింద ఇప్పటి వరకు రూ.21 కోట్ల సాయం
- జనవరి 23న గవర్నర్ చేతుల మీదుగా వ్యవసాయ కళాశాల శంకుస్థాపన

**హుజూర్ నగర్ (ఏడీఎన్ఎన్):**

రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమానికి ,మహిళా సాధికారతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్ మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు . ఈ సందర్భంగా లబ్ధిదారులకు వివిధ సంక్షేమ ఫలాలను అందజేశారు. సూర్యాపేట జిల్లాలోని 109 మంది దివ్యాంగులకు రూ.1.09 కోట్ల వ్యయంతో కూడిన ట్రై సైకిల్స్, మోటరైజ్డ్ స్కూటీలు, ల్యాప్‌టాప్‌లను మంత్రి పంపిణీ చేశారు. అర్హులైన దివ్యాంగులందరికీ మరిన్ని పరికరాలు అవసరమైతే అందించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన హామీ ఇచ్చారు. అలాగే మహిళా సంక్షేమంలో భాగంగా హుజూర్ నగర్ మున్సిపాలిటీలోని 365 స్వయం సహాయక సంఘాలకు రూ.1.36 కోట్ల వడ్డీ లేని రుణాల చెక్కులను అందజేశారు. హుజూర్ నగర్ నియోజకవర్గంలో ఇప్పటి వరకు మహిళా సంఘాలకు బ్యాంక్ లింకేజీ, స్త్రీ నిధి, స్వయం ఉపాధి కింద కోట్లాది రూపాయల రుణాలు మంజూరు చేసినట్లు మంత్రి వెల్లడించారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా అత్యవసర వైద్య సాయం పొందిన 461 మంది లబ్ధిదారులకు రూ.1.92 కోట్ల విలువైన చెక్కులను మంత్రి ఉత్తమ్ పంపిణీ చేశారు. నియోజకవర్గంలో ఇప్పటి వరకు రూ.21 కోట్ల మేర సీఎంఆర్‌ఎఫ్ సాయం అందించామని పేర్కొన్నారు. హుజూర్ నగర్‌లో రూ.123 కోట్లతో మంజూరైన వ్యవసాయ కళాశాలకు ఈనెల 23న రాష్ట్ర గవర్నర్ చేతుల మీదుగా శంకుస్థాపన చేయనున్నట్లు మంత్రి ప్రకటించారు. అలాగే ఆసుపత్రిలో సిటీ స్కాన్, డయాలసిస్ బ్లడ్ బ్యాంక్ వంటి వసతులను ఏర్పాటు చేశామన్నారు. రామస్వామి గుట్ట వద్ద నిర్మించిన 2160 సింగిల్ బెడ్ రూమ్ ఇళ్లను నిరుపేదలకు కేటాయిస్తామని, ఇళ్లు లేని వారు రెండు రోజుల్లో దరఖాస్తు చేసుకోవాలని మంత్రి సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా 3.17 కోట్ల మందికి ఒక్కొక్కరికి 6 కేజీల చొప్పున సన్నబియ్యాన్ని పంపిణీ చేస్తున్నామని, దీనికోసం ప్రభుత్వం రూ.13,500 కోట్లు ఖర్చు చేస్తోందని తెలిపారు. ఆర్టీసీలో ఉచిత ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ మరియు జాబ్ మేళా ద్వారా 4500 మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పించడం తమ ప్రభుత్వ విజయాలని ఆయన వివరించారు.



# సిట్ విచారణ పారదర్శకంగా జరగాలి

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్):**

ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ మంత్రి హరీశ్ రావు సిట్ విచారణకు హాజరుకావడంపై బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. నగరంలో మంగళవారం జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, ఈ విచారణపై మాట్లాడుతూ , చట్టం ముందు అందరూ సమానులేనని గుర్తు చేశారు. చట్టంతో ఎవరు చెలగాటమాడినా, చివరికి ఇదే గతి పడుతుందనే విశ్వాసం ప్రజలకు కలగాలని ఆయన వ్యాఖ్యానించారు. ఫోన్ ట్యాపింగ్ అనేది ప్రజాస్వామ్య వ్యవస్థకే గొడ్డలిపెట్టు అని, గత ప్రభుత్వ హయాంలో ఈ అక్రమాలకు పాల్పడిన అసలు సూత్రధారులు ఎవరో తేలాలని ఈటల డిమాండ్ చేశారు. విచారణ జరపడం తప్పు కాదని, అయితే అది రాజకీయ ఒత్తిడి లేకుండా అత్యంత నిజాయితీగా, పారదర్శకంగా జరగాలని కోరారు. ముఖ్యంగా తన భార్య, కుటుంబ సభ్యులు, సహాయకుల ఫోన్లను సైతం ట్యాప్ చేశారని, హుజూరాబాద్ ఉప ఎన్నిక సమయంలో తన ప్రతి కదలికపై నిఘా ఉంచారని ఈటల గతంలోనే ఆరోపించిన సంగతి తెలిసిందే. మరోవైపు, హరీశ్ రావు విచారణ నేపథ్యంలో జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ వద్ద ఉద్రిక్తత నెలకొంది. లోనికి న్యాయవాదులను అనుమతించకపోవడాన్ని తప్పుబడుతూ బీఆర్ఎస్ శ్రేణులు ఆందోళనకు దిగారు. ప్రభుత్వం కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే ఈ నోటీసులు ఇచ్చిందని వారు ఆరోపిస్తున్నారు. అయితే, ఈ వ్యవహారంలో దోషులు ఎంతటి వారైనా కఠినంగా శిక్షించాలని ఈటల రాజేందర్ స్పష్టం చేశారు.



# సినిమా టికెట్ ధరల పెంపుపై హైకోర్టు ఆగ్రహం

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్):**

తెలంగాణలో సినిమా టికెట్ ధరల ఇష్టారాజ్య పెంపుదలపై రాష్ట్ర హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. భవిష్యత్తులో ఏ సినిమాకైనా టికెట్ ధరలు పెంచాలనుకుంటే, ఆ నిర్ణయాన్ని సినిమా విడుదలకు కనీసం 90 రోజుల ముందే అధికారికంగా ప్రకటించాలని న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. మెగాస్టార్ చిరంజీవి నటించిన 'మన శంకరవరప్రసాద్ గారు' సినిమా టికెట్ ధరల పెంపును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై విచారణ చేపట్టిన జస్టిస్ ఎన్వీ శ్రవణ్ కుమార్ ధర్మాసనం ఈ కీలక తీర్పునిచ్చింది. గతంలో టికెట్ ధరల పెంపుపై కోర్టు ఇచ్చిన స్పష్టమైన ఆదేశాలను బేఖాతరు చేస్తూ, 'మన శంకరవరప్రసాద్ గారు' చిత్రానికి రేట్లు పెంచుకునేలా మెమో జారీ చేయడంపై హైకోర్టు సీరియస్ అయ్యింది. ఈ వ్యవహారంలో హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సీవీ ఆనంద్‌కు కోర్టు ధిక్కరణ నోటీసులు జారీ చేసింది. ప్రభుత్వం కోర్టును తప్పుదోవ పట్టిస్తోందని, ధరల పెంపు వివరాలను దాచిపెట్టిందని పిటిషనర్ తరపు న్యాయవాది విజయ్ గోపాల్ వినిపించిన వాదనలతో ఏకీభవించిన న్యాయస్థానం, అధికారుల తీరును తీవ్రంగా తప్పుబట్టింది. కేవలం మెమోల ద్వారా సినిమా బడ్జెట్ వివరాలను ధృవీకరించకుండా ధరలు పెంచడం చట్టవిరుద్ధమని కోర్టు పేర్కొంది. ఇకపై ధరల నిర్ణయం ఏదైనా తెలంగాణ సినిమాస్ రెగ్యులేషన్ యాక్ట్ 1955, గతంలో జారీ చేసిన జీవో 120 నిబంధనలకు లోబడే ఉండాలని స్పష్టం చేసింది. సినిమా విడుదలకు కొద్ది గంటల ముందు జీవోలు జారీ చేయడం వల్ల సామాన్య ప్రేక్షకులు న్యాయపోరాటం చేసే అవకాశం కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేసింది. అందుకే ఇకపై 3 నెలల ముందే ధరల పెంపుపై స్పష్టత ఉండాలని ఆదేశించింది. ఈ నిర్ణయం ప్రేక్షకులకు పెద్ద ఊరటనివ్వగా, సినీ పరిశ్రమలో కొత్త చర్చకు దారితీసింది.



- ఇకపై 90 రోజుల ముందే ప్రకటించాలని ఆదేశాలు
- హోంశాఖ అధికారులపై హైకోర్టు మండిపాటు

# మేడారం భక్తులకు శుభవార్త

### జాతర కోసం 4,000 ప్రత్యేక బస్సులు
### 51 పాయింట్ల నుంచి సేవలందిస్తున్న ఆర్టీసీ

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్):**

ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతరగా పేరొందిన మేడారం సమ్మక్కసారలమ్మ మహా జాతర సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా రవాణా శాఖ భారీ ఏర్పాట్లు చేస్తోంది. ఈ నెల 28 నుంచి ప్రారంభం కానున్న జాతర కోసం రాష్ట్రవ్యాప్తంగా 4,000 ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. మీడియాతో మంగళవారం నిర్వహించిన చిట్‌చాట్‌లో ఆయన జాతర ఏర్పాట్లపై స్పష్టత ఇచ్చారు. మహాలక్ష్మి పథకం కింద మేడారం జాతరకు వెళ్లే మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం ఉంటుందని మంత్రి స్పష్టం చేశారు. దీనిపై ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దని, జాతరకు వచ్చే మహిళా భక్తులందరికీ ఈ సౌకర్యం యథావిధిగా వర్తిస్తుందని తెలిపారు. రవాణా శాఖ నుంచి సుమారు 10 వేల మంది సిబ్బంది జాతర విధుల్లో నిమగ్నమై ఉన్నారని, జనవరి 28 నుంచి ఫిబ్రవరి 1వ తేదీ వరకు ప్రత్యేక బస్సులు నిరంతరాయంగా అందుబాటులో ఉంటాయని వివరించారు.





## ప్రభుత్వంపై ప్రతిపక్ష నేతల
# విమర్శనాస్త్రాలు

### ప్రజా క్షేత్రంలోనే తేల్చుకుంటామన్న బీఆర్ఎస్

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్):**

తెలంగాణలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ మంత్రి హరీశ్ రావుకు సిట్ నోటీసులు ఇవ్వడంపై బీఆర్ఎస్ పార్టీ తీవ్రంగా స్పందించింది. రాబోయే మున్సిపల్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని, ప్రభుత్వ వైఫల్యాల నుండి ప్రజల దృష్టిని మళ్లించేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం ఈ కుట్రకు తెరలేపిందని ఆ పార్టీ నేతలు ఆరోపించారు. మంగళవారం విచారణకు హాజరైన హరీశ్ రావుకు సంఘీభావంగా బీఆర్ఎస్ శ్రేణులు భారీగా తరలివచ్చారు. ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో విఫలమైన ప్రభుత్వం, ప్రజలకు సమాధానం చెప్పలేక ఇలాంటి ఆరోపణలతో కాలం వెళ్లదీస్తోందని మాజీ మంత్రి మహమూద్ అలీ మండిపడ్డారు.ఈ కేసులో ఎలాంటి ఆధారాలు లేవని, ఇది పూర్తిగా అక్రమమైన కేసు అని విమర్శించారు. విపక్ష నేతల గొంతు నొక్కడమే లక్ష్యంగా ప్రభుత్వం తన సమయాన్ని వృథా చేస్తోందని ఎమ్మెల్యే కేపీ వివేకానంద గౌడ్ ధ్వజమెత్తారు. ఈ కేసులో హరీశ్ రావుకు ఎలాంటి సంబంధం లేదని గతంలోనే అత్యున్నత న్యాయస్థానాలు స్పష్టం చేశాయని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి గుర్తు చేశారు. రాష్ట్రంలో వెలుగు చూసిన 'బొగ్గు కుంభకోణం' వంటి భారీ స్కామ్‌లను హరీశ్ రావు బయటపెట్టడంతో ప్రభుత్వం ఉక్కిరిబిక్కిరి అవుతోందని, అందుకే ఈ పాత కేసును మళ్ళీ తెరపైకి తెచ్చారని ఆయన ఎద్దేవా చేశారు. అసెంబ్లీలో ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తున్న హరీశ్ రావుకు రేవంత్ రెడ్డి ఇస్తున్న 'రిటర్న్ గిఫ్ట్' ఈ పోలీస్ నోటీసులేనని ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ కుమార్ విమర్శించారు. రెండేళ్లుగా ప్రజలను మోసం చేస్తున్న ఈ ప్రభుత్వం, న్యాయస్థానాల తీర్పులను కూడా లెక్కచేయకుండా వేధింపులకు పాల్పడుతోందని ఆయన మండిపడ్డారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా ప్రజల పక్షాన పోరాటం ఆగదని బీఆర్ఎస్ నేతలు స్పష్టం చేశారు.



## మున్సిపల్ ఎన్నికల
# కసరత్తు వేగవంతం

### కలెక్టర్లకు ఎస్ఈసీ దిశానిర్దేశం

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్):**

తెలంగాణలో త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల నిర్వహణ దిశగా రాష్ట్ర ఎన్నికల కమిషన్ అడుగులు వేగవంతం చేసింది. ఎన్నికల ఏర్పాట్లు, ఓటరు జాబితాల రూపకల్పన, వార్డుల వారీగా పోలింగ్ కేంద్రాల గుర్తింపు వంటి కీలక అంశాలపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని సమీక్షలు ప్రారంభించారు. ఇందులో భాగంగా వివిధ జిల్లాల కలెక్టర్లతో ఆమె వరుసగా మూడు రోజుల పాటు వీడియో కాన్ఫరెన్స్ లు నిర్వహించనున్నారు. సమీక్షల్లో భాగంగా ఉమ్మడి ఆదిలాబాద్ , కరీంనగర్ జిల్లాల కలెక్టర్లతో రాణి కుముదిని మంగళవారం సమావేశమయ్యారు. ఆయా మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో ఎన్నికల సన్నద్ధతను ఆమె క్షుణ్ణంగా పరిశీలించారు. ఓటరు జాబితాలో సవరణలు, పోలింగ్ కేంద్రాల వద్ద మౌలిక సదుపాయాలపై కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు. ఉమ్మడి నిజామాబాద్, ఖమ్మం, వరంగల్ జిల్లాల కలెక్టర్లతో ఎస్ఈసీ బుధవారం సమావేశం కానున్నారు. ఉమ్మడి నల్గొండ మహబూబ్‌నగర్ జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ గురువారం నిర్వహించనున్నారు. ఈ సమావేశాల్లో ప్రధానంగా ఎన్నికల కోడ్ అమలు, పోలింగ్ సిబ్బంది నియామకం, శాంతిభద్రతల పరిరక్షణ వంటి అంశాలపై కమిషనర్ చర్చిస్తున్నారు. క్షేత్రస్థాయిలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా, పకడ్బందీగా ఎన్నికలను నిర్వహించేందుకు వీలుగా పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్లాలని ఆమె కలెక్టర్లకు 'పర్ఫెక్ట్ గైడ్ లైన్స్' ఇస్తున్నారు. ఎస్ఈసీ వేగం చూస్తుంటే, అతి త్వరలోనే మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉందని రాజకీయ వర్గాల్లో చర్చ మొదలైంది.



పర్యాటకాన్ని పునరుద్ధరిస్తామన్న హైడ్రా కమిషనర్

## దుర్గం చెరువు బాధ్యత
# ఇక హైడ్రాదే

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్):**

నగరంలోని జలవనరులు, పర్యాటక కేంద్రమైన దుర్గం చెరువుపై హైడ్రా ప్రత్యేక దృష్టి సారించింది. గత కొంతకాలంగా ఈ చెరువు నిర్వహణలో శాఖల మధ్య సమన్వయ లోపం స్పష్టంగా కనిపిస్తున్న నేపథ్యంలో, ఇకపై దుర్గం చెరువు బాధ్యతను తామే తీసుకుంటామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ ప్రకటించారు. జీహెచ్ఎంసీ, జలమండలి, నీటిపారుదల శాఖ మరియు రహేజా ప్రతినిధులతో కలిసి క్షేత్రస్థాయిలో చెరువు పరిసరాలను మంగళవారం ఆయన పర్యవేక్షించారు. పరిశీలన తర్వాత రంగనాథ్ మాట్లాడుతూ, సమీప ప్రాంతాల నుంచి మురుగునీరు నేరుగా చెరువులోకి చేరడం వల్లే గుర్రపుడెక్క భారీగా పెరిగిందని గుర్తించారు. దీనివల్ల పర్యాటకం తీవ్రంగా దెబ్బతిన్నదని, చెరువులో పర్యాటక బోట్లు నిలిచిపోవడంతో సందర్శకులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. సంబంధిత అధికారులు ఈ విషయాన్ని పట్టించుకోకపోవడంతో దుర్గం చెరువు దుస్థితికి చేరిందని అసహనం వ్యక్తం చేశారు. శాఖల మధ్య ఉన్న సమన్వయ లోపాన్ని తొలగించి, తక్షణమే గుర్రపుడెక్కను తొలగించి చెరువును ప్రక్షాళన చేస్తామని కమిషనర్ స్పష్టం చేశారు. మురుగునీరు చెరువులోకి చేరకుండా శాశ్వత పరిష్కారం చూపిస్తామని, పర్యాటకులకు పాత వైభవాన్ని అందిస్తామని హామీ ఇచ్చారు. హైడ్రా రంగంలోకి దిగడంతో దుర్గం చెరువు త్వరలోనే పరిశుభ్రంగా మారుతుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



## దేశానికి తెలంగాణ
# పోరాటం దిక్సూచి

### కాంగ్రెస్-వామపక్షాల ఐక్యత అవసరమన్న డిప్యూటీ సీఎం

**ఖమ్మం (ఏడీఎన్ఎన్):**

దేశంలో ప్రస్తుతం నెలకొన్న రాజకీయ, సామాజిక పరిస్థితుల్లో రాజ్యాంగాన్ని రక్షించుకోవడానికి కాంగ్రెస్ , వామపక్ష పార్టీలు కలిసి సుదీర్ఘ రాజకీయ ప్రయాణం చేయాల్సిన అవసరం ఉందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. ఖమ్మంలో సీపీఐ శత వసంతాల ఉత్సవాల సందర్భంగా మంగళవారం ఏర్పాటు చేసిన జాతీయ సెమినార్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. మతం అనే సెంటిమెంటుతో ప్రజలను తప్పుదోవ పట్టించి, కార్పొరేట్ ,ఫాసిస్టు శక్తులు పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికే సవాల్ విసురుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ సాయుధ పోరాట విశిష్టతను భట్టి గుర్తుచేశారు. నిరంకుశ నిజాం పాలనకు వ్యతిరేకంగా కమ్యూనిస్టులు సాగించిన పోరాటం ప్రపంచానికే కొత్త సందేశాన్ని ఇచ్చిందని కొనియాడారు. భూమి కోసం, భుక్తి కోసం, పేదల విముక్తి కోసం సాగిన ఈ ఉద్యమాల్లో ఖమ్మం, నల్గొండ, వరంగల్ జిల్లాల పాత్ర అమోఘమని, ఏ ఇంటి తలుపు తట్టినా ఒక వీరగాథ వినిపిస్తుందని అన్నారు. 1950లో బూర్గుల రామకృష్ణారావు తెచ్చిన కౌలుదారి చట్టం నుండి, ఆ తర్వాతి కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన భూసంస్కరణలు, బ్యాంకుల జాతీయకరణ, ఉపాధి హామీ పథకం వంటి గొప్ప మార్పుల వెనుక వామపక్షాల సహకారం ఎంతో ఉందని ఆయన గుర్తు చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగ మార్పుల కోసం ప్రయత్నిస్తూ ఓటు హక్కును నిర్వీర్యం చేసే కుట్రలు చేస్తోందని భట్టి విమర్శించారు. భారతదేశం కేవలం వర్గాలపై కాకుండా కులాలపై నిర్మితమైందని, మారిన రాజకీయ పరిస్థితులకు అనుగుణంగా వామపక్షాలు ముందుకు సాగాలని సూచించారు. ఖమ్మం జిల్లా విభిన్న భావజాలాలకు, ఆతిథ్యానికి పెట్టింది పేరని, దేశవ్యాప్త వామపక్ష నేతలు ఇక్కడ సమావేశం కావడం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. స్వేచ్ఛా సమాజం కోసం, సగటు మనిషి హక్కుల కోసం ఐక్య పోరాటాల ద్వారా కార్పొరేట్ శక్తులకు అడ్డుకట్ట వేయాలని ఆయన పిలుపునిచ్చారు.



## యాదగిరిగుట్ట అభివృద్ధికి
# రూ. 100 కోట్లు

**యాదగిరిగుట్ట (ఏడీఎన్ఎన్):**

ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రమైన యాదగిరిగుట్టను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి, మున్సిపాలిటీ పరిధిలో రూ. 100 కోట్లతో అత్యాధునిక అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను త్వరలోనే చేపట్టనున్నట్లు రాష్ట్ర రోడ్లు, భవనాలు , సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వెల్లడించారు. యాదగిరిగుట్టలో మంగళవారం నిర్వహించిన 'ఇందిరా మహిళా శక్తి సంబరాల'లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యతో కలిసి స్వయం సహాయక సంఘాల సభ్యులకు రూ. 98.23 లక్షల వడ్డీ లేని రుణాల చెక్కులను, ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలన్నదే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆశయమని పేర్కొన్నారు. మహిళల ఆర్థిక స్వావలంబన కోసం వడ్డీ లేని రుణాలు, ఉచిత బస్సు ప్రయాణం, రూ. 500లకే గ్యాస్ సిలిండర్ వంటి పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు. యాదగిరిగుట్ట మున్సిపాలిటీలో కొత్తగా 16,152 రేషన్ కార్డులు మంజూరు చేశామని, పేదలందరికీ సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని చెప్పారు. నిరుపేదల సొంతింటి కలను నిజం చేసేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రాధాన్యత క్రమంలో అమలు చేస్తామన్నారు. పట్టణంలోని ప్రతి ఇంటికీ తాగునీరు అందించేందుకు రూ. 210 కోట్లతో పైప్‌లైన్ పనులు ముమ్మరంగా సాగుతున్నాయని, త్వరలోనే ప్రతి ఇంటికీ గోదావరి జలాలు అందుతాయని మంత్రి ధీమా వ్యక్తం చేశారు. గంధమల్ల రిజర్వాయర్ పూర్తయితే ఈ ప్రాంతంలో లక్ష ఎకరాలకు సాగునీరు అందుతుందని వివరించారు. ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య మాట్లాడుతూ.. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే ప్రజా ప్రభుత్వ ఉద్దేశమని, పుట్టింటి సారెగా ఇందిరమ్మ చీరలను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హనుమంతరావు, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు మహిళా సంఘాల సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఫోన్ ట్యాపింగ్
# దేశంలోనే అతిపెద్ద నేరం

### ఎంతటి వారున్నా శిక్ష తప్పదన్న టీపీసీసీ చీఫ్

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్):**



రాష్ట్రంలో సంచలనం సృష్టిస్తున్న ఫోన్ ట్యాపింగ్ కేసుపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. ఈ కేసులో ఎంతటి వారున్నా, ఎంతటి పెద్ద నేతలు ఉన్నా చట్టం ముందు సమానమేనని, దోషులు ఎవరైనా సరే శిక్ష తప్పదని ఆయన స్పష్టం చేశారు. ఆయన మీడియాతో మంగళవారం మాట్లాడుతూ సిట్ విచారణపై హరీశ్ రావు, కేటీఆర్ చేస్తున్న విమర్శలను తీవ్రంగా ఖండించారు. ఫోన్ ట్యాపింగ్ అనేది దేశంలోనే అత్యంత హేయమైన, అతి పెద్ద నేరమని మహేశ్ కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు. దేశంలోని టెలిగ్రాఫ్ చట్టానికి తూట్లు పొడుస్తూ గత ప్రభుత్వ హయాంలో ప్రతిపక్ష నేతల ఫోన్లను ట్యాప్ చేశారని ఆరోపించారు. తనతో పాటు షబ్బీర్ అలీ , కాంగ్రెస్ పార్టీకి చెందిన అనేకమంది ప్రముఖ నేతల ఫోన్లను అక్రమంగా నిఘాలో ఉంచారని ఆయన మండిపడ్డారు.ప్రతిపక్ష నేతలపై రాజకీయ వేధింపులకు పాల్పడాలనే ఆలోచన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేదని టీపీసీసీ చీఫ్ స్పష్టం చేశారు. రాజకీయ ప్రతీకారం మా లక్ష్యం కాదని ,భవిష్యత్తులో మరెవరూ ఇలాంటి చట్టవిరుద్ధమైన పనులకు పాల్పడకుండా ఉండాలనేదే మా ప్రభుత్వ ఉద్దేశమని అందుకే చట్టం తన పని తాను చేసుకుపోతుందని ఆయన వివరించారు. ఈ కేసులో విచారణా సంస్థలు పారదర్శకంగా పనిచేస్తున్నాయని, దీనిని రాజకీయ కోణంలో చూడాల్సిన అవసరం లేదని హితవు పలికారు.

సంక్షేమ మనసర్కార్
Follow: manasarkar
బుధవారం | హైదరాబాద్
21.01.2026
www.manasarkar.com

## రాశి ఫలాలు

**21-01-2026 బుధవారం**

**మేషం:**
వ్యాపారాల్లో ఉన్న కొన్ని ప్రధానమైన అడ్డంకులను తొలగించుకుంటారు. ఆర్థిక లావాదేవీలు ఆశాజనకంగా సాగుతాయి. నిరుద్యోగులకు కొత్త అవకాశాలు అందుతాయి. కుటుంబ జీవితం చాలావరకు హ్యాపీగా సాగిపోతుంది. పిల్లలు బాగా వృద్ధిలోకి వస్తారు. వృత్తి, ఉద్యోగాలలో కొత్త ప్రోత్సాహకాలను అందుకుంటారు. అనుకున్న పనులు అనుకున్నట్టు పూర్తవుతాయి.

**వృషభం:**
వృత్తి, వ్యాపారాల పరిస్థితి సంతృప్తికరంగా ఉంటుంది. ఆర్థిక వ్యవహారాలు బాగా అనుకూలంగా సాగుతాయి. ఆర్థిక సమస్యలు, ఒత్తిళ్ల నుంచి చాలావరకు బయటపడతారు. ఆస్తి వివాదాల్లో ఆచితూచి వ్యవహరించడం మంచిది. అదనపు ఆదాయానికి అవకాశముంది. కుటుంబ సభ్యులతో సఖ్యతగా ఉండాల్సిన అవ సరం ఉంది. దాంపత్య జీవితం మెరుగ్గా ఉంటుంది.

**మిథునం:**
ఆర్థిక విషయాలకు సమయం బాగా అనుకూలంగా ఉంది. ఆర్థిక పరిస్థితి విషయంలో ఎంత సానుకూల దృక్పథంతో వ్యవహరిస్తే అంత మంచిది. కొత్త ప్రయత్నాలు బాగా కలిసి వస్తాయి. వృత్తి, వ్యాపారాల్లో డిమాండ్ పెరుగుతుంది. పోటీదార్ల మీద పైచేయి సాధిస్తారు. అదనపు ఆదాయ ప్రయత్నాలు బాగా కలిసి వస్తాయి.

**కర్కాటకం:**
ఆర్థిక ప్రయత్నాలు కలిసి వస్తాయి. స్నేహితుల విషయంలో కాస్తంత జాగ్రత్తగా ఉండాల్సిన అవ సరం ఉంది. ఆరోగ్యానికి ఇబ్బందేమీ ఉండదు. ఆశించిన శుభవార్తలు వింటారు. ఇతరులకు మేలు జరిగే పనులు చేస్తారు. దాంపత్యంలో అన్యోన్యత పెరుగుతుంది. డబ్బు కాస్త నష్టపోయే అవకాశముంది.

**సింహం:**
ఉద్యోగంలో పని భారం పెరుగుతుంది. వృత్తి జీవితంలో ఏమాత్రం తీరిక లేని పరిస్థితి ఏర్పడుతుంది. వ్యాపారాలు నిలకడగా, ఆశాజనకంగా పురోగమిస్తాయి. ఇంటా బయటా బాగా ఒత్తిడి ఉంటుంది. ప్రతి పనిలోనూ వ్యయ ప్రయాసలుంటాయి. వ్యక్తిగత, ఆర్థిక సమస్యలకు అనుకోకుండా పరిష్కారం లభిస్తుంది. ఆరోగ్యం బాగా అనుకూలంగా ఉంటుంది.

**కన్య:**
ఉద్యోగంలో ప్రోత్సాహకర వాతావరణం ఉంటుంది. కొత్త లక్ష్యాలను, బాధ్యతలను చేపడతారు. కొందరు బంధుమిత్రుల నుంచి రావాల్సిన డబ్బు చేతికి అందుతుంది. కుటుంబ సమస్యలకు పరిష్కారం లభిస్తుంది. జీవిత భాగస్వామితో కలిసి వస్త్రాభరణాలు కొనుగోలు చేస్తారు. ఇంటా బయటా గౌరవ మర్యాదలు పెరుగుతాయి. వృత్తి, వ్యాపారాల్లో శ్రమ పెరిగినా ఫలితం ఉంటుంది. ఆరోగ్యానికి ఢోకా ఉండదు.

**తుల:**
వృత్తి ఆదాయం బాగా పెరిగే అవకాశం ఉంది. అందుకు తగ్గట్టుగా కుటుంబ ఖర్చులు కూడా పెరుగుతాయి. వృత్తి, ఉద్యోగాల్లో ఊహించని ధన లాభం ఉంటుంది. వృత్తి జీవితం బాగా బిజీగా, లాభదాయకంగా సాగిపోతుంది. కొన్ని ముఖ్యమైన ఆస్తి, ఆర్థిక వ్యవహారాలలో జీవిత భాగస్వామి సలహాలు, సూచనలు తీసుకోవడం మంచిది. ప్రముఖులతో సన్నిహిత సంబంధాలు ఏర్పడతాయి. వ్యక్తిగత సమస్య ఒకటి పరిష్కారం అవుతుంది.

**వృశ్చికం:**
వృత్తి, వ్యాపారాలు బిజీగా సాగిపోతాయి. రావలసిన డబ్బు చేతికి అందుతుంది. బాకీలు, బకాయిలను పట్టుదలగా వసూలు చేస్తారు. ఆర్థిక సమస్యల నుంచి చాలావరకు బయటపడతారు. నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు అందివస్తాయి. పిల్లల నుంచి ఆశించిన శుభవార్తలు వింటారు. ఉద్యోగంలో పనిభారం ఉంటుంది. అధికారులు ఇబ్బంది పెట్టే అవకాశం ఉంది.

**ధనస్సు:**
వృత్తి, ఉద్యోగాల్లో సానుకూల, సంతృప్తికర వాతావరణం ఉంటుంది. వ్యాపారాలు సాఫీగా, ఉత్సాహంగా సాగిపోతాయి. ఎటువంటి ప్రయత్నం చేపట్టినా కలిసి వస్తుంది. మాటకు, చేతకు విలువ పెరుగుతుంది. మంచి పరిచయాలు ఏర్పడతాయి. ఇతరులకు సహాయం చేయడం జరుగుతుంది. రావలసిన సొమ్ము సకాలంలో చేతికి అందుతుంది.

**మకరం:**
వృత్తి జీవితంలో కూడా కొద్దిగా ఒత్తిడి, శ్రమ తప్పకపోవచ్చు. వ్యాపారాలు నిలకడగా ముందుకు సాగుతాయి. అనుకున్న పనులు అనుకున్నట్టు పూర్తవుతాయి. మనసులోని కోరికలు కొన్ని నెరవేరుతాయి. ఒక వ్యక్తిగత సమస్యకు పరిష్కారం లభిస్తుంది. బంధుమిత్రులతో సరదాగా కాలక్షేపం చేస్తారు. సన్నిహితులతో వాదోపవాదాలకు దిగవద్దు. స్నేహ సంబంధాలు వృద్ధి చెందుతాయి.

**కుంభం:**
వ్యాపారాల్లో కార్యకలాపాలు పెరుగుతాయి. కుటుంబానికి సంబంధించి మంచి నిర్ణయాలు తీసుకుంటారు. చాలా కాలంగా పెండింగ్ లో ఉన్న పనుల్ని పట్టుదలగా పూర్తి చేస్తారు. ముఖ్యమైన వ్యవహారాలను చక్కబెడతారు. ఇంటా బయటా బాగా ఒత్తిడి ఉంటుంది. అదనపు ఆదాయ ప్రయత్నాలను పట్టుదలగా కొనసాగిస్తారు.

**మీనం:**
ఆరోగ్యానికి, ఆదాయానికి ఇబ్బంది ఉండదు. వృత్తి, ఉద్యోగాలు చాలావరకు అనుకూలంగా ఉంటాయి. వ్యాపారాలు కలిసి వస్తాయి. ఆర్థిక పరి స్థితి బాగా మెరుగుపడుతుంది. ఆర్థికంగా ఏ ప్రయత్నం తలపెట్టినా సఫలం అవుతుంది. నిరుద్యోగులకు మంచి ఆఫర్ అంది వస్తుంది. దీర్ఘకాలిక అనారోగ్య, ఆర్థిక సమస్యల నుంచి అనుకోకుండా ఉపశమనం లభిస్తుంది.

## కొండగట్టులో కారు బోల్తా..
# 12 మందికి తీవ్ర గాయాలు

**జగిత్యాల (ఏడీఎన్ఎన్):**



జగిత్యాల జిల్లా కొండగట్టు కు దగ్గరలో క్వాలిస్ కారు బోల్తా పడింది. ఈ సంఘటనలో 12 మందికి గాయాలయ్యాయి. భక్తులు ఆంజనేయస్వామి దర్శనార్థం వెళ్తుండగా వాహనం అదుపు తప్పి లోతైన కాలువలో పడిపోయింది. దీంతో క్వాలిస్ కారులో ప్రయాణిస్తున్న వారంతా ప్రమాదానికి గురై తీవ్రమైన దెబ్బలకు గురయ్యారు. గమనించిన స్థానికులు భక్తులను బయటకు తీసుకొచ్చి కాపాడారు. తర్వాత వారిని జగిత్యాల ఆస్పత్రికి తరలించారు.

# లంచ్ బాక్సులో లంచం.. రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న ఏసీబీ

**అన్నమయ్య (ఏడీఎన్ఎన్):**




మదనపల్లె డీఈఓ కార్యాలయంలో రాజశేఖర్, మున్నా లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డారు. శేషాద్రినాయుడు ఫిర్యాదుతో కేసు నమోదు చేసి విచారణ కొనసాగిస్తున్నారు. గుర్రంకొండలోని ఏబీసీ అప్పర్ ప్రైమరీ స్కూల్‌ను హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ చేయడానికి అనుమతులు ఇవ్వాలంటే లంచం ఇవ్వాల్సిందేనంటూ డిమాండ్ చేసిన విద్యాశాఖ అధికారులు చివరకు ఏసీబీకి చిక్కారు. అన్నమయ్య జిల్లా మదనపల్లెలో జరిగిన ఈ ఘటన స్థానికంగా సంచలనం సృష్టిస్తోంది. గుర్రంకొండకు చెందిన ప్రైవేట్ స్కూల్ యజమాని శేషాద్రినాయుడు తన పాఠశాలను హైస్కూల్‌గా అభివృద్ధి చేసేందుకు 2025 అక్టోబర్ నెలలో ఆన్‌లైన్ ద్వారా ప్రభుత్వ ఫీజులు చెల్లించి, అవసరమైన అన్ని పత్రాలను మదనపల్లె డీవైఈఓ కార్యాలయంలో సమర్పించారు. నెల రోజుల తర్వాత ఆ ఫైల్ డీఈఓ కార్యాలయానికి చేరింది. అయితే అన్ని అర్హతలు, డాక్యుమెంట్లు ఉన్నప్పటికీ అనుమతులు మంజూరు చేయకుండా కార్యాలయ అధికారులు లంచం డిమాండ్ చేయడం ప్రారంభించారు. డీఈఓ కార్యాలయంలో అసిస్టెంట్ డైరెక్టర్ రాజశేఖర్, సీనియర్ అసిస్టెంట్ మహబూబాబాషా అలియాస్ మున్నా కలిసి స్కూల్ అప్‌గ్రేడ్‌కు రూ.65 వేలు లంచం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంత మొత్తాన్ని ఇవ్వలేనని శేషాద్రినాయుడు ప్రాధేయపడటంతో, చివరకు రూ.45 వేలకు బేరం కుదుర్చుకున్నారు. డబ్బులు ఇస్తే తప్ప ఫైల్ ముందుకు కదలదని స్పష్టంగా చెప్పడంతో శేషాద్రినాయుడు తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. లంచం ఇవ్వడానికి నిరాకరించినందుకు జనవరి 5న ఫైల్‌పై రిమార్కులు రాసి తిరిగి డీవైఈఓ కార్యాలయానికి పంపించారు. ఈ విషయమై డీఈఓ కార్యాలయాన్ని కలిసిన శేషాద్రినాయుడికి, ముందుగా కుదిరిన ఒప్పందం ప్రకారం రూ.45 వేలు ఇస్తేనే పనిజరుగుతుందని, డబ్బులు సీనియర్ అసిస్టెంట్ మున్నా వద్ద అందజేస్తే సరిపోతుందని సూచించారు. అంతేకాదు, గ్రీన్ కలర్ లంచ్ క్యారియర్ బాక్సులో డబ్బులు పెట్టి సంక్రాంతి సెలవుల తర్వాత జనవరి 19న తీసుకురావాలని మున్నా చెప్పాడు. లంచం ఇవ్వడం ఇష్టం లేని శేషాద్రినాయుడు కడప ఏసీబీ కార్యాలయాన్ని ఆశ్రయించి డీఎస్పీ సీతారామరావుకు ఫిర్యాదు చేశాడు. దీంతో ఏసీబీ అధికారులు పక్కా ప్రణాళికతో రంగంలోకి దిగారు. సోమవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో డీఈఓ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ మున్నా లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు దాడిచేసి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం అసిస్టెంట్ డైరెక్టర్ రాజశేఖర్‌ను కూడా అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసులో మరెవరి ప్రమేయం ఉందా అనే కోణంలో లోతుగా విచారణ చేపడతామని కడప ఏసీబీ డీఎస్పీ సీతారామరావు తెలిపారు. నిందితులు రాజశేఖర్, మున్నాను రిమాండ్ నిమిత్తం నెల్లూరు ఏసీబీ కోర్టుకు తరలిస్తున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో లంచం కోరే అధికారులకు ఇది గుణపాఠమని ఏసీబీ అధికారులు స్పష్టం చేశారు.

# హరీశ్ రావును మళ్లీ విచారణకు పిలుస్తాం

**సీపీ సజ్జనార్ సంచలన వ్యాఖ్యలు!**

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్):**

ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ మంత్రి హరీశ్ రావును సిట్ అధికారులు మంగళవారం సుదీర్ఘంగా విచారించిన నేపథ్యంలో హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ కీలక వ్యాఖ్యలు చేశారు. జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో సుమారు ఏడు గంటలకు పైగా జరిగిన ఈ విచారణ తర్వాత సీపీ సజ్జనార్ మీడియాతో మాట్లాడుతూ, హరీశ్ రావును అవసరమైతే మళ్లీ విచారణకు పిలుస్తామని స్పష్టం చేశారు. హరీశ్ రావు కుమారుడు అమెరికా వెళ్తున్న కారణంగానే ఆయనను ముందుగా వెళ్లేందుకు అనుమతించామని, ఈ కేసు విషయంలో ఎవరినీ ప్రభావితం చేయవద్దని ఆయనకు సూచించినట్లు వెల్లడించారు. హరీశ్ రావుకు సుప్రీంకోర్టులో ఎటువంటి స్టే రాలేదని కూడా



ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు, శ్రవణ్ రావు విచారణలో వెల్లడించిన కీలక సమాచారం ఆధారంగానే హరీశ్ రావును ప్రశ్నించినట్లు తెలుస్తోంది.

# భైంసాలో రోడ్డు ప్రమాదం.. నలుగురు దుర్మరణం..

**నిర్మల్ (ఏడీఎన్ఎన్):**



నిర్మల్ జిల్లా భైంసా పట్టణంలోని సాత్ పూల్ వంతెనపై సోమవారం అర్ధరాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. నిర్మల్ నుంచి నాందేడ్ మార్గం వైపు వెళ్తున్న కంటైనర్ లారీ, నిజామాబాద్ వైపు నుంచి భైంసా పట్టణంలోకి వస్తున్న ఎర్టిగా వాహనం ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఎర్టిగా వాహనంలో ప్రయాణిస్తున్న నలుగురు అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. మరో ఇద్దరు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. కుభీర్ మండలంలోని కుప్టి సర్పంచ్ గంగాధర్‌తో పాటు మరో ఐదుగురు గ్రామస్తులు హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గ్రామస్తుడిని పరామర్శించేందుకు సోమవారం ఉదయం బయలుదేరి వెళ్లారు. వీరందరూ రాత్రిపూట అక్కడి నుంచి తిరుగు ప్రయాణమయ్యారు. మరికొద్ది నిమిషాల్లో భైంసాకు చేరుకునే సమయంలో వారి కారు ప్రమాదానికి గురైంది. ఎదురుగా వచ్చిన కంటైనర్ లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కుభీర్ మండల కేంద్రానికి చెందిన ఎర్టిగా వాహన డ్రైవర్ బొప్ప వికాస్ (24) తో పాటు అందులో ప్రయాణిస్తున్న భోజరామ్ పటేల్ (42), కొడిమెల పెద్ద రాజన్న (62), బోయిడి బాబన్న (65)లు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. ఇక మధ్య సీట్లో కూర్చున్న గ్రామ సర్పంచు గంగాధర్ తీవ్రంగా గాయపడ్డాడు. సిందే ఆనంద్ రావ్, గుండోల్ల లక్ష్మణ్ (చిన్ను) స్వల్ప గాయాలతో బయటపడ్డారు. తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితిలోకి వెళ్లిన సర్పంచ్ గంగాధర్‌ను భైంసాలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్ ఆస్పత్రికి తరలించారు. ప్రమాద సమాచారం అందుకున్న భైంసా ఏఎస్పీ రాజేష్ మీనా, సీఐ సాయికుమార్‌లు ఘటనా స్థలికి చేరుకుని వాహనంలో చిక్కుకున్న మృతదేహాలను స్థానికుల సహాయంతో బయటకు తీయించారు. అయితే తీవ్రమైన ప్రమాదం కారణంగా బోయిడి బాబన్న శరీరం నుంచి తల తెగి పడిపోవడం ప్రమాద తీవ్రత ఎంత దారుణంగా ఉందో సూచిస్తోంది. మృతదేహాలను ట్రాలీ ఆటోలో పోస్టు మార్గం నిమిత్తం భైంసా ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# భార్య గొంతు కోసి హత్య, ఆపై భర్త ఆత్మహత్య..

**సిద్దిపేట (ఏడీఎన్ఎన్):**



సిద్దిపేట - అనుమానం పెనుభూతం పెద్దరోగం అని నానుడి. కట్టుకున్న భార్యను ఓ వ్యక్తి కత్తితో గొంతుకోసి హత్య చేశాడు. తర్వాత కూతురిపై కత్తితో దాడి చేసి, ఆపై తాను ఆత్మహత్యాయత్నం చేశాడు. ఈ ఘటనలో భార్య మృతి చెందగా, కూతురి పరిస్థితి విషమంగా ఉంది. సిద్దిపేట పట్టణంలో సోమవారం తెల్లవారుజామున ఈ విషాదకర ఘటన జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. సిద్దిపేట జిల్లా దూలిమిట్ట మండలం బెక్కల్ గ్రామానికి చెందిన దున్నపోతుల ఎల్లయ్య (50) సుమారు 19 ఏళ్ల క్రితం తన మేన మరదలైన శ్రీలత (40)ను పెళ్లి చేసుకున్నాడు. వీరికి కూతురు హర్షిత (16), కుమారుడు అజయ్ (14) సంతానం ఉన్నారు. ఎల్లయ్య కొంతకాలం క్రితం కుటుంబంతో కలిసి సిద్దిపేట పట్టణానికి వచ్చి అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నాడు. జీవనోపాధి కోసం భార్యాభర్తలు కూలి పనులు చేసుకుంటున్నారు. కూతురు హర్షిత మిట్టపల్లి రెసిడెన్షియల్ స్కూల్ హాస్టల్‌లో ఉంటూ టెన్త్ క్లాస్ చదువుతోంది. అజయ్ కూడా హాస్టల్‌లో ఉంటూ 8వ తరగతి చదువుతున్నాడు. సంక్రాంతి పండుగ సెలవులకు పిల్లలు ఇంటికి వచ్చారు. ఆదివారం రాత్రి అందరూ భోజనం చేసి నిద్రించారు. ఈ క్రమంలో భార్యపై కొంతకాలంగా అనుమానం పెంచుకున్న ఎల్లయ్య, ఆమెను చంపాలని ప్లాన్ వేసుకున్నాడు. అప్పటికే పథకం ప్రకారం పురుగుల మందు డబ్బా కొనుగోలు చేసి ఇంట్లో పెట్టుకున్నాడు. సోమవారం తెల్లవారుజామున నిద్రిస్తున్న భార్య శ్రీలతను కత్తితో గొంతు కోసి హత్య చేశాడు. అనంతరం పక్క గదిలో నిద్రిస్తున్న కూతురు హర్షిత మెడపై కత్తితో దాడి చేసి, నోట్లో పురుగుల మందు పోసి, రోకలితో తలపై గట్టిగా కొట్టాడు. అక్క అరుపులు విన్న అజయ్ నిద్రలేచి తండ్రిని అడ్డుకోబోయాడు. దీంతో ఎల్లయ్య అతడిపై కూడా దాడి చేయడానికి యత్నించగా కుమారుడు బయటకు పరుగెత్తి విషయాన్ని ఇరుగు, పొరుగు వారికి చెప్పాడు. ఇదే సమయంలో ఇంట్లో ఉన్న ఎల్లయ్య కత్తితో గొంతు కోసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని శ్రీలత మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. హర్షిత పరిస్థితి విషమంగా ఉండటంతో చికిత్సకోసం హైదరాబాద్‌కు పంపించారు. గాయపడిన ఎల్లయ్య సిద్దిపేట ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ ఉపేందర్ తెలిపారు.

# చీరాలలో ఘోరం.. తల్లీకొడుకుల ప్రాణాలు బలి..

**బాపట్ల (ఏడీఎన్ఎన్):**



బాపట్ల జిల్లా చీరాలలో ఘోరం జరిగింది.. మైక్రో ఫైనాన్షియర్ల వేధింపులు తట్టుకోలేక చిరు వ్యాపారం చేసుకుంటున్న తల్లీకొడుకులు ఆత్మహత్య చేసుకున్నారు.. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటన ఈనెల 13వ తేదీన జరిగింది. ఒంటిపై పెట్రోల్ పోసుకుని తల్లీకొడుకులు నిప్పంటించుకున్న ఘటనలో అదేరోజు తల్లి మృతి చెందగా, తాజాగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కొడుకు కూడా చనిపోయాడు. ఈ ఘటన చీరాలలో కలకలం రేపింది. మైక్రో ఫైనాన్షియర్ల ఆగడాలను అరికట్టి తల్లీకొడుకుల మృతికి కారణమైన నిందితులను కఠినంగా శిక్షించాలని ప్రజా సంఘాల నేతలు కోరుతున్నారు. వడ్డీవ్యాపారుల వేధింపుల వల్లే తాము చనిపోవాలని నిర్ణయించుకుని ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నామని 90 శాతం కాలిన గాయాలపాలైన సాయి.. మరణించే ముందు మరణ వాంగ్మూలం ఇచ్చాడు. అయితే ఇంతవరకు నిందితులను అరెస్ట్ చేయకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. రెచ్చిపోతున్న ఫైనాన్స్ వ్యాపారులు చీరాలలో మైక్రో ఫైనాన్స్ వ్యాపారులు రెచ్చిపోతున్నారు. వడ్డీల మీద వడ్డీలు వేసి చిరు వ్యాపారులను జలగల్లా పట్టిపీడిస్తున్నారు. వీరి బారినపడి ఎంతోమంది అధిక వడ్డీలు చెల్లించలేక ఆస్తులను, ఆప్తులను కోల్పోతున్నారు. మరికొందరు ఎవరికీ చెప్పుకోలేక, పరువు పోయిందన్న బాధతో ఆత్మహత్యలకు తెగబడుతున్న ఉదంతాలు వెలుగులోకి వస్తున్నాయి. కఠిన చర్యలు తీసుకోరా...? చీరాలలో చిరువ్యాపారుల నుంచి కొందరు వడ్డీ వ్యాపారులు అధిక వడ్డీలు వసూలు చేస్తూ వారిని మానసికంగా మనోవేదనకు గురిచేస్తున్నారని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాల నేతలు డిమాండ్ చేస్తున్నారు. వడ్డీ వ్యాపారులు, డైలీ ఫైనాన్స్ వ్యాపారులను కట్టడి చేయాలని కోరుతున్నారు. తల్లీకొడుకులు మృతి చెందిన ఘటనలో పోలీసులు కఠినంగా వ్యవహరించాలని, ముమ్మందు ఇలాంటి ఘటనలు జరగకుండా చూడాలని డిమాండ్ చేస్తున్నారు. స్పందించని నేతలు, ప్రజా ప్రతినిధులు చీరాల పట్టణంలో ఇంత ఘోరం జరిగితే ఇటు రాజకీయ నేతలు గానీ, అటు పోలీసు ఉన్నతాధికారులు గానీ సీరియస్‌గా ఈ విషయాన్ని తీసుకున్నట్టు కనిపించడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఘటన జరిగిన సమయంలో సంక్రాంతి సంబరాల్లో మునిగిపోయిన నేతలు, పోలీసులు.. ఈ జంట ఆత్మహత్యలపై ఇప్పటికైనా సీరియస్‌గా దృష్టి పెట్టాలని ప్రజా సంఘాల నేతలు కోరుతున్నారు.

# పారిశుధ్య కార్మికుల జీతాలు పెంచింది కేసీఆరే

**గోల్నాక (ఏడీఎన్ఎన్):**



పారిశుధ్య కార్మికుల సేవలను గుర్తించిన కేసీఆర్ నాడు వారు అడక్కుండానే మూడు సార్లు జీతాలు పెంచారని అంబర్‌పేట నియోజకవర్గం ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ గుర్తు చేశారు. వారి సేవలకు వెలకట్టలేమన్న ఆయన వారికి ఎంత చేసినా తక్కువేనని అన్నారు. మంగళవారం అంబర్‌పేట మున్సిపల్ మైదానంలో ప్రముఖ స్వచ్ఛంద సంస్థ నరెడ్కో సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా ఎమ్మెల్యే చొరవతో ఏర్పాటు చేసిన సేవా కార్యక్రమానికి జీహెచ్ఎంసీ అడిషనల్ కమిషనర్ రఘుప్రసాద్, డీఎంసీ మారుతీ దివాకర్, కార్పొరేటర్లు విజయ్‌కుమార్ గౌడ్, బి.పద్మావెంకట్ రెడ్డి, వై.అమృత, ఉమారమేష్ యాదవ్ తదితరులతో కలసి ఎమ్మెల్యే హాజరయ్యారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న దాదాపు తొమ్మిది వందల మంది పారిశుధ్య కార్మికులకు స్వెట్టర్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యంగా కరోనా కష్టకాలంలో పారిశుధ్య కార్మికుల సేవలు మరిచిపోలేమని అన్నారు. వారి ఆత్మగౌరవం కోసం పారిశుధ్య కార్మికులకు బదులుగా ఇంజనీర్లుగా నామకరణ చేసి తగిన గుర్తింపు ఇచ్చే విధంగా జీహెచ్ఎంసీ కౌన్సిల్‌లో నిర్ణయం తీసుకునేలా చర్యలు చేపట్టాలని అధికారులకు కీలక ప్రతిపాదన చేశారు. అంబర్‌పేటలో ఖాళీగా ఉన్న సీపీఎల్ భూమి కేటాయింపు విషయంపై ఇటీవల బతుకమ్మ కుంట పర్యటనకు వచ్చిన సీఎం రేవంత్ రెడ్డి ముందు ప్రతిపాదించిన విషయాన్ని ఎమ్మెల్యే గుర్తు చేశారు. ప్రస్తుతం అది ప్రభుత్వ పరిశీలనలో ఉందని ఆయన తెలిపారు. త్వరలోనే సీపీఎల్ భూమి దక్కే అవకాశం ఉందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అందులో పారిశుధ్య కార్మికులకు డబుల్ బెడ్ రూం ఇళ్లు కట్టించి ఇస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అలాగే నరెడ్కో సంస్థ కరోనా సమయంలో, వరదల సమయంలో వేలాది మందికి ఆహారం అందించి ఆదుకున్నదని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ సంస్థ చేపడుతున్న సేవా కార్యక్రమాలను కొనియాడారు.



# 'డైవర్షన్' కోసమే నోటీసులు

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్):**

కాంగ్రెస్ ప్రభుత్వంలోని అవినీతి ఒకరి తర్వాత ఒకరిది బయట పడుతోందని, దానిని కప్పిపుచ్చుకునేందుకే మాజీ మంత్రి హరీశ్ రావుకు నోటీసులు ఇచ్చి విచారణ పేరుతో హడావుడి చేస్తున్నారని మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి విమర్శించారు. ఆమె మీడియాతో మంగళవారం మాట్లాడుతూ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. రాష్ట్రంలో సంచలనం సృష్టిస్తున్న బొగ్గు కుంభకోణంపై కాంగ్రెస్ ప్రభుత్వానికి నిజాయితీ ఉంటే సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జి ద్వారా విచారణ జరిపించాలని సబితా డిమాండ్ చేశారు. అసలు అవినీతి ఎక్కడ జరిగిందో, ఎవరి హస్తం ఉందో నిష్పక్షపాతంగా బయటకు రావాలని ఆమె స్పష్టం చేశారు. కేవలం విపక్ష నేతలను ఇబ్బంది పెట్టడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఆరోపించారు. రాష్ట్రంలో ఏ ఎన్నికలు వచ్చినా నోటీసులు ఇవ్వడం, విచారణల పేరుతో వేధించడం కాంగ్రెస్‌కు అలవాటుగా మారిందని సబితా ఇంద్రారెడ్డి మండిపడ్డారు. మొన్నటి సర్పంచ్ ఎన్నికల్లో తగిలిన ఎదురుదెబ్బతో తట్టుకోలేకే ప్రభుత్వం ఇలాంటి డ్రామాలకు తెరలేపిందని ఎద్దేవా చేశారు. ఎన్ని నోటీసులు ఇచ్చినా, ఎలాంటి విచారణలు చేసినా ఎదుర్కోవడానికి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉన్నారని ఆమె ధీమా వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను, హామీలను పూర్తిగా గాలికి వదిలేసిందని సబితా విమర్శించారు. బతుకమ్మ చీరల పంపిణీపై స్పందిస్తూ.. మొన్న గ్రామాల్లో పంపిణీ చేసిన ప్రభుత్వం, ఇప్పుడు నగరంలో ఎన్నికలు ఉన్నాయని ఇక్కడ పంచుతోందని ఆరోపించారు. కేవలం ఓట్ల కోసమే ఇలాంటి పనులు చేస్తున్నారని, ప్రజలు అన్నీ గమనిస్తున్నారని ఆమె హెచ్చరించారు.



## ఆరు కొత్త అర్బన్ ఫారెస్టులకు
# గ్రీన్ సిగ్నల్

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్):**

తెలంగాణలో పర్యావరణ పరిరక్షణ , పట్టణ ప్రాంతాల్లో పచ్చదనాన్ని పెంపొందించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం మరో ఆరు కొత్త అర్బన్ ఫారెస్టుల ఏర్పాటుకు పచ్చజెండా ఊపింది. కేంద్ర ప్రభుత్వ 'నగర్ వన్ యోజన' పథకం కింద ఆదిలాబాద్ జిల్లాలోని మావలా, యాపల్‌గూడII, మంచిర్యాల జిల్లాలోని ఇందారం, చెన్నూర్, అలాగే మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలోని యెల్లంపేట, చెంగిచెర్లలో ఈ వనాలను అభివృద్ధి చేయనున్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఈ ప్రాజెక్టుల కోసం కేంద్రం రూ.8.26 కోట్లు మంజూరు చేయగా, అందులో మొదటి విడతగా 70 శాతం నిధులను ఇప్పటికే విడుదల చేసినట్లు అటవీ ముఖ్య సంరక్షణాధికారిణి డాక్టర్ సి.సువర్ణ తెలిపారు. ఈ నిధులను రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ ద్వారా వినియోగించి, నగరాల పరిధిలో కాలుష్యాన్ని తగ్గించడంతో పాటు ప్రజలకు ఆరోగ్యకరమైన, ఆహ్లాదకరమైన జీవన వాతావరణాన్ని కల్పించడమే ఈ పథకం యొక్క ప్రధాన ఉద్దేశమని ఆమె వివరించారు.




## ఇంజినీర్లకు
# జీతాలు లేక ఆకలి కేకలు

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్):**

బల్దియాలో పొరుగు సేవల ఇంజినీర్లు జీతాలు అందక అవస్థలు పడుతున్నారు. రెండు నెలలుగా వేతనాలు అందక.. అప్పుల బాధలు పడలేక వారు ఆవేదనతో సోమవారం మూకుమ్మడిగా జీహెచ్ఎంసీకి వందలామంది ఇంజినీర్లు తరలివచ్చారు. రెండు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదని ప్రధాన కార్యాలయం ముందు కన్నీటి పర్యంతమయ్యారు. జీహెచ్ఎంసీలో గడిచిన ఐదేళ్లుగా న్యాక్ ద్వారా ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన దాదాపు 250 మంది ఇంజినీర్లు పనిచేస్తున్నారు. ఎన్ఆర్‌డీపీ, ఎస్ఎన్‌డీపీ, హౌసింగ్ ఇతర విభాగాల్లో వీరికి ఆయా పనుల పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించారు. అయితే ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన పనిచేస్తున్న వీరి ఒప్పంద గడువును ప్రతి ఏటా రెన్యువల్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే వీరి ఒప్పంద గడువు గత అక్టోబరు నెలాఖరుకు ముగిసింది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల కోడ్ పేరుతో వీరి ఒప్పంద గడువును మళ్లీ పొడిగించకుండా గడిచిన రెండు నెలల పాటు పనిచేయిస్తూ వచ్చిన అధికారులు .. వీరికి నెలవారీ వేతనాల విషయంలో కనికరం చూపడంలేదు. సాంకేతిక కారణాలతో ఫైనాన్స్ విభాగం నుంచి వీరికి జీతాలు ఇచ్చేందుకు వీలుపడదు. అయితే ఇక్కడే శాఖల మధ్య సమన్వయ లోపం ఉంది. అడ్మిన్ విభాగం ముందస్తుగా వీరి సేవలు అవసరం అనుకుంటే ఎప్పటిలాగే గడువును పెంచుకుని జీతాలు ఇచ్చేలా చొరవ చూపాలి. కానీ ఇక్కడ అలా జరగలేదు. ఒప్పంద అంశాన్ని దాచిపెట్టి సదరు ఇంజనీర్లతో పనులు చేయించుకుంటూ వచ్చింది. ఉప ఎన్నికల కోడ్ ముగిసినా వీరికి జీతాలు రాకపోవడం, రోజుల తరబడి అదిగో ఇదిగో అంటున్నారే తప్ప.. జీతాలు ఇవ్వడం లేదంటూ ఏకంగా ప్రధాన కార్యాలయంలో తమ బాధను చెప్పుకొనేందుకు మూకుమ్మడిగా ఇంజనీర్లంతా వచ్చారు. కమిషనర్ అందుబాటులో లేకపోవడంతో ఈఎన్‌సీ భాస్కర్‌రెడ్డిని కలిసి తమకు జరుగుతున్న అన్యాయాన్ని వివరించారు. కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లి న్యాయం చేస్తానని చెప్పడంలో సదరు ఇంజనీర్లు వెనుతిరిగారు. ఒకప్పుడు కామధేనువులా నిధులు కురిపించిన జీహెచ్ఎంసీ నేడు కనీసం ఉద్యోగుల జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితికి చేరడం పట్ల తీవ్ర విమర్శలు వెలువెత్తుతున్నాయి. కాంట్రాక్టర్ల బిల్లులు రూ.వేల కోట్లలో పెండింగ్‌లో ఉంటే, ఇప్పుడు కనీసం పనిచేసిన ఇంజనీర్ల వేతనాలకూ నిధులు లేకపోవడం బల్దియా దివాలా తీసిందనడానికి నిదర్శనమని విశ్లేషకులు భావిస్తున్నారు.



### డబ్ల్యూపీఎల్ 2026లో
# ఆర్సీబీ జోరు

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

మహిళల ప్రీమియర్ లీగ్ 2026 లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జోరు కొనసాగుతోంది. బ్యాటింగ్, బౌలింగ్ రెండింట్లోనూ అద్భుత ప్రదర్శనతో వరుసగా ఐదో విజయాన్ని నమోదు చేసిన ఆర్సీబీ, ఈ ఎడిషన్ లో ప్లేఆఫ్స్ కు అర్హత సాధించిన తొలి జట్టుగా నిలిచింది. 10 పాయింట్లతో పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో కొనసాగుతున్న బెంగళూరు, ఇతర జట్ల కంటే స్పష్టమైన ఆధిక్యంలో ఉంది. మిగిలిన మూడు మ్యాచ్ ల్లో ఒక్క విజయం సాధించినా తొలి స్థానం ఖాయం కావడం విశేషం. వడోదర వేదికగా గుజరాత్ జెయింట్స్ తో జరిగిన కీలక మ్యాచ్ లో ఆర్సీబీ 61 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న బెంగళూరు, నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 178 పరుగులు చేసింది. గౌతమి నాయక్ అద్భుత ఇన్నింగ్స్ తో 73 పరుగులు చేసి జట్టును ముందుకు నడిపించారు. ఆమెకు రిచా ఘోష్ (27), స్మృతి మంధాన (26) చక్కని సహకారం అందించారు. లక్ష్య ఛేదనలో గుజరాత్ జెయింట్స్ పూర్తిగా తడబడింది. ఆర్సీబీ బౌలర్ల కట్టుదిట్టమైన దాడికి గుజరాత్ బ్యాటింగ్ లైనప్ కుప్పకూలింది. నిర్ణీత ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి కేవలం 117 పరుగులకే పరిమితమైంది. ఆష్లే గార్డెనర్ 54 పరుగులతో ఒంటరిగా పోరాడినా, మిగతా బ్యాటర్లు నిలదొక్కుకోలేకపోయారు. బెంగళూరు బౌలర్లలో సయాలి సత్గరే మూడు వికెట్లు తీసి ప్రత్యర్థిని కట్టడి చేశారు. నాదిన్ డిక్లెర్క్ రెండు వికెట్లు పడగొట్టగా, లారెన్ బెల్, రాధా యాదవ్, శ్రేయాంక పాటిల్ తలో వికెట్ తో విజయంలో తమ వంతు పాత్ర పోషించారు. ఈ విజయంతో ఆర్సీబీ ఆత్మవిశ్వాసం మరింత పెరిగింది. లీగ్ దశ ముగిసేలోగానే నాకౌట్ స్టేజ్ కు చేరడం జట్టులోని సమతౌల్యం, స్థిరత్వానికి నిదర్శనంగా మారింది. ఇదే జోరు కొనసాగిస్తే డబ్ల్యూపీఎల్ 2026 టైటిల్ సాధించడం ఖాయమని క్రికెట్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.



### 'ఎర్ర బంగారం'గా రాగి...
# ధరలు ఆకాశానికి

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

ఎలక్ట్రిక్ వైర్ల నుంచి ఎలక్ట్రిక్ వాహనాల వరకు కీలక పాత్ర పోషించే రాగి ధరలు 2026 ప్రారంభంలోనే కొత్త రికార్డులను తాకాయి. బంగారం, వెండి కంటే నిశ్శబ్దంగా దూసుకెళ్లిన రాగి ఇప్పుడు పెట్టుబడిదారుల దృష్టిని ఆకర్షిస్తోంది. ఆర్థిక నిపుణులు దీనిని కొత్త తరహా 'ఎర్రటి బంగారం'గా అభివర్ణిస్తున్నారు. ఏఐ డేటా సెంటర్లు, ఎలక్ట్రిక్ కార్ల వినియోగం వేగంగా పెరగడం, గనుల్లో ఉత్పత్తి తగ్గడం వంటి కారణాలతో రాగికి డిమాండ్ భారీగా పెరిగింది. భవిష్యత్తులో రాగి కొరత తలెత్తే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఒక సాధారణ పెట్రోల్ కారుతో పోలిస్తే ఎలక్ట్రిక్ కారులో మూడు నుంచి నాలుగు రెట్లు ఎక్కువ రాగి వినియోగం అవుతుండటంతో, టెక్నాలజీ భవిష్యత్తు అంతా రాగిపై ఆధారపడే పరిస్థితి ఏర్పడింది.

**డిమాండ్ పెరగడానికి కారణాలు :** నిపుణుల ప్రకారం రాగి ధరల పెరుగుదలకు మూడు ప్రధాన కారణాలు ఉన్నాయి. అమెరికా రాగి దిగుమతులపై భారీ టారిఫ్ లు విధించవచ్చన్న ప్రచారం, చిలీ వంటి దేశాల్లో గనుల సమ్మెలతో సరఫరా తగ్గడం, అలాగే ఈవీలు, 5జీ నెట్‌వర్క్ లు, డేటా సెంటర్ల పెరుగుతున్న అవసరాలు రాగి డిమాండ్ ను మరింత పెంచాయి. ఏడాదిలో దాదాపు 62 శాతం లాభాలు వచ్చాయి. అంతర్జాతీయ మార్కెట్లో కూడా టన్ను రాగి ధర 13,000 డాలర్లు దాటి చరిత్ర సృష్టించింది. ఏడాది కాలంలో బంగారం 76 శాతం లాభంతో రేసులో ముందున్నా, వెండి 169 లాభంతో ఆశ్చర్యపరిచినా, రాగి మాత్రం సైలెంట్ గా సెన్సేషన్ క్రియేట్ చేసింది.

**సామాన్యుల ఇన్వెస్ట్‌మెంట్స్ :** రాగిని బంగారం లాగ నేరుగా కొనడం సామాన్యులకు సాధ్యం కాదు. భారత్ లో ప్రత్యేక రాగి ఈటీఎఫ్ లు కూడా అందుబాటులో లేవు. MCX ఫ్యూచర్స్ లో ట్రేడింగ్ చేయవచ్చుగానీ, ఇది అధిక రిస్క్ తో కూడుకున్నదని నిపుణులు చెబుతున్నారు. ప్రత్యామ్నాయంగా, హిందుస్తాన్ కాపర్ వంటి రాగి ఉత్పత్తి చేసే కంపెనీల షేర్లలో పెట్టుబడి పెట్టవచ్చని సూచిస్తున్నారు. ప్రస్తుతం రాగి ధరలు రికార్డు స్థాయిలో ఉండటంతో జాగ్రత్తగా ఉండాలని నిపుణుల హెచ్చరిక. అమెరికా టారిఫ్ విధానాలపై 2026 మధ్య నాటికి స్పష్టత వచ్చే అవకాశం ఉండటంతో, ఆచితూచి నిర్ణయం తీసుకోవాలని సూచిస్తున్నారు.



### డెలివరీ జాబ్స్
# గిగ్ వర్క్ కాదు : స్విగ్గీ సీఈఓ

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

ఫుడ్ డెలివరీ ఉద్యోగాలను కేవలం 'గిగ్ వర్క్'గా చూడటం సరైంది కాదని స్విగ్గీ ఫుడ్ మార్కెట్ ప్లేస్ సీఈఓ రోహిత్ కపూర్ స్పష్టం చేశారు. దావోస్ లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సు వార్షిక సమావేశంలో పాల్గొన్న ఆయన, డెలివరీ పార్టనర్లు జాబ్ మార్కెట్ కు మూడో కీలక పిల్లర్ లా ఉన్నారని వ్యాఖ్యానించారు. ఫార్మల్ ఎంప్లాయ్‌మెంట్, ఔత్సాహిక వ్యాపారం తర్వాత డెలివరీ జాబ్స్ ఉపాధిలో కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. గత ఏడాది ఒక దశలో స్విగ్గీ వేదికగా సుమారు 25 లక్షల మంది ఉపాధి పొందారని వెల్లడించారు. ఇవి కేవలం స్విగ్గీ గణాంకాలేనని, ఈ రంగంలో ఇంకా విస్తృత అవకాశాలు ఉన్నాయని చెప్పారు. డెలివరీ ఉద్యోగాలకు ఫార్మల్ ఉద్యోగ నిబంధనలను వర్తింపజేయడం సరైంది కాదని, ఈ రంగానికి ప్రత్యేకమైన ఫ్లెక్సిబుల్ లక్షణాలు ఉన్నాయని కపూర్ స్పష్టం చేశారు. కొందరు దీన్ని దీర్ఘకాల ఉపాధిగా, మరికొందరు తాత్కాలికంగా లేదా అదనపు ఆదాయం కోసం ఎంచుకుంటున్నారని తెలిపారు.

# అతన్ని చూసి నేర్చుకోండి: సునీల్ గవాస్కర్

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**





- ఓటమిని ఒప్పుకోని విరాట్ కోహ్లి
- చివరి వరకూ పోరాడి మెరుపు సెంచరీ

న్యూజిలాండ్ తో జరిగిన సిరీస్ లో సెంచరీ చేసి, చివరి వరకు పోరాడిన విరాట్ కోహ్లిపై భారత క్రికెట్ దిగ్గజం సునీల్ గావస్కర్ ప్రశంసలు కురిపించారు. "కోహ్లి ఆలోచన విధానం, అతని నిలకడను చూసి, అందరూ అలవర్చుకోవాలి. ఒకే శైలికి కట్టుబడి కాకుండా, మ్యాచ్ పరిస్థితులకు అనుగుణంగా తన ఆటను కోహ్లి మార్చుకున్నాడు. చివరి వరకు ఓటమిని అంగీకరించకుండా కోహ్లి చేసిన ప్రయత్నం యువ ఆటగాళ్లకు గొప్ప పాఠం. ఇలాంటి మానసిక ధైర్యం ప్రతి క్రికెటర్ లో ఉండాలి" అని మెచ్చుకున్నారు. న్యూజిలాండ్ తో జరిగిన సిరీస్‌లో భారత జట్టు ఓటమికి ప్రధాన కారణం సరైన ఆరంభాలు లేకపోవడమేనని సునీల్ గావస్కర్ అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా భారీ లక్ష్యాలను ఛేదించే సందర్భాల్లో ఇన్నింగ్స్ ను ఎలా నిర్మించాలో యువ ఆటగాళ్లు విరాట్ కోహ్లిని చూసి నేర్చుకోవాలని ఆయన సూచించారు. ఈ సిరీస్ మొత్తం మీద భారత జట్టుకు ఓపెనింగ్ లో స్థిరమైన ఆరంభాలు లభించలేదని గావస్కర్ పేర్కొన్నారు. "నిజంగా చెప్పాలంటే ఈ సిరీస్ లో మనకు సరైన ఆరంభాలు లభించలేదు. ఒకవేళ ఓపెనర్లు మంచి స్టార్ట్ ఇచ్చి ఉంటే, లక్ష్య ఛేదనలో సగం పని అప్పుడే పూర్తయ్యేది" అని విశ్లేషించారు. విరాట్ కోహ్లి ఒంటరిగా పోరాడాల్సి వచ్చిన పరిస్థితి భారత్‌కు భారంగా మారిందని సన్నీ అభిప్రాయపడ్డారు. "కోహ్లికి సరైన సహకారం లభించకపోతే లక్ష్య ఛేదన ఎంత కష్టమవుతుందో ఈ మ్యాచ్ లో స్పష్టంగా కనిపించింది. చివరకు అదే జరిగింది" అని వ్యాఖ్యానించారు. రాహుల్ లాంటి అనుభవజ్ఞుడైన బ్యాటర్ అవుటైన తర్వాత మిడిల్ ఆర్డర్ పై ఒత్తిడి పెరిగిందని చెప్పారు. నితీశ్ కుమార్ రెడ్డి, హర్షిత్ రాణా వంటి యువ ఆటగాళ్ల నుంచి ఎలాంటి ప్రదర్శన వస్తుందో ముందే అంచనా వేయలేని పరిస్థితి ఏర్పడిందని, దీంతో జట్టు ఇబ్బందుల్లో పడిందని గావస్కర్ స్పష్టం చేశారు. భవిష్యత్తులో భారత్ విజయాల బాట పట్టాలంటే టాప్ ఆర్డర్ స్థిరత్వం, మిడిల్ ఆర్డర్ బాధ్యతాయుత ఆట కీలకమని గావస్కర్ అభిప్రాయపడ్డారు. అనుభవం, సహనం, మ్యాచ్ అవగాహన ఉంటేనే భారీ లక్ష్యాలను ఛేదించడం సాధ్యమని స్పష్టం చేశారు.

# ఏఐ వీడియో వివాదంలో రింకూ సింగ్

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**



టీమిండియా యంగ్ సెన్సేషన్, స్టార్ ఫినిషర్ రింకూ సింగ్ ఒక ఏఐ వీడియోతో అనూహ్య వివాదంలో చిక్కుకున్నారు. 2026 టీ20 ప్రపంచకప్‌కు సన్నద్ధమవుతున్న సమయంలో, ఆయన సోషల్ మీడియాలో షేర్ చేసిన ఓ ఏఐ వీడియో మతపరమైన చర్చకు దారి తీసింది. హిందూ దేవుళ్లను అభ్యంతరకరంగా చిత్రీకరించారంటూ కర్ణిసేన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేసింది. రింకూ సింగ్ ఫేస్ బుక్‌లో పోస్ట్ చేసిన వీడియోలో, క్రికెట్ ఆడుతున్న ఆయన విజువల్స్ తో పాటు ఏఐ సృష్టించిన చిత్రాలు ఉన్నాయి. అందులో విష్ణువు, శివుడు, గణేశుడు సన్ గ్లాసెస్ ధరించి కారులో కూర్చున్నట్లు, ఆ కారును హనుమంతుడు నడుపుతున్నట్లు చూపించారు. "నన్ను క్రికెటర్ గా ఎవరు చేశారో తెలుసా?" అనే క్యాప్షన్ తో భక్తి భావంతోనే వీడియోను షేర్ చేసినప్పటికీ, కొందరి మనోభావాలు దెబ్బతిన్నాయి. ఈ వీడియోపై కర్ణిసేన తీవ్రంగా స్పందించింది. దేవుళ్లను ఆధునిక రూపంలో, ఇంగ్లీష్ పాటల నేపథ్యంతో చూపించడం సనాతన ధర్మాన్ని కించపరచడమేనని ఆరోపిస్తూ, అలీగఢ్ లోని సన్నీ గేట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేకపోతే ఆందోళనలు చేపడతామని కర్ణిసేన హెచ్చరించింది. ఫిర్యాదు అందుకున్న పోలీసులు ప్రాథమిక విచారణ ప్రారంభించారు. వీడియో నిజంగా రింకూ ఖాతా నుంచే పోస్ట్ అయ్యిందా? మార్ఫింగ్ జరిగిందా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఇదిలా ఉండగా, న్యూజిలాండ్ తో టీ20 సిరీస్ తో పాటు రాబోయే టీ20 వరల్డ్ కప్ కు రింకూ కీలక ఆటగాడు కావడంతో, ఈ వివాదం ఆయనపై ఒత్తిడి పెంచే అవకాశం ఉందని క్రీడా వర్గాలు భావిస్తున్నాయి. ఈ అంశంపై రింకూ సింగ్ ఇంకా అధికారికంగా స్పందించలేదు.

# బడ్జెట్ రోజు 'ముహూర్త ట్రేడింగ్' మాత్రమేనా?

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**



కేంద్ర బడ్జెట్ 2026 సమర్పణ నేపథ్యంలో ఆదివారం స్టాక్ మార్కెట్ తెరిచి ఉంటుందా? 'ముహూర్త ట్రేడింగ్' లాంటి చిన్న సెషన్ మాత్రమే ఉంటుందా? అనే సందేహాలకు ఎక్స్ఛేంజ్‌లు స్పష్టత ఇచ్చాయి. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ విడుదల చేసిన సర్క్యులర్ ప్రకారం, ఫిబ్రవరి 1న ఆదివారమైనా సరే... లైవ్ ట్రేడింగ్ సాధారణ మార్కెట్ సమయాల్లోనే కొనసాగుతుంది. ఈక్విటీ, డెరివేటివ్స్ విభాగాల్లో ఉదయం 9:15 నుంచి మధ్యాహ్నం 3:30 వరకు వ్యాపారం చేయవచ్చని తెలిపింది. సాధారణంగా ఆదివారం స్టాక్ మార్కెట్ కు సెలవు ఉంటుంది. అయితే 26 ఏళ్ల తర్వాత ఈ సంప్రదాయానికి విరామం కలుగుతోంది. ఆదివారం, 1 ఫిబ్రవరి, 2026న బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్, నేషనల్ స్టాక్ ఎక్సేంజ్ రెండూ పెట్టుబడిదారుల కోసం తెరిచి ఉంటాయని అధికారికంగా ప్రకటించాయి. దీంతో 2026 కేంద్ర బడ్జెట్ చరిత్రలో ప్రత్యేక స్థానం సంపాదించనుంది. ఈ బడ్జెట్ ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు కూడా విశేషం కానుంది. ఇది ఆమె వరుసగా 9వ బడ్జెట్. గతంలో మాజీ ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ 2015, 2016లో శనివారం బడ్జెట్‌ను ప్రవేశపెట్టగా, ఆదివారం బడ్జెట్ రావడం చాలా కాలం తర్వాత ఇదే తొలిసారి. బడ్జెట్ రోజున మార్కెట్ ను తెరిచి ఉంచడం ద్వారా పెట్టుబడిదారులు ప్రధాన ప్రకటనలకు వెంటనే స్పందించే అవకాశం లభిస్తుందని నిపుణులు చెబుతున్నారు. లోక్ సభలో ఉదయం 11 గంటలకు బడ్జెట్ ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో సెన్సెక్స్, నిఫ్టీల్లో భారీ ఊగిసలాటలు ఉండే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. అందుకే ఈ రోజున జాగ్రత్తగా ట్రేడింగ్ చేయాలని సూచిస్తున్నారు.

# భారీ నష్టాలలో స్టాక్ మార్కెట్లు

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**



దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు మంగళవారం భారీ నష్టాలతో ముగిశాయి. సెన్సెక్స్ ఒక దశలో 1,200 పాయింట్లకు పైగా క్షీణించగా, నిఫ్టీ 25,200 దిగువకు చేరింది. చివర్లో కొంత కోలుకున్నప్పటికీ, సూచీలు రెండు నెలల కనిష్ఠ స్థాయిలో ముగిశాయి. ఈ ఒక్కరోజులోనే మదుపర్ల సంపద దాదాపు రూ.9 లక్షల కోట్లు ఆవిరైంది. బీఎస్ఈలో నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.9.46 లక్షల కోట్లు తగ్గి రూ.455.7 లక్షల కోట్లకు చేరింది. సెన్సెక్స్ ఉదయం నష్టాల్లో ప్రారంభమై రోజంతా అదే ధోరణిలో కొనసాగింది. ఇంట్రాడేలో 82,010 పాయింట్ల కనిష్ఠాన్ని తాకిన సూచీ, చివరికి 1,065 పాయింట్ల నష్టంతో 82,180 వద్ద ముగిసింది. నిఫ్టీ 353 పాయింట్లు తగ్గి 25,232 వద్ద స్థిరపడింది. డాలర్‌తో రూపాయి మారకం విలువ 90.97గా నమోదైంది. సెన్సెక్స్ 30 షేర్లలో హెచ్ డీఎఫ్సీ బ్యాంక్ తప్ప మిగిలిన అన్ని స్టాక్స్ నష్టాలు చవిచూశాయి. ఎటెర్నల్, బజాజ్ ఫైనాన్స్, సన్‌ఫార్మా, ఇండిగో, ట్రెంట్ ప్రధానంగా పడిపోయాయి. ఐటీ రంగంలో నిఫ్టీ ఐటీ ఇండెక్స్ 2.1 శాతం పతనమైంది. విప్రో, ఎల్‌టీఐ మైండ్ ట్రీ షేర్లు భారీగా క్షీణించాయి. కొత్త లేబర్ కోడ్లు, బలహీన త్రైమాసిక ఫలితాలపై ఆందోళనలతో ఐటీ స్టాక్స్ పై అమ్మకాల ఒత్తిడి పెరిగింది. ప్రపంచ వాణిజ్యంలో కొనసాగుతున్న అనిశ్చితి, విదేశీ మదుపర్ల భారీ అమ్మకాలు మార్కెట్లపై తీవ్ర ప్రభావం చూపాయి. ముఖ్యంగా ఐటీ స్టాక్స్ లో అమ్మకాల ఒత్తిడి సూచీల పతనానికి ప్రధాన కారణమైంది. గ్రీన్ లాండ్ విషయంలో సహకరించని దేశాలపై భారీ టారిఫ్స్ విధిస్తానని అమెరికా అధ్యక్షుడు బెదిరిస్తుండడంతో టారిఫ్ వార్ భయాలతో స్టాక్ మార్కెట్లు కుదేలవుతున్నాయి.

# కొత్త ట్యాక్స్ రెజీమ్ కే కేంద్రం పెద్ద పీట?

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**




- బడ్జెట్ 2026పై వేతన జీవుల ఆశలు
- కొత్త వెర్సస్ పాత ట్యాక్స్ రెజీమ్

కేంద్ర బడ్జెట్ 2026 కోసం అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఫిబ్రవరి 1న కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్ ఉభయ సభల్లో బడ్జెట్ ను ప్రవేశపెట్టనున్నారు. ఈ నేపథ్యంలో బడ్జెట్ పై సామాన్య ప్రజలు, మధ్యతరగతి, వ్యాపార వర్గాల్లో అంచనాలు భారీగా పెరిగాయి. బడ్జెట్ 2026లో కేంద్ర ప్రభుత్వం పన్ను విధానంలో సంచలన మార్పులు చేయొచ్చన్న ప్రచారం జోరుగా సాగుతోంది. ముఖ్యంగా కొత్త ట్యాక్స్ రెజీమ్ ను మరింత లాభదాయకంగా మార్చేలా, లేదా పాత విధానంలోని కొన్ని మినహాయింపులను కొత్త విధానంలోకి తీసుకువచ్చే అవకాశం ఉందన్న వార్తలు వినిపిస్తున్నాయి.

- సామాన్య ప్రజలు సంక్షేమ పథకాలు, సబ్సిడీలపై ఆశలు పెట్టుకోగా, మధ్యతరగతి వర్గం ప్రధానంగా ఆదాయపు పన్ను మినహాయింపుల కోసం ఎదురుచూస్తోంది. ఇక వ్యాపార వర్గాలు పరిశ్రమలకు ఇచ్చే రాయితీలు, జీఎస్టీ రేట్లలో సవరింపులు, పెట్టుబడులను ప్రోత్సహించే విధానాలపై డిమాండ్లు చేస్తున్నాయి. అయితే ఈసారి బడ్జెట్ లో అత్యధికంగా చర్చకు వస్తున్న అంశం మాత్రం ఇన్ కమ్ ట్యాక్స్ రిలీఫ్ అంశమే.
- కొత్త, పాత పన్ను విధానాలను పోల్చి చూస్తే కీలక తేడాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఓల్డ్ ట్యాక్స్ రెజీమ్ తో పోలిస్తే కొత్త ట్యాక్స్ రెజీమ్ లో పన్ను స్లాబ్ లు తక్కువగా ఉండటంతో, అధిక ఆదాయం పొందేవారికి ఇది కొంత లాభదాయకంగా మారింది. అయితే తగ్గింపులు, మినహాయింపులు మాత్రం చాలా పరిమితంగా ఉన్నాయి.
- ప్రస్తుతం కొత్త ట్యాక్స్ రెజీమ్ లో రూ.12.75 లక్షల వరకు ఆదాయం పొందేవారు ఎలాంటి ఆదాయపు పన్ను చెల్లించాల్సిన అవసరం లేదు. అంటే నెలకు సుమారు రూ.లక్ష వరకు సంపాదించే వారికి జీరో ట్యాక్స్ వర్తిస్తుంది. ఈ కారణంగా కొత్త పన్ను విధానాన్ని మరింత ఆకర్షణీయంగా మార్చేందుకు ప్రభుత్వం దృష్టి సారించినట్లు తెలుస్తోంది.
- ఇదే సమయంలో పాత ఇన్ కమ్ ట్యాక్స్ రెజీమ్‌లో అనేక మినహాయింపులు, తగ్గింపులు అందుబాటులో ఉన్నాయి. సెక్షన్ 80సీ కింద ప్రావిడెంట్ ఫండ్, పీపీఎఫ్ వంటి పెట్టుబడులపై రూ.1.5 లక్షల వరకు పన్ను మినహాయింపు లభిస్తుంది.
- అలాగే హెల్త్ ఇన్సూరెన్స్ ప్రీమియంపై సెక్షన్ 80డీ కింద, ఎన్‌పీఎస్ పెట్టుబడులపై అదనపు మినహాయింపులు ఉన్నాయి. ఇవే కాకుండా హౌస్ రెంట్ అలవెన్స్, లీవ్ ట్రావెల్ అలవెన్స్ , బ్యాంక్ డిపాజిట్లపై వచ్చే వడ్డీకి సెక్షన్ 80TTA కింద మినహాయింపు, హౌస్ లోన్ వడ్డీపై పన్ను ప్రయోజనాలు వంటి అనేక లాభాలు పాత విధానంలో కొనసాగుతున్నాయి. అందుకే ఇప్పటికీ చాలామంది పన్ను చెల్లింపుదారులు ఓల్డ్ ట్యాక్స్ రెజీమ్ కే ప్రాధాన్యం ఇస్తున్నారు.
- ఈసారి బడ్జెట్ లో మధ్యతరగతికి ఎంత మేర రిలీఫ్ లభించనుందో, ఆదాయపు పన్ను విధానంలో ఎలాంటి కీలక మార్పులు చోటుచేసుకోనున్నాయో ఫిబ్రవరి 1న స్పష్టత రానుంది.



### న్యూజిలాండ్ కెప్టెన్ మాటలతో
# టీమిండియాకు టెన్షన్

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

భారత గడ్డపై న్యూజిలాండ్ క్రికెట్ జట్టు చరిత్రాత్మక విజయంతో ఆత్మవిశ్వాసాన్ని అమాంతం పెంచుకుంది. ఈ నేపథ్యంలో న్యూజిలాండ్ కెప్టెన్ మిచెల్ సాంట్నర్ చేసిన వ్యాఖ్యలు టీమిండియాకు హెచ్చరికగా మారాయి. "మాకు భారత్ లో ఆడటం అంటే చాలా ఇష్టం. ఇక్కడి పిచ్‌లు, పరిస్థితులు మాకు బాగా తెలుసు. వరల్డ్ కప్ ముందు భారత్ లాంటి బలమైన జట్టుతో ఆడటం మాకు అద్భుతమైన ప్రాక్టీస్" అని ఆయన పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలే కివీస్ జట్టు ఎంత ఆత్మవిశ్వాసంతో ఉందో చెప్పకనే చెబుతున్నాయి. దీనితో టీమిండియాకు పెద్ద టెన్షన్ పట్టుకుంది. అద్భుతమైన ఫామ్‌తో వన్డే సిరీస్‌లో సెంచరీలతో చెలరేగిన డారిల్ మిచెల్ ఇప్పుడు టీ20ల్లో కూడా అదే ఫామ్ కొనసాగిస్తే, భారత బౌలర్లకు గట్టి సవాల్ తప్పదు. మిడిల్ ఓవర్లలో స్పిన్ ను సమర్థవంతంగా ఆడగలిగే అతడి సామర్థ్యం, భారత స్పిన్ అటాక్ పై ఒత్తిడి పెంచే అవకాశముంది. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి వంటి దిగ్గజాలు ఉన్నప్పటికీ టీమిండియాను 2-1తో ఓడించి, భారత్‌లో తొలిసారిగా వన్డే సిరీస్ గెలిచిన జట్టుగా కివీస్ రికార్డులకెక్కింది. ఈ ఘన విజయం తర్వాత ఇప్పుడు ఐదు మ్యాచ్ ల టీ20 సిరీస్ కు అదే జోష్ తో సిద్ధమవుతోంది. టీ20 ఫార్మాట్ లో మాత్రం ఇప్పటివరకు భారత్ దే పైచేయి. రెండు జట్ల మధ్య జరిగిన 25 టీ20 మ్యాచ్ లలో భారత్ 14 విజయాలు సాధించింది. న్యూజిలాండ్ 10 మ్యాచ్ లలో మాత్రమే విజయం సాధించగలిగింది. అంతేకాదు, గత మూడు ద్వైపాక్షిక టీ20 సిరీస్ ల్లో కూడా భారతే విజేతగా నిలిచింది. అయితే, గణాంకాలు ఎంత అనుకూలంగా ఉన్నప్పటికీ, ప్రస్తుత ఫామ్ చూస్తే ఈ సిరీస్ భారత్ కు అంత తేలికగా ఉండకపోవచ్చని క్రికెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. వరల్డ్ కప్ కు ముందు జరుగుతున్న ఈ టీ20 సిరీస్‌ను రెండు జట్లూ 'మినీ వార్'గా చూస్తున్నాయి. భారత్ కు ఇది తన ఆధిపత్యాన్ని నిలబెట్టుకునే అవకాశం అయితే, న్యూజిలాండ్ కు భారత్ లో మరో చరిత్ర సృష్టించే ఛాన్స్ గా మారింది. భారత స్పిన్ అటాక్ ను కివీస్ ఎలా ఎదుర్కొంటుందన్నదే సిరీస్ ఫలితాన్ని నిర్ణయించే కీలక అంశంగా మారనుంది.



### బ్యాడ్మింటన్ కు సైనా నెహ్వాల్ బైబై ...
# కారణం ఏంటంటే ?

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

భారత మహిళా బ్యాడ్మింటన్‌ను ప్రపంచ స్థాయికి తీసుకెళ్లిన దిగ్గజ షట్లర్ సైనా నెహ్వాల్ తన అంతర్జాతీయ కెరీర్‌కు అధికారికంగా ముగింపు పలికారు. గత కొంతకాలంగా గాయాలతో ఇబ్బంది పడుతున్న సైనా, ఇకపై ప్రొఫెషనల్ స్థాయిలో ఆడటం సాధ్యం కాదని ప్రకటించారు. క్రీడల్లో కెరీర్ నిర్మించుకోవాలనుకున్న అమ్మాయిలకు ఆమె ప్రేరణగా నిలిచారు. ఆమె రిటైర్మెంట్ తో భారత క్రీడా ప్రపంచంలో ఒక స్వర్ణాధ్యాయం ముగిసినట్లయింది. రిటైర్మెంట్ కు ప్రధాన కారణంగా మోకాలి సమస్యలను సైనా వెల్లడించారు. గత రెండేళ్లుగా తీవ్ర నొప్పితో బాధపడుతున్న ఆమెకు ఆర్థరైటిస్ ఉన్నట్లు వైద్యులు నిర్ధారించారు. కార్టిలేజ్ పూర్తిగా దెబ్బతినడంతో కనీస స్థాయి శిక్షణ కూడా కష్టంగా మారిందని చెప్పారు. శరీరం సహకరించని పరిస్థితిలో గౌరవప్రదంగా తప్పుకోవడమే సరైన నిర్ణయమని సైనా స్పష్టం చేశారు. 2023 సింగపూర్ ఓపెన్ తర్వాత ఆమె ఏ టోర్నీలోనూ పాల్గొనలేదు. సైనా నెహ్వాల్ కెరీర్ భారత బ్యాడ్మింటన్ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుంది. 2012 లండన్ ఒలింపిక్స్ లో కాంస్య పతకం సాధించి, బ్యాడ్మింటన్‌లో భారత్ కు తొలి ఒలింపిక్ పతకాన్ని అందించిన ఘనత ఆమెది. 2015లో ప్రపంచ ర్యాంకింగ్స్ లో నంబర్ వన్ గా నిలిచిన తొలి భారత మహిళా షట్లర్ గా చరిత్ర సృష్టించారు. ఆమె ఖాతాలో 10 సూపర్ సిరీస్ టైటిళ్లు, 10 గ్రాండ్ ప్రిక్స్ విజయాలు ఉన్నాయి. కామన్వెల్త్ గేమ్స్ లో మూడు స్వర్ణాలు సహా అయిదు పతకాలు, ఆసియా క్రీడలు, ప్రపంచ ఛాంపియన్షిప్‌ల్లో పతకాలు సాధించిన సైనా, భారత అమ్మాయిలకు రాకెట్ పట్టే ధైర్యం ఇచ్చిన స్ఫూర్తిదాయక అథ్లెట్. ఆమె బాటలోనే పి.వి.సింధు వంటి షట్లర్లు ఎదగడం భారత బ్యాడ్మింటన్ పై సైనా ప్రభావాన్ని చాటుతోంది.



### 'డీ- డాలరైజేషన్' కు
# ఆర్బీఐ మాస్టర్ ప్లాన్

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

అమెరికా డాలర్ ఆధిపత్యానికి చెక్ పెట్టే ఉద్దేశ్యంతో భారత రిజర్వ్ బ్యాంక్ మాస్టర్ ప్లాన్ వేసింది. బ్రిక్స్ కూటమిలోని సభ్య దేశాల అధికారిక డిజిటల్ కరెన్సీలను పరస్పరం అనుసంధానించాలని సూచించినట్లు సమాచారం. ఈ చర్యతో అంతర్జాతీయ లావాదేవీల్లో అమెరికా డాలర్ పై ఆధారపడటం తగ్గే అవకాశం ఉందని విశ్లేషకులు చెబుతున్నారు. 2026లో జరగనున్న బ్రిక్స్ సదస్సు అజెండాలో ఈ ప్రతిపాదనను చేర్చాలని కేంద్ర ప్రభుత్వానికి ఆర్బీఐ సూచించింది. దీనివల్ల అంతర్జాతీయ వాణిజ్యం, పర్యాటక రంగాల్లో చెల్లింపులను మరింత సులభతరం అవుతాయి. బ్రెజిల్, రష్యా, భారత్, చైనా, దక్షిణాఫ్రికాలతో కూడిన బ్రిక్స్ కూటమి ప్రత్యామ్నాయ చెల్లింపు వ్యవస్థల వైపు అడుగులు వేయడంపై అమెరికా ఆందోళన వ్యక్తం చేసింది. అయితే, భారత్ మాత్రం ఇది డీడాలరైజేషన్ లక్ష్యంగా కాదని, వాణిజ్య సౌలభ్యం కోసమేనని స్పష్టం చేస్తోంది. 2025లో బ్రెజిల్‌లో జరిగిన రియో డిక్లరేషన్‌లో సభ్య దేశాల చెల్లింపు వ్యవస్థల మధ్య ఇంటరాపరబిలిటీ పెంచాలని నిర్ణయించగా, తాజా ఆర్బీఐ ప్రతిపాదన దానికి కొనసాగింపుగా భావిస్తున్నారు. ప్రస్తుతం బ్రిక్స్ దేశాల్లో ఏదీ పూర్తిస్థాయి సీబీడీసీని ప్రారంభించకపోయినా, పైలట్ ప్రాజెక్టులు విజయవంతంగా కొనసాగుతున్నాయి. భారత్ లో డిసెంబర్ 2022లో ప్రారంభమైన 'ఈరూపీ'కి ఇప్పటికే 70 లక్షల రిటైల్ వినియోగదారులు ఉన్నారు. ఆఫ్లైన్ చెల్లింపులు, ప్రభుత్వ సబ్సిడీల కోసం కొత్త ఫీచర్లను ఆర్బీఐ అభివృద్ధి చేస్తోంది. మరోవైపు చైనా తన డిజిటల్ యువాన్ ను అంతర్జాతీయంగా విస్తరించేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేసింది. అయితే ఈ కరెన్సీల అనుసంధానం అనుకున్నంత సులభం కాదు. దేశాల మధ్య ఉండే వాణిజ్య అసమానతలు, పాలనా నియమాలను ఒక త్రాటి మీదకు తీసుకురావడానికి విస్తృత చర్చలు జరగాలి. ఈ ప్రతిపాదనలపై ఇంతవరకూ ఏ దేశాల కేంద్ర బ్యాంకులు అధికారిక ప్రకటనలు చేయలేదు.

మనసర్కార్
Follow: manasarkar
బుధవారం | హైదరాబాద్
21.01.2026
www.manasarkar.com



బ్లాక్‌బస్టర్ విజయంపై

# మెగా ఎమోషనల్

ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):

ప్రపంచవ్యాప్తంగా 300 కోట్ల గ్రాస్ సాధించిన 'మన శంకర వర ప్రసాద్ గారు' చిత్రం ఘన విజయం నేపథ్యంలో మెగాస్టార్ చిరంజీవి ఎమోషనల్ మెసేజ్ షేర్ చేశారు. అత్యంత వేగంగా 300 కోట్ల మార్క్ ను చేరిన తెలుగు చిత్రంగా 'మన శంకర వర ప్రసాద్ గారు' ఘనత సాధించింది. ఈ చిత్రం ఉత్తర అమెరికాలో 3 మిలియన్ డాలర్ల మార్కును కూడా అధిగమించి, చిరంజీవి, దర్శకుడు అనిల్ రావిపూడి ఇద్దరికీ అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా నిలిచింది. 8వ రోజు అద్భుతమైన వసూళ్లు నమోదు చేసి, భారీ బుకింగ్‌లతో 9వ రోజున మరింత జోరుని కొనసాగుస్తోంది. ఇప్పటికే అనేక రికార్డులను బద్దలు కొట్టిన ఈ చిత్రం, ఇప్పుడు మరిన్ని మైలురాళ్ల దిశగా అడుగులు వేస్తోంది. ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద సంచలనం సృష్టిస్తూ, పండుగ వాతావరణానికి మరింత ఉత్సాహాన్ని నింపుతున్న తరుణంలో మెగాస్టార్ చిరంజీవి ఈ విజయం వెనుక నిలిచిన ప్రేక్షకులు, డిస్ట్రిబ్యూటర్లు, సినిమా టీమ్ కు కృతజ్ఞతలు తెలిపారు. తన కెరీర్‌లోని ప్రతి మైలురాయి తరతరాల సినీ ప్రేమికుల అభిమానంతోనే రూపుదిద్దుకుందని తెలియజేశారు. "మన శంకర వర ప్రసాద్ గారు సాధించిన ఈ అద్భుతమైన విజయాన్ని చూసి నా మనసు కృతజ్ఞతతో నిండిపోయింది. నేను ఎప్పుడూ మీ ప్రేమకు ప్రతిరూపమని చెబుతూనే ఉంటాను, ఈ రోజు మీరు దానిని మరోసారి నిరూపించారు. ఈ రికార్డు తెలుగు ప్రేక్షకులది, డిస్ట్రిబ్యూటర్లది, దశాబ్దాలుగా నా వెంట నిలిచిన మెగా అభిమానులది. థియేటర్లలో మీ విజిల్స్‌నే నాకు ప్రాణం. రికార్డులు వస్తాయి, పోతాయి... కానీ మీ ప్రేమ మాత్రం శాశ్వతం. ఈ బ్లాక్‌బస్టర్ విజయం దర్శకుడు అనిల్ రావిపుడి, నిర్మాతలు సాహు సుష్మితతో పాటు మొత్తం టీమ్ చేసిన కృషికి నిదర్శనం. నాపై మీరు చూపించిన నమ్మకానికి ఇది అంకితం. వేడుకలు కొనసాగిద్దాం. లవ్ యూ ఆల్! ఈ సందేశంతో చిరంజీవి ఈ చిత్రం చారిత్రాత్మక విజయానికి కారణమైన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు చెప్పడమే కాకుండా, ప్రతి బ్లాక్‌బస్టర్ విజయం వెనుక ఉన్న స్ఫూర్తిని గుర్తు చేశారు. ఆయన మాటలు ఒక సత్యాన్ని బలపరుస్తున్నాయిరికార్డులు మారవచ్చు కానీ చిరు, అతని అభిమానుల మధ్య ప్రేమ శాశ్వతం.

పెళ్లి వార్తల్లో

# వాస్తవం లేదు..

క్లారిటీ ఇచ్చిన డింపుల్ హయాతి

ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):

మాస్ మహారాజా రవితేజ హీరోగా దర్శకుడు కిషోర్ తిరుమల డైరెక్షన్‌లో వచ్చిన సినిమా 'భర్త మహాశయులకు విజ్ఞప్తి'. ఈ సినిమాలో ఆషికా రంగనాథ్ తో పాటు డింపుల్ హయాతి కూడా హీరోయిన్ గా నటించి మెప్పించింది. ఐతే, తాజాగా డింపుల్ సోషల్ మీడియాలో ఒక ఆశ్చర్యకరమైన విషయాన్ని వెల్లడించింది. గతంలో, డింపుల్ హయాతికి డేవిడ్ అనే వ్యక్తితో వివాహం జరిగిందని వార్తలు వచ్చాయి. ఒక అభిమాని ప్రశ్నకు స్పందిస్తూ, డింపుల్ హయాతి తన పెళ్లి గురించి క్లారిటీ ఇచ్చింది. ఇంతకీ, డింపుల్ హయాతి ఏం మాట్లాడింది అంటే.. 'గతంలోనే నాకు పెళ్లి అయింది అని వార్తలు వచ్చాయి. నిజానికి నాకు ఇంకా పెళ్లి కాలేదు. నా పెళ్లికి సంబంధించి వచ్చిన వార్తలు పూర్తిగా నిరాధారమైనవి, వాటిలో ఎలాంటి వాస్తవం లేదు' అని డింపుల్ హయాతి స్పష్టం చేసింది. ప్రస్తుతం డింపుల్ హయాతి ఇచ్చిన సమాధానం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. కారణం.. గత కొంతకాలంగా డింపుల్ హయాతి, డేవిడ్ అనే వ్యక్తితో కలిసి ఉంటుంది.





న్యూయార్క్‌లో ఘనంగా

# అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్

ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):

భారతీయ మూలాలు కలిగిన ప్రముఖ ఫిల్మ్ మేకర్, నటుడు, నిర్మాత వెంకట్ సాయి గుండా న్యూయార్క్ నగరంలో 'ది స్టోరీటెల్లర్ యూనివర్స్' అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్‌ను విజయవంతంగా ప్రారంభించారు. ఈ బూటిక్ ఫెస్టివల్ స్వతంత్ర కథకులకు ప్రపంచ వేదికగా నిలిచింది. కరీంనగర్ (తెలంగాణ)కు చెందిన వెంకట్ సాయి గుండా, తన ఫీచర్ ఫిల్మ్ 'ది డిజర్వింగ్'తో అంతర్జాతీయంగా గుర్తింపు పొందారు. ఇది 25కి పైగా ఫెస్టివల్స్‌లో స్క్రీనింగ్ అయి, అనేక అవార్డులు సాధించింది. ఇప్పుడు ఫెస్టివల్ డైరెక్టర్‌గా, స్వతంత్ర సినిమాలకు మద్దతు ఇచ్చేలా ఈ వేదికను ఏర్పాటు చేశారు. జనవరి 10-11, 2026న న్యూయార్క్ లో జరిగిన తొలి ఎడిషన్‌లో ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల నుంచి ఫిల్మ్‌మేకర్లు, కళాకారులు హాజరయ్యారు. వ్యాపారం కంటే భావోద్వేగాలు, నిజాయితీ, మానవీయ కథలపై దృష్టి సారించిన ఈ ఫెస్టివల్ అద్భుతంగా నిర్వహించడం జరిగింది. ఫెస్టివల్‌ను జగ్గీ అరోరా, జేడీ బ్రూక్‌షైర్, మహేశ్వరపాండియన్ సర్వణన్, తరుణ్ దేగల, తిరుమలేష్ గుండ్రాత్, ప్రత్యూష వుడతలతో కూడిన టీమ్ సహకారంతో నిర్వహించింది. క్రియేటర్‌ఫస్ట్ ఆలోచనతో, ధైర్యమైన, వ్యక్తిగత కథలకు ప్రాధాన్యత ఇచ్చింది. "సినిమా చేయడం ఎంత కష్టమో నాకు తెలుసు. ఫిల్మ్‌మేకర్లకు మద్దతు ఇవ్వడం, వారి కథలను ప్రపంచానికి చేర్చడమే లక్ష్యం," అని వెంకట్ సాయి గుండా తెలిపారు. రాబోయే ఎడిషన్లలో వర్టికల్ స్టోరీటెల్లింగ్‌ను అధికారిక విభాగంగా చేర్చనున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. 2026 ఎడిషన్ సబ్‌మిషన్లు ప్రస్తుతం ఓపెన్‌లో ఉన్నాయి. ఈ ఫెస్టివల్ భారతీయ స్వతంత్ర సినిమా రంగానికి గర్వకారణంగా నిలిచింది. న్యూయార్క్ లో జరిగిన ఈ విజయవంతమైన తొలి ఎడిషన్, భారతీయ ఫిల్మ్‌మేకర్లు కేవలం అంతర్జాతీయ సినిమాల్లో పాల్గొనడమే కాకుండా, నాయకత్వం, సహకారం, సృజనాత్మకలో గ్లోబల్ సినిమాలకు పోటీగా నిలిచేందుకు ఉపయోగపడనున్నట్లు తెలిపారు.

'దండోరా' యూనిట్‌కు

# ఎన్టీఆర్ అభినందన



ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):

మంచి సినిమాలకు ఎప్పుడూ మద్ధతుగా నిలిచే స్టార్ హీరో, మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ రీసెంట్‌గా 'దండోరా' సినిమాను చూశారు. కథ, కథనం, పాత్రల తీరు తెన్నులు, సాంకేతిక నిపుణుల పనితీరు అన్ని ఆయనకు చాలా బాగా నచ్చాయి. దీంతో ఆయన తన ఎక్స్(ట్విట్టర్)లో ''నేను ఇప్పుడే దండోరా సినిమా చూశాను. చాలా లోతుగా, బలమైన ఆలోచనలకు దారి తీసేలా రూపొందించిన సినిమా ఇది. శివాజీ గారు, నవదీప్, నందు, రవికృష్ణ, బిందు మాధవి.... ఇలా అందరూ అద్భుతంగా నటించారు. దీన్నొక రూటెడ్ కథగా, అద్భుతంగా రాసి తెరకెక్కించిన డైరెక్టర్ మురళీ కాంత్ గారికి నా అభినందనలు. అలాగే ఈ ప్రయత్నానికి మద్దతుగా నిలిచిన నిర్మాత రవీంద్ర బెనర్జీ గారికి ప్రత్యేక కృతజ్ఞతలు. ఇలాంటి గొప్ప సినిమాలో భాగమైన నటీనటులు, సాంకేతిక బృందానికి హృదయపూర్వక అభినందనలు'' అని 'దండోరా' చిత్ర యూనిట్‌ను అభినందించారు ఎన్టీఆర్. సంయుక్త ఆంధ్ర ప్రదేశ్‌లో తెలంగాణ నేపథ్యంతో రూటెడ్ కథాంశంతో 'దండోరా' సినిమా రూపొందింది. కలర్ ఫొటో, 'బెదురులంక 2012' వంటి డిఫరెంట్ చిత్రాలను నిర్మించి అందరి దృష్టిని ఆకర్షించిన లౌక్య ఎంటర్‌టైన్‌మెంట్స్ అధినేత రవీంద్ర బెనర్జీ ముప్పానేని దండోరా సినిమాను నిర్మించారు. గత ఏడాది సంక్రాంతి సందర్భంగా ఈ సినిమా డిసెంబర్ 25న రిలీజైంది. మన పూర్వీకుల నుంచి ఇప్పటి వరకు ఇంకా కొన్నిచోట్ల కొనసాగుతోన్న కుల వివక్షను ప్రశ్నించేలా, అందరినీ ఆలోచింపచేసేలా రూపొందిన సినిమా ఇది. మార్క్ కె.రాబిన్ సంగీతం, నేపథ్య సంగీతం..వెంకట్ ఆర్.శాఖమూరి సినిమాటోగ్రఫీ ప్రేక్షకులను మెప్పించాయి. ఇప్పుడు దండోరా చిత్రం ప్రముఖ ఓటీటీ ఛానెల్ అమెజాన్ ప్రైమ్‌లో జనవరి నుంచి తెలుగుతో పాటు హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో స్ట్రీమింగ్ అవుతోంది.

'స్లమ్ డాగ్ 33 టెంపుల్ రోడ్'

# దునియా విజయ్ ఫస్ట్‌లుక్



ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):

డాషింగ్ డైరెక్టర్ పూరి జగన్నాధ్, పవర్ హౌస్ పెర్ఫార్మర్ విజయ్ సేతుపతి మోస్ట్ ఎవైటెడ్ పాన్‌ఇండియా మూవీ 'స్లమ్ డాగ్ 33 టెంపుల్ రోడ్' ఫస్ట్ లుక్ పోస్టర్ కు అద్భుతమైన స్పందన వచ్చింది. షూటింగ్ పూర్తయిన ఈ చిత్రం ఇప్పుడు పోస్ట్‌ప్రొడక్షన్ దశలో ఉంది. ఈ చిత్రాన్ని పూరి కనెక్ట్స్ బ్యానర్ పై పూరి జగన్నాధ్, చార్మీ కౌర్, జెబి మోహన్ పిక్చర్స్ జెబి నారాయణరావు కొండ్రోల్లాతో కలిసి నిర్మిస్తున్నారు. దునియా విజయ్ కుమార్ ఈ సినిమాలో కీలక పాత్రలో కనిపించనున్నారు. ఆయనకి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ, చిత్రబృందం ఆయన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేసింది. ఆ పోస్టర్‌లో ఆయన రఫ్ లుక్‌లో కనిపించడం ఆకట్టుకుంది. స్లీవ్‌లెస్ గ్రీన్ వెస్ట్, బోల్డ్ పెండెంట్, బ్రౌన్ హ్యాట్ తో ఆయన స్టైలింగ్ అదిరిపోయింది. ఆయన ఎనర్జిటిక్ ఎక్స్ ప్రెషన్, స్ట్రీట్ స్మార్ట్, పవర్‌ఫుల్ వైబ్‌ను ఇచ్చాయి. ఈ పాత్ర ఆయన కెరీర్‌లో ఇప్పటివరకు చేయని పూర్తిగా కొత్తగా ఉండబోతోంది. ఈ సినిమాలో విజయ్ సేతుపతి సరసన సంయుక్త కథానాయికగా నటిస్తుండగా, టబు కీలక పాత్ర పోషిస్తున్నారు. బ్రహ్మాజీ, వీటీవీ గణేష్‌లు హ్యూమరస్ పాత్రల్లో నటిస్తున్నారు. 'అర్జున్ రెడ్డి', 'యానిమల్' చిత్రాలలో అద్భుతమైన సంగీతాన్ని అందించిన జాతీయ అవార్డు గ్రహీత హర్షవర్ధన్ రామేశ్వర్, 'స్లమ్ డాగ్' 33 టెంపుల్ రోడ్ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. ఈ చిత్రం తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ ఐదు భాషలలో గ్రాండ్ పాన్‌ఇండియా రిలీజ్ కానుంది.



'క్రేజీ కల్యాణం' నుంచి

# బర్త్‌డే పోస్టర్

ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):

నరేష్ వీకే, అనుపమ పరమేశ్వరన్, తరుణ్ భాస్కర్, రాజ్ వెడ్స్ రాంబాయి ఫేమ్ అఖిల్ ఉడ్డెమారి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న సినిమా "క్రేజీ కల్యాణం". ఈ చిత్రాన్ని యారో సినిమాస్ బ్యానర్ పై ప్రొడక్షన్ నెం. 2గా ప్యాషనేట్ ప్రొడ్యూసర్ బూసమ్ జగన్ మోహన్ రెడ్డి నిర్మిస్తున్నారు. దర్శకుడు బద్రప్ప గాజుల రూపొందిస్తున్నారు. మంగళవారం వెర్సటైల్ యాక్టర్ వీకే నరేష్ బర్త్ డే సందర్భంగా ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ స్పెషల్ పోస్టర్ రిలీజ్ చేశారు మేకర్స్. ఈ పోస్టర్ లో పర్వతాలు అనే పాత్రలో ట్రెడిషనల్ గా వీకే నరేష్ ఆకట్టుకుంటున్నారు. పెళ్లి చుట్టూ సాగే ఆసక్తికరమైన కథతో కంప్లీట్ ఎంటర్ టైన్ మెంట్ తో సాగే చిత్రమిది. తెలంగాణలోని పలు గ్రామీణ ప్రాంతాల్లో "క్రేజీ కల్యాణం" సినిమా చిత్రీకరణ జరిపారు. సురేష్ బొబ్బిలి "క్రేజీ కల్యాణం" సినిమాకు సంగీతాన్ని అందిస్తున్నారు.

నారీ నారీ నడుమ మురారి

# మా నమ్మకాన్ని నిలబెట్టింది

ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):



ఇంటర్వ్యూ...

చార్మింగ్ స్టార్ శర్వా సంక్రాంతి బ్లాక్ బస్టర్ 'నారీ నారీ నడుమ మురారి'. రామ్ అబ్బరాజు దర్శకత్వంలో ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై అడ్వెంచర్స్ ఇంటర్నేషనల్ ప్రై. లిమిటెడ్‌తో కలిసి అనిల్ సుంకర, రామబ్రహ్మం సుంకర నిర్మించారు. సంయుక్త, సాక్షి వైద్య కథానాయికలుగా నటించారు. ఈ నెల 14న విడుదలైన ఈ చిత్రం బ్లాక్ బస్టర్ విజయాన్ని అందుకుని సంక్రాంతి విన్నర్ గా నిలిచి హౌస్ ఫుల్ గా రన్ అవుతోంది. ఈ సందర్భంగా చార్మింగ్ స్టార్ శర్వా మీడియాతో సినిమా విశేషాలు పంచుకున్నారు.

**కంగ్రాట్స్ శర్వా .. సంక్రాంతికి బ్లాక్ బస్టర్ హిట్ కొట్టారు.. ఎలా అనిపిస్తోంది?**

థాంక్యూ. చాలా హ్యాపీగా ఉంది. ప్రతి సినిమా హిట్ కొట్టాలనే కష్టపడి పని చేస్తాం. అనుకున్న రిజల్ట్ రావడం చాలా ఆనందాన్నిచ్చింది.

**కొన్ని సినిమాలకి కథ విన్నప్పుడే తెలిసిపోతుంది కదా?**

అన్ని సినిమాలు కథ బాగుంటేనే చేస్తాం. అయితే అన్ని కుదిరినప్పుడే అది వర్క్ అవుట్ అవుతుంది. ప్రొడ్యూసర్ డైరెక్టర్ హీరో కలిస్తే బడ్జెట్లు పెరగవు. మంచి సినిమాలు బడ్జెట్లో తీయొచ్చు. ప్రతి సినిమా బాగా తీయాలని కూర్చుంటే అన్ని సినిమాలు బాగుంటాయి.

**సినిమాకి చాలా అద్భుతమైన రెస్పాన్స్ ఉంది కానీ ఇంత సంక్రాంతికి చివరిలో రావడానికి కారణం ఏంటి?**

ఆల్రెడీ నాలుగు సినిమాలు బుక్ అయ్యాయి. అయితే ఈ సంక్రాంతికి చాలా పెద్ద లాంగ్ వీకెండ్స్ కలిసి వచ్చాయి. 23 నుంచి 26 వరకు మళ్లీ పెద్ద వీకెండ్ వుంది. మేము కంటెంట్ నీ బలంగా నమ్మాము. సంక్రాంతి సీజన్లో ఆదరిస్తారని నమ్మకం ఉంది. ఆ నమ్మకం మాకు నిజమైంది. ఇప్పుడు నెంబర్ ఆఫ్ థియేటర్స్ పెరుగుతున్నాయి. సినిమాకి చాలా మంచి లాంగ్ రన్ ఉంటుంది. ఈ సినిమా తొలి రోజు నుంచి చాలా నమ్మకం ఉంది. సినిమా ఎప్పుడు వచ్చినా సరే బ్లాక్ బస్టర్ అని మొదటి నుంచి చెప్తున్నాను.

**ఈ సినిమాలు మీరు చాలా యంగ్ అండ్ స్లిమ్ గా కనిపించారు.. బైకర్ కోసం చేసిన ప్రిపరేషన్ దీనికి వర్కౌట్ అయ్యిందా?**

నాకు జాను సినిమా సమయంలో ఒక యాక్సిడెంట్ జరిగింది. నిజంగా పెద్ద యాక్సిడెంట్ అది. తర్వాత నేను బరువు పెరిగాను. శ్రీకారం, ఆడవాళ్లకు జోహార్లు సినిమాల్లో నేను కాస్త లావుగా కనిపిస్తాను, ఆ లుక్ నాకే నచ్చదు. మనకు మనం నచ్చేలా ఉండాలని సంకల్పంతో మొదట వాకింగ్ చేయడం ప్రారంభించాను. తర్వాత రన్నింగ్, ఆ తర్వాత స్ట్రెంత్ ట్రైనింగ్ మీద ఫోకస్ చేశాను. తర్వాత యోగా చేశాను. అవన్నీ కూడా ట్రాన్స్ఫర్మేషన్ అయ్యాయి. బైకర్ లో రెండు రకాల క్యారెక్టర్లు ఉన్నాయి. అందులో ఒకటి ఫాదర్ రోల్. సూర్య సన్నాఫ్ కృష్ణన్ లో సూర్య గారు ఎలా కనిపిస్తారో అలాంటి క్యారెక్టర్. దాని కోసం చాలా కష్టపడ్డాను. అవన్నీ కూడా ఈ ట్రాన్స్ఫర్మేషన్ కి ఉపయోగపడ్డాయి. నిజానికి బైకర్ సినిమా ముందుగా రావాలి. అయితే కొన్ని సాంకేతిక కారణాల వల్ల అది రాలేదు.

**నరేష్ గారికి మీకు భలే సింక్ అయింది కదా**

నరేష్ గారితో నాలుగు సినిమాలు చేశాను. ఆయన ఫెంటాస్టిక్ యాక్టర్. ఈ సినిమాకి అయిన ఇంకొక హీరో. సత్య సుదర్శన్ వెన్నెల కిషోర్ గారు సంపత్ గారు ఇలా అందరి పాత్రలు అద్భుతంగా వచ్చాయి. కామెడీ అంతా సిచువేషన్ గా కుదిరింది.

**బాలకృష్ణ గారి టైటిల్ తీసుకున్నారు ఆయనతోనే లాంచ్ చేయించారు.. ఆ ఒత్తిడి ఏమైనా ఉందా**

అంత గొప్ప సినిమా పేరు పెట్టుకున్నప్పుడు ఆ పేరు నిలబెట్టకపోతే బాగుండదు. నిన్న ఆయనతో మాట్లాడాను. ఎంతో అభినందించారు. నా పరువు నిలబెట్టావ్ శర్వా అన్నారు.

-ఎం.డి అబ్దుల్



అత్యంత భారీ ప్రాజెక్ట్‌గా

# మోదీ బయోపిక్ 'మా వందే'

ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బయోపిక్ ను "మా వందే" టైటిల్ తో సిల్వర్ కాస్ట్ క్రియేషన్స్ బ్యానర్ పై నిర్మిస్తున్నారు ప్రొడ్యూసర్ వీర్ రెడ్డి.ఎం. ఈ చిత్రంలో నరేంద్ర మోదీ పాత్రలో మలయాళ స్టార్ హీరో ఉన్ని ముకుందన్ నటిస్తున్నారు. ఎన్నో పోరాటాల కన్నా తల్లి సంకల్పం గొప్పదనే సందేశాన్నిస్తూ ప్రధాని మోదీ జీవితాన్ని యదార్థ ఘటనల ఆధారంగా అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చేలా తెరకెక్కిస్తున్నారు దర్శకుడు క్రాంతికుమార్.సీహెచ్. ప్రధాని మోదీ వ్యక్తిగత, రాజకీయ జీవితంలోని విశేషాలన్నీ ఎంతో సహజంగా "మా వందే" సినిమాలో చూపించబోతున్నారు. ఈ సినిమా అంతర్జాతీయ ప్రమాణాలతో, అత్యున్నత సాంకేతిక విలువలు, వీఎఫ్ఎక్స్ తో రూపొందుతోంది. "మా వందే" చిత్రాన్ని పాన్ ఇండియా భాషలతో పాటు ఇంగ్లీష్ లోనూ రిలీజ్ చేయనున్నారు. ఎన్నో పోరాటాల కన్నా తల్లి సంకల్పం గొప్పదనే సందేశం "మా వందే" చిత్రంలో ప్రేక్షకుల్ని ఆకట్టుకోనుంది. "మా వందే" సినిమాను సిల్వర్ కాస్ట్ క్రియేషన్స్ సంస్థ 400 కోట్ల రూపాయలకు పైగా హ్యూజ్ బడ్జెట్ తో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోంది. ఈ స్టోరీ డ్రివెన్ మూవీని ప్రపంచంలో తొలిసారిగా తొలిసారి ఆరి అలెక్సా 265 జెంట్రీ, కుకీ లెన్స్ తో తెరకెక్కిస్తుండటం విశేషం. హాలీవుడ్ బ్లాక్ బస్టర్ మూవీ ఆక్వామ్యాన్ లో హీరోగా నటించిన జేసన్ మమొవాను "మా వందే" చిత్రంలో ఓ కీలక పాత్రకు సంప్రదిస్తున్నారు. రవీనా టాండన్, జగపతి బాబు, శరత్ కుమార్ వంటి పేరున్న యాక్టర్స్ ఫస్ట్ సిట్టింగ్ లోనే కథ నచ్చి మూవీ చేసేందుకు అంగీకరించారు. స్టంట్ కొరియోగ్రాఫర్ కింగ్ సోలోమన్ , ప్రొడక్షన్ డిజైనర్ సాబు సిరిల్, ఎడిటర్ శ్రీకర్ ప్రసాద్, డీవోపీ కె.కె. సెంథిల్ కుమార్, మ్యూజిక్ డైరెక్టర్ రవి బస్రూర్ వంటి టాప్ మోస్ట్ టెక్నీషియన్స్ వర్క్ చేస్తున్నారు. ఓ మామూలు బయోపిక్ లా కాకుండా చలనచిత్ర చరిత్రలో చిరకాలం నిలిచిపోయే అత్యంత భారీ ప్రాజెక్ట్ గా "మా వందే" నిర్మాణవుతోంది. ప్రీ ప్రొడక్షన్ కే మూడేళ్ల సమయం తీసుకోవడం చూస్తే ఈ సినిమా కోసం మేకర్స్ ఎంత ఎఫర్ట్స్ పెడుతున్నారో అర్థమవుతోంది. ఇప్పటికే మొదటి షెడ్యూల్ పూర్తి చేసుకున్న "మా వందే" సినిమా సెకండ్ షెడ్యూల్ ఈ నెల 22వ తేదీ నుంచి కాశ్మీర్ లో ప్రారంభం కానుంది.



ఫ్యామిలీ ఎంటర్‌టైనర్

# 'కాన్ సిటీ' టైటిల్ ఫస్ట్‌లుక్

ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):

ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'కాన్ సిటీ' టైటిల్.. ఫస్ట్ లుక్ పోస్టర్‌ను ప్రముఖ దర్శకుడు లోకేష్ కనకరాజ్ లాంచ్ చేశారు. ఈ చిత్రంలో అర్జున్ దాస్ ప్రధాన పాత్రలో కనిపించగా, మలయాళ ఇండస్ట్రీలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న అన్నా బెన్, కామెడీ కింగ్ యోగి బాబు, వెటరన్ నటి వడివుకరసి తో పాటు చైల్డ్ ఆర్టిస్ట్ అకిలన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. పవర్ హౌస్ పిక్చర్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తుంది, హరీష్ దురైరాజ్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. లోకేష్ కనగరాజ్ లాంచ్ చేసిన టైటిల్.. ఫస్ట్‌లుక్ పోస్టర్ మధ్యతరగతి కుటుంబం మనసుని తాకేలా ప్రజెంట్ చేస్తోంది. అర్జున్ దాస్ ఆఫీస్ బ్యాక్‌ప్యాక్‌తో అన్నా బెన్ హ్యాండ్‌బ్యాగ్‌తో యోగి బాబు, వడివుక్కరసి ట్రావెల్ బ్యాగ్స్‌తో చిన్నారి అకిలన్ విజయాన్ని సూచించే ట్రోఫీని తీసుకెళ్లడం క్యురియాసిటీ పెంచింది. తాజా టైటిల్, పోస్టర్ అద్భుతమైన స్పందనను పొందాయి.

Printed and Published By **SHAIK MASTAN** on behalf of **AARAA DIGITAL NEWS NETWORKS**, Printed at YADU GRAPHICS, Ground Floor 3-2-798, STO Bhavan, Chappal Bazar, Kachiguda, Hyderabad, Telangana-500 027
Published at Plot No. 72, Kamalapuri Colony, Phase III, Road No.2, Banjarahills, Hyderabad, Telangana - 500 073. Editor: **SHAIK MASTAN**, Phone No. 040 - 24099999, **PRGI REG. No. : TGTEL/25/A0540**